ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY




బుధవారం 11 ఫిబ్రవరి 2026 | Wednesday 11 February 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 27 సంచిక: 281 | Vol.No 27 Issue No .281 | www.visionandhra.in

## వేములవాడ శివరాత్రి ఉత్సవాలకు సిఎంకు ఆహ్వానం



మిగతా 2లో..


## నేటికీ ఫోన్‌ట్యాపింగ్‌కు పాల్పడుతున్న బిఆర్ఎస్ - పొంగులేటి



ఖమ్మం,ఫిబ్రవరి10 : భారత రాష్ట్ర సమితి నేతలు ఇంకా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారన్న అనుమానం వస్తోందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ఖమ్మం జిల్లా ఎదులాపురం పురపాలక ఎన్నికలపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో మిగతా 2లో..

# తెలంగాణలో నేడు మున్సిపల్ ఎన్నికలు

- 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్
- భారీగా ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పోలీసుల భద్రత
- మక్తల్ ఆరోవార్డు బిజెపి అభ్యర్థి ఆత్మహత్యతో ఎన్నిక వాయిదా




హైదరాబాద్,ఫిబ్రవరి10 : తెలంగాణ రాష్ట్రంలో బుధవారం మున్సిపల్ ఎన్నికలు జరుగ నున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అయితే...నారాయణపేట్ జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో ఆరోవార్డు ఎన్నికను రాష్ట్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహదేవ్ ఆత్మహత్యతో ఎన్నికను రద్దు చేస్తున్నట్టు తెలిపింది. ఎన్నికలకు ఒక్క రోజు ముందే అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే ఎన్నికల సిబ్బంది తమ సరంజామాతో తమకు కేటాయించిన బూతలకు చేరుకున్నారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో మిగతా 2లో..

# తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

- నిధుల్లో కోత.. ఫెడరలిజంపై దాడే...
- సొమ్ములు మావి... గొప్పలు మీవా.?
- ప్రతిసారి మేమిచ్చాం, మేము తెచ్చాం కాదు
- అది తెలంగాణ ప్రజల సొమ్ము
- తెలంగాణ కేంద్రానికి ఇచ్చేది 1,33,208 కోట్లు...
- కేంద్ర పథకాలతో కలిపి ఇచ్చింది 51 వేల కోట్లు మాత్రమే.
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం



హైదరాబాద్,ఫిబ్రవరి10 : కేంద్ర ఆర్థిక విధానాల వల్ల దేశానికి అధికంగా ఆదాయం సమకూరుస్తున్న దక్షిణాది రాష్ట్రాలు అన్యాయానికి గురవుతున్నాయని, ఇది కేవలం ఆర్థిక వివక్షే కాదు, రాజకీయ ఉద్దేశంతో కూడిన వివక్ష అని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. వికసిత్ భారత్ అనే నినాదం ఇస్తూ దేశ అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, దక్షిణాది రాష్ట్రాల పట్ల ముఖ్యంగా తెలంగాణ విషయంలో స్పష్టమైన వివక్ష, నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోందని అన్నారు. 2018-19 నుంచి 2022-23 వరకు ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన మొత్తం పన్నులు రూ.90.80 లక్షల కోట్లు అయితే, ఇందులో దక్షిణాది రాష్ట్రాల నుండే పావుభాగానికి పైగా రూ. 22.86 లక్షల కోట్లు వచ్చాయన్నారు. అయినప్పటికీ, ఈ స్థాయిలో ఆదాయం ఇచ్చిన దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం తిరిగి ఇచ్చిన నిధులు మాత్రం కేవలం 16.3 శాతం మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. ఇది ఆర్థిక సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధం అని మంత్రి వ్యాఖ్యానించారు.పన్నులు చెల్లించిన ప్రతి రూపాయికి తిరిగి వచ్చే నిధులను పోల్చితే కేంద్రం పాటిస్తున్న ద్వంద్వ వైఖరి మిగతా 2లో..

## పిఎంజిపై నిధుల మంజూరుకు

- కేంద్రానికి ప్రతిపాదనలు పంపండి
- సిఎస్ కె. రామకృష్ణా రావు



హైదరాబాద్,ఫిబ్రవరి10 : ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన నాలుగవ దశలో భాగంగా రాష్ట్రంలో రోడ్ కనెక్టివిటి లేని 227 ఆవాసాల్లో 642 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నేడు డా. మిగతా 2లో..

## మహదేవప్ప మృతికి రేవంత్‌దే బాధ్యత

- ఎన్నికల సంఘం విచారణ జరపాలి
- రేవంత్ రెండేళ్లుగా ఏమీ చేయకుండా తనపై విమర్శలా
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ,ఫిబ్రవరి10 : మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతికి సీఎం రేవంత్ బాధ్యత వహించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి కోరారు. అతను అర్థాంతరంగా ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడన్న దానిపై అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఈ మిగతా 2లో..

## స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం

- నోటీసులో సాంకేతిక లోపం..సవరించి అందచేత



న్యూఢిల్లీ,ఫిబ్రవరి10 : లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు మంగళవారంనాడు ఇచ్చిన నోటీసులో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఆ లోపాన్ని సరిచేసి విపక్ష ఎంపీలు మిగతా 2లో..

## మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- మూడు వేల అదనపు బలగాలతో ఎన్నికల బందోబస్తు
- పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్
- ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై సమగ్ర దర్యాప్తు
- డిజిపి శివధర్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,ఫిబ్రవరి10 : తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందని చెప్పారు. ఇతర శాఖల నుంచి మూడు వేల అదనపు బలగాలను ఎన్నికల బందోబస్తు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. ఓటర్లు భయం మిగతా 2లో..

# అమెరికా వాణిజ్య ఒప్పందం భారత్‌కు దెబ్బ

- మన వ్యవసాయాన్ని ముంచేయడం ఖాయం
- వస్త్ర పరిశ్రమకు కూడా కోలుకోలేని నష్టం
- ఎక్స్ వేదికగా మల్లికార్జున ఖర్గే విమర్శలు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి10 : భారత్ అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ఈ ఒప్పందం భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని, రైతులు, పశువులు, వస్త్ర రంగాన్ని బలహీనపరుస్తుందని ఆయన ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని ఆయన ప్రజా సంబంధాల ద్రోహంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 9న విడుదలైన వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ ఫిబ్రవరి 6న భారత్- అమెరికా సంయుక్త ప్రకటనలో చేర్చని షరతులను వెల్లడించిందని ఖర్గే ఎత్తిచూపారు. రష్యా చమురు నిలిపివేయడానికి భారత్ నిబద్ధతను ప్రదర్శించడం వల్లే అదనంగా 25 శాతం సుంకాల్ని తొలగించినట్లు అమెరికా ప్రకటన పేర్కొంది. ఇది భారతదేశ సార్వభౌమత్వాన్ని మిగతా 2లో..

## సిద్దిపేటకే నిధులు విడుదలలో ఆంతర్యం

- హరీష్, రేవంత్ మధ్య ఉన్న బంధం ఏమిటో
- మరోమారు విమర్శలు గుప్పించిన కవిత



హైదరాబాద్,ఫిబ్రవరి10 : కేవలం సిద్దిపేటకే నిధులు విడుదలలో ఆంతర్యం ఏమిటని, హరీష్ రావు, సిఎం రేవంత్ మధ్య ఉన్న బంధం ఏమిటో మిగతా 2లో..

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ ఆపడం సరికాదు




- వారికి బకాయిలు వెంటనే చెల్లించండి
- సిఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ

హైదరాబాద్,ఫిబ్రవరి10 : రిటైర్డ్ ఉద్యోగులకు తక్షణమే బకాయిలు చెల్లించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. 'సీఎం గారూ... మీకు మానవత్వం ఉందా?' అని ప్రశ్నించారు. విశ్రాంత ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించకుండా మానసిక వేదనకు గురి చేయడం మిగతా 2లో..

## నేటినుంచి ఎపి బడ్జెట్ సమావేశాలు

- అధికారులతో స్పీకర్ అయ్యన్న సమీక్ష,
- 14 బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న ఆర్థికమంత్రి



అమరావతి,ఫిబ్రవరి10 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 11న బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10: 30కి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నజీర్ ప్రసంగించనున్నారు. సుమారు గంటసేపు స్పీచ్ మిగతా 2లో..

## బెంగళూరు-చెన్నై హై స్పీడ్ రైల్ కారిడార్

- తిరుపతి మీదుగా వెళ్లేలా ప్లాన్ చేయండి
- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు చంద్రబాబు వినతి



మిగతా 2లో..

## పోలవరం ప్రాజెక్టుపై ఉన్న స్టాప్ వర్క్ ఆర్డర్

- శాశ్వతంగా ఎత్తివేసేలా నిర్ణయం తీసుకోవాలి
- సాగునీటి ప్రాజెక్టులు, అంతర్ రాష్ట్ర వివాదాలపై చర్చ
- కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో చంద్రబాబు భేటీ



మిగతా 2లో..

## తప్పడు గణాంకాలతో హైప్ క్రియేషన్

- గణాంకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే యత్నం
- వాస్తవ పనితీరు మాత్రం ఆశించిన స్థాయిలో లేదు
- ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరును ఎండగట్టిన జగన్



అమరావతి,ఫిబ్రవరి1 : హైప్ ఎక్కువ.. పనితీరు తక్కువ అంటూ కూటమి ప్రభుత్వంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని మిగతా 2లో..

## స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం

తిరిగి నోటీసును లోక్‌సభ సెక్రటరీకి అందజేశారు. విపక్షాలు నోటీసును పరిశీలించాల్సిందిగా లోక్‌సభ సెక్రటేరియట్‌ను ఓం బిర్లానే ఆదేశించారనే ఈ సాంకేతిక లోపం బయటపడింది. విపక్షాలు మొదట ఇచ్చిన నోటీసులో 2026 సంవత్సరానికి బదులుగా 2025 సంవత్సరం అని ఉంది. వెంటనే పొరపాటును సరిచేసి రెండోసారి అవిశ్వాస తీర్మానం నోటీసును లోక్‌సభ సెక్రటరీకి విపక్షాలు అందజేశాయి. ఇండియా కూటమికి చెందిన 118 మంది ఎంపీలు అవిశ్వాస తీర్మాన నోటీసుపై సంతకాలు చేశారు. సభలో మాట్లాడేందుకు విపక్ష నేతలకు స్పీకర్ అవకాశం ఇవ్వడం లేదంటూ ఈ నోటీసు ఇచ్చారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, డీఎంకే పార్టీలు దీనికి మద్దతు పలుకగా, తృణమూల్ కాంగ్రెస్ ఇంతవరకూ సంతకం చేయలేదు. ఈ ప్రక్రియను సమీక్షించనున్నట్లు టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ తెలిపారు. అవిశ్వాస తీర్మానంపై రాహుల్ గాంధీ సంతకం చేయలేదని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో స్పీకర్ తొలగింపు పిటిషన్‌పై ప్రతిపక్ష నేత సంతకం చేయడం సరైంది కాదని, రాహుల్ గాంధీ సంతకం చేయకపోవడానికి అదే కారణమని పేర్కొన్నాయి. కాగా, అవిశ్వాస తీర్మానం పరంగా లోక్‌సభలో బలాబలాలను చూసినప్పుడు లోక్‌సభలో అధికార పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. 293 మందితో మెజారిటీ సభ్యుల బలం వారికి ఉండగా, విపక్షాలకు 214 మంది సభ్యుల బలం ఉంది.

## వేములవాడ శివరాత్రి ఉత్సవాలకు సిఎంకు ఆహ్వానం

హైదరాబాద్,ఫిబ్రవరి10 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి మహా శివరాత్రి జాతర మహోత్సవానికి ఆహ్వానించారు. మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అర్చకులు. కలసి ఆహ్వాన పత్రిక అందచేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు–2026' ఆహ్వానం అందజేసారు. ఈ రెండు ప్రాంతాల్లో శివరాత్రి ఉత్సవాలు విశేషంగా జరుగుతాయి. అందువల్ల వీటికి హాజరు కావాలని మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్ కోరారు.

## నేటికీ ఫోన్‌ట్యాపింగ్‌కు పాల్పడుతున్న బిఆర్‌ఎస్ - పొంగులేటి

మాట్లాడిన విషయాలు బయటకు లీక్ కావడంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులతో మాట్లాడిన మాటలు ఎలా విన్నారో పూర్తి స్థాయిలో విచారణ చేయిస్తామని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దీనితోనే ట్యాపింగ్‌లో వారు ఆరితేరారని గుర్తించవచ్చని అన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ ఆపడం సరికాదు

న్యాయమా అని ప్రశ్నించారు. రిటైర్డ్ అయ్యి రెండేళ్లయినా.. వారి బకాయిలను ఇంకా చెల్లించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 61 మంది విశ్రాంత ఉద్యోగులు తనువు చాలించారని.. వారి చావులకు ఎవరు బాధ్యులని లేఖలో ప్రస్తావించారు. ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగులను రాష్ట్ర సర్కార్ ప్రాధాన్యం లేని కేటగిరీలుగా భావిస్తోందా అని బండి సంజయ్ నిలదీశారు. ప్రభుత్వ తీరు తెలంగాణకు మాయని మచ్చ అని విమర్శించారు. జీవితం మలి సంధ్యలో ప్రశాంతమైన జీవితాన్ని గడపాల్సిన రిటైర్డ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వమే మానసిక వేదనకు గురిచేస్తుండటం క్షమించరానిదన్నారు. ముక్కుమొహం తెలియని వృద్ధులు కష్టాల్లో ఉంటేనే చేతనైనంత సాయం చేయాలని భావించే గొప్ప మానవతా హృదయం ఉన్న తెలంగాణ సమాజం మనదని ఆయన చెప్పుకొచ్చారు. ఉద్యోగ విరమణ చేసిన వెంటనే వారికి బెనిఫిట్స్ అన్నింటినీ చెల్లించి సగౌరవంగా సన్మానించి పంపాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని కేంద్ర మంత్రి÷ర్ అయ్యారు. దీనిని తక్షణమే అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుని వారి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు హైదరాబాద్ నడిబొడ్డున దీక్ష చేసేందుకు వెనకాడబోమని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## నేటినుంచి ఎపి బడ్జెట్ సమావేశాలు

ఉండే అవకాశం ఉంది. తరవాత 11: 30 గంటలకి బీఏసీ సమావేశం జరగనుంది. అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు సంబంధించి ప్రధానంగా చర్చిస్తారు. 20 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. ఇక, ఈ నెల 14వ తేదీన 2026–27కి సంబంధించిన బడ్జెట్ ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టనున్నారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు వరుస సమావేశాలు నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు నిర్వహించే ఆటలు, సంస్కృతిక కార్యక్రమాలపై స్పీకర్ అయ్యన్న సమీక్ష చేశారు. సీఎస్ విజయానంద్, వివిధ శాఖల అధికారులతో అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, సభ్యుల ప్రశ్నలు, వాటికి సమాధానాలపై సమీక్షించారు. డీజీపీ సహా పోలీస్ ఉన్నతాధికారులతో స్పీకర్ అయ్యన్న కీలక సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాలకు కల్పించే భద్రతా ఏర్పాట్లపై చర్చించారు.

## తెలంగాణలో నేడు మున్సిపల్ ఎన్నికలు

బుధవారం పోలింగ్ జరుగనున్నది. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రక్రియ ప్రారంభంకానున్నది. సాయంత్రం 5 వరకు పోలింగ్ జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. ఈ నెల 13న ఓట్ల లెక్కింపుతో ఫలితాలు వెల్లడికానున్నాయి.. ఆ రోజే నగర, పట్టణ ప్రజానీకం ఎవరి వైపు మొగ్గు చూపిందనే ఉతంఠకు తెరపడనున్నది. జిల్లాలవారీగా ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు మంగళవారం తరలించారు. ఎన్నికల సిబ్బంది ఇప్పటికే తమకు కేటాయించిన కేంద్రాలకు వాహనాల్లో వెళ్లారు. ఎన్నికలు జరిగే పురపాలికల్లో పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. అలాగే సమస్యాత్మక ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు.బ్యాలెట్ బాక్సులు, పత్రాలను పోలీస్ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి రాష్ట్రంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు తరలించారు. అక్కడి నుంచి మంగళవారం ప్రతి పోలింగ్ కేంద్రానికి తరలించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అకడ సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ సౌకర్యం కల్పించారు. ఓటర్లు ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల గు ర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. 11న జరుగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని ఇప్పటికే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పోలింగ్ ప్రక్రియ కోసం సిబ్బంది నియామకం, వారికి అందించిన శిక్షణపై సమీక్షించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డిజిపి కూడా పోలీస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

## పిఎంజిఎస్‌వై నిధుల మంజూరుకు

బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో పీ.ఎం.జి.ఎస్.వై 4 వ దశ పనుల మంజూరుకై పంపే ప్రతిపాదనలపై రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్ లతోపాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, పీ.ఎం.జి.ఎస్.వై లో భాగంగా ఇప్పటి వరకు మూడు దశలలో రాష్ట్రానికి మంజూరైన రహదారులు, వంతెనల నిర్మాణ పనులను పూర్తి చేశామని, ఈ పథకం నాలుగవ దశ క్రింద రాష్ట్రంలో పక్కా రహదారులు లేని 227 ఆవాసాలల్లో 642.23 కిలోమీటర్ల రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. అయితే, వీటిలో, 34 పనులకు గాను 148 కిలోమీటర్లకు అటవీ శాఖ అనుమతులు పొందాల్సి ఉందని, ఈ మార్గాల్లో బ్రిడ్జిల నిర్మాణ పనులకు సంబంధించి మరో వారం రోజుల్లో డీపీఆర్ లను పూర్తి చేస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్ తెలిపారు.

## బెంగళూరు-చెన్నై హై స్పీడ్ రైల్ కారిడార్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి10 :బెంగళూరు–చెన్నై హై స్పీడ్ రైల్ కారిడార్‌ను తిరుపతికి కనెక్ట్ చేసేలా చూడాలని కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. దిల్లీ పర్యటనలో భాగంగా అశ్వినీ వైష్ణవ్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. ఏపీని టచ్ చేస్తూ వెళ్లే మూడు హై స్పీడ్ రైల్ కారిడార్లను ప్రకటించడంపై కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ రైల్వే ప్రాజెక్టుల పూర్తి, కొత్త రైలు మార్గాలు, సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యేలా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని సీఎం కోరారు. తాడిపత్రి నుంచి ముంబయి జేఎన్‌పీటీ పోర్టుకు అరటి ఎగుమతులకు వీలుగా 50 శాతం రాయితీపై ఖాళీ రీఫర్ కంటైనర్లు కేటాయించాలన్నారు. విజయవాడ, విశాఖ, తిరుపతి, అమరావతిలో గ్రీన్ ఫీల్డ్ మెగా కోచింగ్ టెర్మినళ్లు ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. ఉత్తర– దక్షిణ భారత్‌లను కలిపేలా ఇటార్సీ– విజయవాడ మధ్య ప్రత్యేక సరకు రవాణా కారిడార్ ఏర్పాటుకు సహకారం అందించాలన్నారు. ఏపీలోని పోర్టులను అనుసంధానిస్తూ విజయవాడ మీదుగా ఖరగ్ పూర్–చెన్నై మధ్య ఈస్ట్ కోస్ట్ కారిడార్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాయలసీమ సహా ఆదివాసీ ప్రాంతాలను కనెక్టు చేసేలా వివిధ కొత్త రైల్వేమార్గాల ప్రతిపాదనల్ని ఆమోదించాలని కోరారు. విశాఖ–విజయవాడ మధ్య హైస్పీడ్, విజయవాడ–కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్, తిరుపతి–చిత్తూరు మధ్య హైస్పీడ్ లింక్ కారిడార్ మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. హైదరాబాద్– శ్రీశైలం– మార్కాపురం కొత్త రైల్వే లైన్ ద్వారా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి కనెక్టివిటీని పెంచాలని, తిరుపతి మీదుగా విజయవాడ–బెంగుళూరు మధ్య వందేభారత్ సర్వీసును నడపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. వివిధ ఎక్స్ ప్రెస్ రైళ్లకు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వటంతో పాటు రైలు బోగీ నిర్వహణ టెర్మినల్ ఏర్పాటు చేయాలని రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

బయటపడుతుందని మంత్రి తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు రూపాయికి సగటున 30 పైసలు ఇస్తూ, ఇదే సమయంలో బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు రూ.1కి రూ.4 చొప్పున ఇస్తున్నారని, ఇది ఆర్థిక అసమతుల్యతను పెంచడమే కాకుండా, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభేదాలను సృష్టించే ప్రమాదకర ధోరణి అని హెచ్చరించారు. ఎక్కువ పన్నులు చెల్లించే రాష్ట్రాలను శిక్షించడం, తక్కువ వసూళ్లు చేసే రాష్ట్రాలను ప్రోత్సహించడం కేంద్ర విధానంగా మారిందని మంత్రి ఆరోపించారు. కేంద్రం చెప్పుకునే వికసిత్ భారత్ విధానం అంటే ఇదేనా అని మంత్రి ప్రశ్నించారు. డిసెంబర్ లో జరిగిన పార్లమెంట్ సమావేశాలలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2024–25 లో తెలంగాణ రాష్ట్రం నుండి 1,33,208 కోట్ల పన్నులు వసూలు అయితే.. కేంద్రం నుండి రాష్ట్రానికి కేంద్ర పన్నుల రూపంలో 27,050 కోట్లు, కేంద్ర గ్రాంట్ల రూపంలో 7,913 కోట్లు, కేంద్ర ప్రాయోజిక పథకాల రూపంలో 16,762 కోట్లు మొత్తంగా 51,725 కోట్లు విడుదల చేసినట్టు పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి సమాధానం చెప్పారని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. 'పథకాల రూపంలో వచ్చిన నిధులను కూడా కలిపితేనే ఈ మొత్తం వస్తోంది. స్వేచ్ఛగా వినియోగించుకునే నిధులు మాత్రం మరింత తక్కువ' అని మంత్రి వివరించారు. జీఎస్టీ సవరణల కారణంగా తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే ఏడాదికి సుమారు రూ.8 వేల కోట్లు నష్టపోతోందని మంత్రి తెలిపారు. ఇక 15వ ఆర్థిక సంఘం సూచించిన రెవెన్యూ లోటు గ్రాంట్లను 16వ ఆర్థిక సంఘం పూర్తిగా పక్కన పెట్టడంతో రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యం÷–ర దెబ్బతిన్నదని విమర్శించారు. రంగాలవారీగా, రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్లకు కత్తెర పెట్టడం వల్ల తెలంగాణకు మరో రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.

ఇది కేవలం లెక్కల విషయం కాదు. ఇది కేంద్రంలో ఉన్న పాలకుల రాజకీయ ఆలోచనల ఫలితం. బలమైన రాష్ట్రాలను బలహీనపరచి, ఆర్థికంగా ఆధారపడేలా చేయాలనే ఉద్దేశమే కనిపిస్తోందని తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలలో బిజెపి పార్టీ అస్థిత్వాన్ని నిలబెట్టుకోవాలనే ఉద్దేశ్యంతోనే దక్షిణాది రాష్ట్రాలకు ముఖ్యంగా తాము అధికారంలో లేని రాష్ట్రాలకు తక్కువ నిధులు విడుదల చేసి, వారి కుంచిత స్వభావాన్ని చూపెడుతున్నారని అన్నారు. ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలు భాగస్వాములే కాని, కేంద్రం దయాధర్మాలపై ఆధారపడేవి కావని మంత్రిగారు స్పష్టం చేశారు. దేశ సమగ్ర అభివృద్ధి సాధించాలన్న, కేంద్రం చెప్పుకుంటున్న వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలన్నా, అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరగాలని, ముఖ్యంగా ఆదాయం సమకూర్చే రాష్ట్రాలపై వివక్ష మానుకోవాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని మంత్రి కోరారు. తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించే బిజెపి ఎంపీలు మరియు కేంద్ర మంత్రులు కూడా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పదేళ్లలో ఏనాడు ప్రశ్నించకపోగా, రాష్ట్రానికి అన్ని తెచ్చాం, ఇన్ని చేశాం, రాష్ట్ర ఖజానాకు కేంద్రమే పూర్తి నిధులు సమకూరుస్తుందనట్లు మాట్లాడటం వారి పతనానికి నాంది. జాతీయ రహదారుల నిర్మాణాలను కూడా రాష్ట్రానికి విడుదల చేసే నిధుల ఖాతాలలో వేస్తున్న ఈ నాయకులు, వాటిని నిర్మించి మళ్లీ ప్రజల నుండే టోల్ చార్జీల రూపంలో వసూలు చేస్తున్న విషయాన్ని మరిచారా అని మంత్రి ప్రశ్నించారు. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతు భరోసా, పంట కొనుగోళ్లు, సాగునీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో భారీగా ఖర్చు చేస్తోందని, కానీ కేంద్రం నుంచి రావాల్సిన న్యాయమైన వాటా రాకపోవడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి అడ్డంకిగా మారుతోందని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ యూనియన్ బ్జడెట్ లో చేర్చాల్సిందిగా చేసిన ప్రతిపాదనలలో ఒక్కటి కూడా మంజూరు చేయలేదని, ఇప్పటికైనా తెలంగాణను రాజకీయంగా శిక్షించే బ్జడెట్‌లు ఇక మానుకోని, ఫెడరలిజాన్ని గౌరవించి, తెలంగాణకు న్యాయమైన వాటా ఇవ్వాలని, లేకపోతే వికసిత్ భారత్ ఒక నినాదంగానే మిగిలిపోతుందని, నిజమైన అభివృద్ధి సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. ఈ విషయంలో రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి నాయకులు కూడా తెలంగాణకు రావాల్సిన న్యాయబద్ధమైన వాటాకోసం కేంద్రంతో పోరాడటానికి మాతో కలిసి రావాలని మంత్రి కోరారు.

# మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

లేకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నేపథ్యంలో 1,183 లైసెన్స్‌డ్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాం. 4,318 మందిని బైండోవర్ చేశాం. 398 నాన్–బెయిలబుల్ వారెంట్లు జారీ చేశాం. 4 రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 55 చెక్‌పోస్టులు ఉన్నాయి. 181 ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిద్ధం చేశాం. ఇప్పటివరకు రూ.3.09 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి 142 కేసులు నమోదు చేశామని అన్నారు. మక్తల్‌లో భాజపా అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాం. మహాదేవప్ప ఆత్మహత్య లేఖ రాయలేదని తెలిసింది. అయితే విచారణలో వివరాలు తెలుస్తాయని అన్నారు. హైదరాబాద్ ఎఫ్‌ఎస్‌ఎల్ ప్రమాదం ఎలా జరిగిందనేది విచారణ చేస్తున్నాం. ఏసీబీ కేసు 2015లో ఉన్న ఆధారాలు కోర్టుకు ఇచ్చాం. ఫోన్ ట్యాపింగ్ కేసులో కూడా అన్నీ పరిశీలించి నివేదికలు ఇచ్చాం. సాంకేతిక నిపుణులతో డేటాను రిట్రీవ్ చేస్తున్నాం అని డీజీపీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఈ ప్రమాదంలో కీలకమైన కేసులకు సంబంధించిన ఆధారాలు కాలిపోయాయనే అనుమానాల నేపథ్యంలో, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి స్పందించారు. ప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం, కేసుల విచారణ ఏ దశలో ఉందనే విషయాలపై ఆయన స్పష్టతనిచ్చారు. ఈ అగ్నిప్రమాదంలో ఎఫ్‌ఎస్‌ఎల్ లోని సర్వర్ రూమ్‌లు పూర్తిగా కాలిపోయాయని డీజీపీ వెల్లడించారు. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే, ఈ సర్వర్లకు ఎటువంటి బ్యాకప్ వ్యవస్థ అందుబాటులో లేదు. 'సర్వర్ రూమ్ పూర్తిగా దగ్ధమైంది. డేటా బ్యాకప్ లేకపోవడం వల్ల కొంత సమాచారం కోల్పోయే ప్రమాదం ఉంది. అయితే, ప్రస్తుతం సాంకేతిక నిపుణుల బృందం రంగంలోకి దిగి, కాలిపోయిన సర్వర్ల నుండి డేటాను తిరిగి వెలికితీసే ప్రయత్నాలు చేస్తోందని ఆయన వివరించారు.

ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో కొన్ని కీలక కేసుల ఆధారాలు మాయమయ్యాయనే ప్రచారాన్ని డీజీపీ కొట్టిపారేశారు. ముఖ్యంగా 2015 నాటి ఏసీబీ కేసుల ఓటుకు నోటు వంటివి గురించి ప్రస్తావిస్తూ, ఆ కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలను తాము 2021లోనే కోర్టుకు సమర్పించామని స్పష్టం చేశారు. అందువల్ల ఇప్పుడు జరిగిన ప్రమాదానికి, ఆనాటి కేసుల ఆధారాలకు ఎటువంటి సంబంధం లేదని ఆయన క్లారిటీ ఇచ్చారు. అదేవిధంగా, రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై కూడా ఆయన స్పందించారు. ఈ కేసులో కావాల్సిన అన్ని అంశాలను ఇప్పటికే నిశితంగా పరిశీలించామని, దానికి సంబంధించిన నివేదికలను ఇప్పటికే సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేశామని తెలిపారు.

## పోలవరం ప్రాజెక్టుపై ఉన్న స్టాప్ వర్క్ ఆర్డర్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి10 : ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం సమావేశమయ్యారు. ఏపీలోని వివిధ సాగునీటి ప్రాజెక్టుల అనుమతులు, ఆర్థిక సాయం, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల భవిష్యత్, తాగునీటి భద్రతకు ఇవి ఎంతో ముఖ్యమని సీఎం వివరించారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయంపై పెండింగ్‌లో ఉన్న అంశాలతో పాటు, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపైనా ముఖ్యమంత్రి సవివరంగా చర్చించారు. సీఎం చంద్రబాబు ఈ భేటీలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ముఖ్య అంశాలను ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టుపై ఉన్న స్టాప్ వర్క్ ఆర్డర్‌ను శాశ్వతంగా ఎత్తివేసేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ ఆర్డర్ వల్ల ప్రాజెక్టు అమలులో తీవ్ర అవరోధాలు ఏర్పడుతున్నాయని వివరించారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు వల్ల పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్‌మెంట్ చేయాలన్నారు. అలాగే ఫేజ్–ఎఎ పనులకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫేజ్–ఎఎలో భూసేకరణ, పునరావాసం, రక్షణ కట్టలు వంటి పనులు చేపట్టాల్సి ఉందని, దీనికి అదనంగా సుమారు రూ.32,000 కోట్ల నిధులు అవసరమని ముఖ్యమంత్రి తెలిపారు. ÷రిళిదావరి వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో ప్రతిపాదిత పోలవరం–నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపైనా చర్చ జరిగింది. తాగు, సాగునీరు, పరిశ్రమల అవసరాలు తీర్చే కీలక ప్రాజెక్టుగా చెప్పుకొచ్చారు సీఎం. జాతీయ నదుల అనుసంధాన విధానంలో భాగంగా దీనికి అనుమతులు మంజూరు చేసి సాంకేతిక, ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్–ఒడిశా మధ్య వంశధార నీటి వివాదం పరిష్కారించాలని కోరారు. వంశధార నీటి వివాద ట్రిబ్యునల్ (వీడబ్ల్యుడీటీ) తుది నివేదికను వెంటనే గెజిట్‌లో ప్రచురించాలని, దీని ఆధారంగా నేరడి బ్యారేజ్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని ముఖ్యమంత్రి విన్నవించారు. గోదావరి జలాల పంపకంపై ఆంధ్రప్రదేశ్–తెలంగాణ మధ్య కొనసాగుతున్న వివాదంపై కూడా చర్చించారు. ఈ వివాదం పరిష్కారం కోసం గోదావరి నీటి వివాదాల ట్రిబ్యునల్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు సీఎం. ఎగువ కృష్ణాపై కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు చేపట్టిన చర్యలపై సీఎం తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే దిగువ ప్రవాహ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ ఎంపీలు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అమెరికా వాణిజ్య ఒప్పందం భారత్‌కు దెబ్బ

దెబ్బతీయడమేనని ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ÷ూరత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కేంద్రాన్ని అడిగినప్పుడు రష్యా చమురును నిలిపివేస్తున్నట్లు తమకు చెప్పలేదని ఖర్గే అన్నారు. అయితే ఈ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బహిరంగంగా ట్వీట్ ద్వారా ప్రకటించాడు. రష్యన్ ఫెడరేషన్ చమురు కొనుగోలును నిలిపివేయడానికి భారతదేశ నిబద్ధతను అదనపు 25 శాతం సుంకాన్ని తొలగించడానికి ఒక షరతుగా జాబితా చేసినట్లు వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్ స్పష్టంగా చెప్పింది. దీన్నిబట్టి చూస్తే భారతదేశ సార్వభౌమత్వాన్ని హరించడానికి మోడీ ప్రభుత్వం అంగీకరించింది ఎందుకు? అని ఆయన ప్రశ్నించారు. ఈ ఒప్పందం వల్ల భారతదేశ వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటుందని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. పప్పుధాన్యాలు, జన్యుపరంగా మార్పు చేసిన (జీఎం) ఫీడ్, ఎండిన డిస్టిలర్ల ధాన్యాలు (డిడిజిలు) అంటే మొక్కజొన్న, సోయాబీన్స్.. ఇక పశుగ్రాసం కోసం ఎర్రజొన్నలను కూడా అమెరికా నుంచి దిగుమతి చేసుకునేటట్టు సైలెంట్‌గా ఇందులో చేర్చారని ఖర్గే ఆరోపించారు. దీని ఫలితం రెండు కోట్ల రైతులు, పశువుల పెంపకందారులు నష్టోపోవచ్చని ఖర్గే హెచ్చరించారు. భారతదేశ చరిత్రలో మొదటిసారిగా.. ఒక ప్రభుత్వం మన వ్యవసాయాన్ని విదేశీ వస్తువులకు తలుపులు పూర్తిగా తెరిచింది. ఈ ఒప్పందంలో అదనపు ఉత్పత్తులు అంటే.. అర్థం ఇదే. ఈ విషయం మనకు తెలుసు. ఫిబ్రవరి 9న కొత్తగా విడుదల చేసిన వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్‌లో 'పల్స్' అనే పదాన్ని సైలెంట్‌గా జోడించింది. అయితే ఫిబ్రవరి 6, 2026న జారీ చేసిన భారత్ ? అమెరికా సంయుక్త ప్రకటనలో ఇవి లేవు. మరోవైపు బంగ్లాదేశ్ అమెరికా పత్తి దిగుమతులకి సున్నా శాతమే పన్నులు విధించగా.. భారత్ 18 శాతం పన్నులు విధించడాన్ని ఖర్గే విమర్శించారు. 18 శాతం పన్నులు విధించడాన్న పెద్ద విజయంగా మోడీ ప్రభుత్వం చెప్పుకుంటోందని ఖర్గే ఆరోపించారు. అమెరికా భారత రైతుల కంటే బంగ్లాదేశ్‌ను ప్రోత్సహించి.. తన సొంత లాభాలను కాపాడుకుంది. తిరుపూర్, సూరత్‌వంటి వస్త్ర కేంద్రాలు 18 శాతం పన్నుల పరిధిలోకి రావడంతో భారతీయ వస్త్ర రంగానికి డబుల్ దెబ్బ తగిలింది. జాతీయ ప్రయోజనాలను, ఎగుమతి ఇంజిన్‌ను త్యాగం చేసే ప్రజా సంబంధాల ద్రోహమా అని ఖర్గే ఎక్స్ పోస్టులో ప్రభుత్వాన్ని విమర్శించారు.

## తప్పుడు గణాంకాలతో హైప్ క్రియేషన్

కూటమి ప్రభుత్వంపై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వానికి హైప్ తప్ప పనితీరు లేదని ఆరోపిస్తూ, ఆర్థిక గణాంకాల పేరిట ప్రజలను మభ్యపెడుతున్నారని ఎక్స్ వేదికగా గణాంకాలు బయటపెట్టారు.. చంద్రబాబు విజన్ గురించి పెద్దగా ప్రచారం చేస్తున్నప్పటికీ, వాస్తవ పనితీరు మాత్రం ఆశించిన స్థాయిలో లేదని జగన్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మందగమనంలో ఉందని చెబుతూ, కృత్రిమ గణాంకాలతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందన్న భ్రమను ప్రభుత్వం సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2024–25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆర్థిక వృద్ధి 11.75 శాతంగా, జాతీయ వృద్ధి 9.8 శాతంగా ఉందని ప్రకటించిందని జగన్ గుర్తు చేశారు. అలాగే 2025–26లో రాష్ట్ర వృద్ధి 10.75 శాతం, జాతీయ వృద్ధి 8 శాతం మాత్రమేనని అంచనా వేస్తోందని తెలిపారు. 2023–24, 2024–25 రెండేళ్ల కాలానికి కలిపి రాష్ట్ర జిఎస్‌డి సిఎడిఆర్ 11.09 శాతమని ప్రభుత్వం చెబుతోందని, దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందన్న ప్రచారం జరుగుతోందని అన్నారు. అయితే ఈ గణాంకాలు ఏ స్వతంత్ర సంస్థ విడుదల చేసినవి కావని, పూర్తిగా చంద్రబాబు కార్యాలయం తయారు చేసినవేనని జగన్ ఆరోపించారు. నిజంగా రాష్ట్ర ఆర్థిక వృద్ధి అంతగా ఉంటే, అదే స్థాయిలో ప్రభుత్వ ఆదాయాలు కూడా పెరగాలని స్పష్టం చేశారు. అంఉ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, గత రెండేళ్లలో రాష్ట్ర పన్ను ఆదాయాల వృద్ధి అంఉఖీ కేవలం 1.97 శాతం మాత్రమేనని జగన్ తెలిపారు. 11.09 శాతం ఉ÷ూఆఖ వృద్ధి చూపుతూ, పన్ను ఆదాయాలు కేవలం 1.97 శాతం మాత్రమే పెరగడం ఆర్థిక నిపుణులను ఆశ్చర్యానికి గురిచేస్తుందని వ్యాఖ్యానించారు. ఇది కృత్రిమ గణాంకాల వల్లే సాధ్యమని విమర్శించారు జగన్.. ఈ ఆర్థిక సంవత్సరపు తొలి 9 నెలల గణాంకాలను అంఉ 23 రాష్ట్రాలకు విడుదల చేయగా, పన్ను ఆదాయాల వృద్ధి విషయంలో ఆంధ్రప్రదేశ్ 22వ స్థానంలో నిలిచిందని చెప్పారు. అంటే కింద నుంచి రెండో స్థానంలో ఉందని వివరించారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ స్థూల పన్ను ఆదాయాలు 9.64 శాతం పెరిగితే, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 1.97 శాతం మాత్రమే పెరిగాయని పేర్కొన్నారు. అయితే, ఇలాంటి పరిస్థితుల్లోనూ రాష్ట్ర ఆర్థిక పనితీరు కేంద్రాన్ని మించిందని ప్రభుత్వం చెప్పడం వాస్తవాలకు విరుద్ధమని వైఎస్ జగన్ విమర్శించారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉన్న అంశాలు ప్రభుత్వ అప్పులు, అవినీతి, రాజకీయ కక్ష సాధింపు, తప్పుడు ప్రచారం మాత్రమేనని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## మహదేవప్ప మృతికి రేవంత్‌దే బాధ్యత

మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తలాతోకా లేకుండా రేవంత్ మాట్లాడుతున్నారని మండిపడా ్డరు. ముఖ్యమంత్రి స్థానంలో ఉంటూ రెండేళ్లుగా మాటలతో కాలయాపన చేశారని.. ఏం చేస్తారో చేతల్లో చూపించాలన్నారు. ఇచ్చిన మాటపై నిలబడే శక్తి లేకపోతే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇకపోతే తన పేరును మార్చి పిలుస్తున్నారని ఫైర్ అయ్యారు. 'మీరు రేవంత్ ఖాన్ అని మార్చుకోండి.. మాకు అభ్యంతరం లేదు. కానీ.. మా తల్లి పెట్టిన పేరు మార్చడానికి మీరెవ రు? మాపై వ్యక్తిగత విమర్శలు సరికాదు. మీకు దెయ్యాలు.. దేవతల్లా కనపడవచ్చు. మజ్లిస్‌తో మీరు కాపురం చేసినన్నాళ్లూ.. మేం నిప్పులు పోస్తాం' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో అన్ని స్థానాల్లో ఎంఐఎం ఎందుకు పోటీ చేయలేదని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. తాను ఎవ్వరికీ దత్తపుత్రుడ్ని కాదని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మధ్య ఏవైనా విభేదాలుంటే వారే తేల్చుకోవాలని, తనను మధ్యలో లాగడం ఎందుకని ప్రశ్నించారు.

తన గురించి తప్పుగా మాట్లాడటం సరికాదన్నారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేయకుండా కిషన్ రెడ్డి పేరు మారుస్తానని అంటున్నారని కేంద్ర మంత్రి మండిపడ్డారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేస్తే కేంద్ర ప్రభుత్వం అడ్డురాకుం డా చూసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక గాంధీ.. ఒక్క రోజూ కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడలేదని విమర్శించా రు. తామెప్పుడూ బీఆర్‌ఎస్‌తో కలవలేదని తేల్చిచెప్పారు. గతంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పోటీ చేశాయని గుర్తుచేశారు. ఇప్పుడేమీ చేయలేక తనపై ఆడి పోసుకుంటున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదా? కిషన్ రెడ్డిదా.? అనేది తెలంగాణ సమాజం ఆలోచించాలన్నారు.

## సిద్దిపేటకే నిధులు విడుదలలో ఆంతర్యం

చెప్పాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మున్సిపల్ బూతుల వర్షం ఆగిపోవడం సంతోషంగా ఉందని కల్వకుంట్ల కవిత అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం చూశాక.. పార్టీ గుర్తులు లేకుండా ఎన్నికలు జరిగితే బాగుండేదని కవిత అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో మంచినీరు, పారిశుధ్యం లోపిస్తోందని, ఈ అంశాలపై ఎన్నికల ప్రచారంలో చర్చ జరగలేదని ఆమె వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని ప్రజలకు సూచించారు. కేవలం సిద్ధిపేట మున్సిపాలిటీకి మాత్రమే నిధులు మంజూరు అయ్యాయని.. హరీష్ రావు, ముఖ్యమంత్రికి మధ్య ఏముందో అర్థం చేసుకోవాలని కవిత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంపద సృష్టించకుండా.. ఆస్తులను అమ్ముతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 50 శాతం మంది రైతులకు ఇంకా రుణమాఫీ చేయలేదని వెల్లడించారు. రుణమాఫీపై చర్చకు తాము సిద్ధమని.. సచివాలయాలనికి రమ్మంటారా.. ముఖ్యమంత్రి సొంత జిల్లాకు రమ్మంటారా అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా నిజాలు చెప్పాలన్నారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు జాగృతి తరపున వినతి పత్రం అందిస్తామని కవిత తెలిపారు. లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా 12వ తేదీన బంద్‌కు జాగృతి మద్దతు ఇస్తోందని వెల్లడించారు. ఈ క్రమంలోనే ఎంఐఎం పార్టీ పొద్దు తిరుగుడు పువ్వులా.. ఎవరు అధికారంలో ఉంటే వారి వెంట ఉంటుందని సెటైర్లు వేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాయల తెలంగాణకు ఒవైసీ బ్రదర్స్ మద్దతు ఇచ్చారని, రేవంత్ రెడ్డి ఆర్‌ఎస్‌ఎస్ మనిషి అన్న ఒవైసీ.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సపోర్ట్ చేశారని కవిత విమర్శించారు.

# సంపాదకీయం

## ఎన్నికలంటే....డబ్బున్నోళ్ల దందా !

ఎన్నికల్లో ప్రలోభాల పర్వంతో తెలంగాణ పల్లెల నుంచి పట్టణాల దాకా మత్తులో జోగుతున్నాయి. మొన్నటి కి మొన్న పంచాయితీ పోరు ముగిసింది. ఇప్పుడు పట్టణపోరు జరుగుతోంది. డబ్బున్న అభ్యర్థలదే హవా. డబ్బులు లేని అభ్యర్థులను ప్రజలు చూసీచూడనట్లుగా ఉంటున్నారు. అతను ఎందుకు ఖర్చు పెడుతున్నాడో అర్థం చేసుకోవడం లేదు. ఎందుకు ప్రలోభ పెడుతున్నాడో గ్రహించడం లేదు. ఇప్పుడు పెట్టిన డబ్బు రేపు ప్రతి చిన్న పనికీ ముక్కుపిండి వసూలు చేస్తాడని గుర్తించడం లేదు. ఎన్నికలు వచ్చాయంటే రాజకీయ నాయకులకన్నా ప్రజలకు ఎక్కువ సంతోషంగా ఉంది. పండగ చేసుకుంటున్నారు. ఇంట్లో వంటావార్పులు అంతంత మాత్రమే. రోజుకు ఎవరో ఒకరు రావడం సాయంత్రానికి దావత్ ఇవ్వడం పరిపాటిగా మారింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో గత వారం రోజులుగా ఇదే తంతు సాగింది. చివరకు బుధవారం ఎన్నికలు ఉండగా సాయంత్రం కూడా దావత్‌లకు టైమ్ కేటాయించారు. తాగుడు అలవాటు ఉన్నవారికి తాగినంత...తిండి అలవాటున్న వారికి తిన్నంత అన్న లెక్కన సాగడం ప్రజాస్వామ్య పరిహాసాని కి ఎన్నికలు పరాకాష్టగా నిలుస్తున్నాయి. సోమవారం సాయంత్రం మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెర పడింది. ప్రలోభాలకు తెర లేచింది. మద్యం, మాంసంతో పాటు ఇతరత్రా కానుకల పంపిణీ ప్రారంభమైంది. పది రోజుల పాటు హోరాహోరీగా సాగిన ప్రచార పర్వం సోమవారం సాయంత్రం ఐదు గంటలతో ముగిసింది. ఆ వెంటనే కొందరు అభ్యర్థులు ఓటర్లపై తాయిలాలు వెదజల్లడం ప్రారంభించారు. కొన్నిచోట్ల ఓ పార్టీ నేతలు ఇంటింటికీ చికెన్ పొట్లాలు పంపించారు. మరో అభ్యర్థి తన వార్డు పరిధిలోని ఓటర్లకు హారతి ప్లేటు పంపిణీ చేసారు. నామినేషన్ల పర్వం ముగిసిన వెంటనే ప్రధాన పార్టీలు రంగంలోకి దిగాయి. దాదాపు పది రోజుల పాటు ప్రచారంతో హోరెత్తించాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. పట్టణాల్లో గెలుపే లక్ష్యంగా ప్రచారం చేశారు. వందల మందిని వెంటేసుకుని గల్లీగల్లీ చుట్టేశారు. పార్టీల నేతలు వార్డుల వారీగా బాధ్యతలు పంచుకుని ఇంటింటికీ తిరిగారు. ప్రచార పర్వం ముగియడంతో అన్ని పార్టీల నేతలు ప్రలోభాలకు తెర లేపారు. ఉదయమే పోలింగ్‌కు సమయం దగ్గర పడడంతో విచ్చలవిడిగా తాయిలాలు వెదజల్లాయి. చికెన్ వద్దు అన్నవారికి అరకిలో మటన్‌ను పంపించారు. గత రెండ్రోజులుగా మద్యం సీసాలు, కూల్‌డ్రింక్‌లు సరఫరా చేశారు. వీటికి అదనంగా రాత్రిపూట డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు ప్రజలు చెవులు కొరుక్కున్నారు. ఒక్కో ఓటుకు రూ.1500 నుంచి రూ.3 వేలు ఇచ్చినట్లు సమాచారం. కొన్ని పట్టణాల్లో ఖరీదు కూడా పెంచారు. డివిజన్లు, వార్డుల్లో మద్యం ఏరులై పారుతుండగా, మరోపక్క డబ్బుల పంపకాలు జోరందుకున్నాయి. ఇక, ప్రత్యర్థి ఎంత పంచుతున్నాడు.. అని అంచనా వేస్తూ అంతకుమించి ఓటర్లను ఇవ్వటానికి ఎత్తులు వేయడంలో అభ్యర్థులు తలమునకల య్యారు. ఇలా యథేచ్ఛగా పంపకాలు జరుగుతున్నప్పటికీ అధికారుల దృష్టిలో మాత్రం పడలేదు. అయితే పరస్పరం ఆయా పార్టీల వారు మా÷-తరం ఆరోపణలు చేసుకున్నారు. ఫలానా పార్టీవారు డబ్బులు పంచుతున్నారంటూ నిందలు వేసారు. స్థానిక నేతల అండతో విచ్చలవిడిగా మద్యం, డబ్బులను పంపిణీ చేస్తుంటే, పోలీసులు వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇదంతా ఒక ఎత్తయితే...ప్రత్యర్థి పార్టీల్లో నాయకులకు డబ్బు, మద్యం ఎరగా వేసి ఎన్నికల్లో గెలుపుకోసం మార్గాలు తయారు చేసుకుంటున్నారు. కోవర్టులను ఏర్పాట్లు చేసుకుని వారి ఎత్తులను చిత్తు చేయడానికి అభ్యర్థులు డబ్బులు ఆశ చూపుతు న్నారని సమాచారం. ప్రత్యర్థి అభ్యర్థితో ఉండే ముఖ్యమైన నాయకులు పార్టీ మారకున్నా సమాచారం చేరవేసి వారి ఓటమికి కృషి చేసే వారికి రూ. 50000 నుంచి రూ.లక్ష వరకు ముట్ట చెబుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఓటర్లనే కాకుండా ప్రత్యర్థి పార్టీల నాయకులను కూడా ప్రలోభాలకు గురి చేసి పార్టీలు మారడానికి వ్యూహాలు రచిస్తున్నారని తెలిసింది. మొత్తంగా మునిసిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగించారు. వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు గెలుపు టెన్షన్‌తో పాటు చైర్మన్ సీటు దక్కుతుందా అనే ఉత్కంఠలో ఉన్నారు. ప్రధాన పార్టీలు చైర్మన్ అభ్యర్థిని ప్రకటించకుండానే ఎన్నికల ప్రచారంలోకి దిగాయి. ఈ నేపథ్యంలో పురపాలికల్లో చైర్మన్ సీటుపై ఆశతో ఆశావహులు భారీగా ఖర్చు పెట్టారు. తన గెలుపుతో పాటు తన పార్టీకి చెందిన వార్డు సభ్యుల గెలుపుకు కూడా వారి భుజస్కంధాలపై వేసుకున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా ఆశావహులు అన్నితామై వ్యవహరించారు. అయితే ఇన్నీ చేసిన చివరికి పార్టీకి మెజార్టీ సీట్లు వస్తాయా..? తానే పార్టీ అభ్యర్థిని అవుతానా అనే టెన్షన్‌లో ఆశావహులు ఉన్నారు. ఏదిఏమైనా ఎన్నికల ప్రచారం ముగిసింది. ఎత్తులు, పైఎత్తులు పూర్తయ్యాయి. ప్రజలు ఎవరిని ఆదరిస్తారాఓ చూడాలి. గత సర్పంచ్ ఎన్నికల్లో డబ్బులు తీసుకుని ఓటేయలేదని నిలదీసారు. తమ డబ్బులు వాపస్ ఇవ్వాలని నడిబజారులు పసుపుబియ్యంతో తిరిగారు. ఈ ఎన్నికల్లో అలాంటి విచిత్రాలు ఇంకా ఎన్ని చూడాల్సి వస్తుందో. ఓటర్ల మనసు ఎలా ఉం టుందో వేచి చూడాలి.

# నీలి విప్లవాన్ని నీరుగారుస్తున్న సర్కార్




ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు అరవై ఏండ్లపాటు తెలంగాణ మత్స్యరంగం పూర్తిగా నిర్లక్ష్యానికి, అణచివేతకు, విస్మరణకు గురైంది. ప్రత్యేక రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో దాదాపు పదేండ్లలో గుణాత్మక అభివృద్ధి నమూనాగా రూపొందింది. ఇప్పుడు ఆ నమూనాలను సమూలంగా ధ్వంసం చేసేందుకు కాంగ్రెస్ పాలకులు పూనుకున్నట్టు కనిపిస్తున్నది. ఇందుకు పలు నిదర్శనాలు ఉన్నాయి. రాష్ట్రంలో మత్స్యకారుల సంక్షేమం, స్వావలంబన కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన చేపపిల్లల ఉచిత పంపిణీ పథకాన్ని నీరుగార్చుడం, మత్స్యసహకార సంఘాలను నిర్వీర్యం చేయడం, మత్స్యకారుల ఉపాధి కల్పనలో జీవనాడిగా నిలిచిన నీటివనరులను విధ్వంసం చేయడం లాంటి మూడు పద్ధతులను ఈ ప్రభుత్వం అమలు పరుస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. రాష్ట్రప్రభుత్వమే సహకార వ్యవస్థను అడ్డుపెట్టుకుని, మత్స్యశాఖను వాడుకుంటూ ముప్పేట దాడికి పాల్పడుతున్నది. ఫలితంగా రాష్ట్రంలోని 50 లక్షలకుపైగా మత్స్యకారులు విలవిల్లాడుతున్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం దేశంలోనే వినూత్నమైన పద్ధతిలో మత్స్యకారులకు చేపపిల్లల ఉచిత పంపిణీ పథకాన్ని అమలు చేసింది. 2016లో ప్రారంభించిన ఈ పథకంతో ఎనిమిది పర్యాయాలు లబ్ధి చేకూర్చింది. ఇందుకు రూ.560 కోట్లు ఖర్చుచేసింది. మత్స్య సహకార సంఘాల బలోపేతం కోసం జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ద్వారా సుమారు రూ.1000 కోట్ల భారీ రుణసదుపాయంతో సమీకృత మత్స్య అభివృద్ధి పథకాన్ని అమలు పరిచింది. ఈ రెండు కార్యక్రమాల ఫలితంగా మత్స్యకారుల జీవితాల్లో నూతనోత్సాహం కనిపించింది. మత్స్యసహకార సంఘాల్లో సభ్యత్వానికి ఆసక్తి, పోటీ పెరిగాయి. సంఘాల్లో సభ్యులుగా చేరడాన్ని గుర్తింపు, గౌరవంగా భావించే పరిస్థితులు నెలకొన్నాయి. సమగ్ర విధానాలతో చేపల ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల నమోదయ్యింది.మత్స్యకారుల తలసరి ఆదాయం పెరిగింది. తెలంగాణలో నీలివిప్లవం కనిపించింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేండ్లుగా మత్స్యరంగంలో, మత్స్యకారుల జీవన స్థితిగతుల్లో తిరోగమన పరిస్థితులు ఎదురవుతున్నాయి. నీలి విప్లవం నీరుగారిపోతున్నది. చేపపిల్లల పంపిణీ పథకం అమల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. రెండేండ్లలో పథకం కనీసం 50 శాతం కూడా అమలు జరగలేదు. చేపపిల్లలు సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలోనూ ప్రభుత్వం మొండివైఖరిని అవలంబిస్తున్నది. కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించగా, బిల్లుల చెల్లింపు చేయాలని న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది. అయినప్పటికీ ప్రభుత్వం కాంట్రాక్టర్లను సతాయిస్తూనే ఉన్నది. బిల్లులను పూర్తిగా చెల్లించలేదు. ఈ తాత్సారంపై కూడా కాంట్రాక్టర్లు మరోసారి హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. బిల్లుల చెల్లింపు వ్యవహారాలు కోర్టుధిక్కరణ కేసులను నమోదుచేసే స్థాయికి వెళ్లాయి. అయినా ఈ ప్రభుత్వంలో, మత్స్యశాఖలో చలనం లేదు.

కొత్తగా మత్స్యశాఖ మంత్రిగా బాధ్యతలను చేపట్టిన వాకిటి శ్రీహరి మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేపపిల్లల పంపిణీ పథకాన్ని పకడ్బందీగా, పారదర్శకంగా అమలు చేస్తున్నదని, రూ.122 కోట్లు కేటాయించినట్టు గొప్పలు చెప్పారు. కానీ మంత్రి ప్రకటించిన లెక్కల్లో సగం కూడా వాస్తవంలో పంపిణీ జరగకపోవడం, నిధులు ఖర్చు పెట్టకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధికి, మత్స్యశాఖమంత్రి పనితీరుకు అద్దం పడుతున్నది. ఇక ప్రత్యేక పథకం అమలు పరచాలనే ఆలోచన, ప్రయత్నం ప్రభుత్వం వద్ద లేవు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఫిషరీస్ కార్పొరేషన్ అంశం ఉద్దేశపూర్వకంగానే అటకెక్కించారు. మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వాకిటి శ్రీహరి మత్స్యశాఖమంత్రిగా ఉన్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం కనిపించడంలేదు.మొత్తంగా గడిచిన రెండేండ్ల కాంగ్రెస్ పాలనాకాలంలో మత్స్యకారుల్లో తీవ్రమైన నిరాశ, నిస్పృహ నెలకొన్నాయి. కానీ మత్స్యశాఖ అధికారులు మాత్రం తెలంగాణలో చేపల ఉత్పత్తి ఏటా పెరుగుతున్నదని, చేపల ఆహార వినియోగంలో గణనీయమైన అభివృద్ధి జరుగుతున్నదని, రాష్ట్రంలోని ప్రజలకు చేపలు విస్తారంగా అందుబాటులో ఉంటున్నాయని 'స్టీరియోఫోనిక్' నివేదికలు తయారుచేసి, స్వీయకితాబులు ఇచ్చుకుంటున్నారు. సహకార వ్యవస్థకు సంబంధించిన స్ఫూర్తిని సమూలంగా సంహరించడమే తెలంగాణలో నేటి పాలకులు తమ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న మత్స్య సహకార సంఘాల ఉనికి ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. పేద మత్స్యకారుల సాధికారత కోసం ఏర్పడిన ఈ వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నది. ముఖ్యంగా తెలంగాణ సహకార సంఘాల చట్టం- 1964లోని సెక్షన్ 32 (7)(ఏ) (1)ను అడ్డం పెట్టుకొని, ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికలను అడ్డుకుంటూ, పాలకపెద్దలు తన సొంత పార్టీ క్యాడర్‌ను పర్సన్ ఇన్‌చార్జ్‌ల రూపంలో సంఘాలపై రుద్దుతున్నది. సాధారణంగా ఏదైనా సహకార సంఘం పదవీ కాలం ముగిసినప్పుడు, అనివార్య కారణాల వల్ల ఎన్నికలు జరగకపోతే, తాత్కాలికంగా ఆ సంఘం కార్యకలాపాలను పర్యవేక్షించడానికి అధికారులను లేదా ఒక కమిటీని నియమించేందుకు ఈ సెక్షన్ అవకాశం కల్పిస్తుంది. అయితే, ఇది కేవలం తాత్కాలిక ఏర్పాటు మాత్రమే. వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించి, బా ధ్యతలను ఎన్నికైన ప్రతినిధులకు అప్పగించడమే ఈ సెక్షన్ అసలు ఉద్దేశం. కానీ, నేడు తెలంగాణలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉన్నది. నిరుడు సెప్టెంబర్ 3న విడుదల చేసిన జీవో ఆర్టీ నంబర్ 60 ద్వారా ప్రభుత్వం జిల్లా మత్స్య సహకార సంఘాల్లో అప్పటికే ఉన్న చీఫ్ ప్రమోటర్లు, కమిటీలను తొలగించి, తమకు అనుకూలమైన వారిని నామినేట్ చేసే ప్రక్రియకు తెరలేపింది. ఇది ముమ్మాటికీ చట్టాన్ని దుర్వినియోగం చేయడమే. ప్రభుత్వ తీరుపై మత్స్యసహకారసంఘాల సీనియర్ నాయకుడు బుస్సా మల్లేశం నాయకత్వంలో పలువురు మత్స్యకారులు హైకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ రాష్ట్రంలో మత్స్యకారుల పన గత రెండు దశాబ్దాలుగా నిరంతరంగా న్యాయపోరాటం చేస్తున్న సీనియర్ అడ్వకేట్ డీఎల్ పాండు ముదిరాజ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్ నంబర్ 16103/2025 కేసును విచారించిన హైకోర్టు ప్రభుత్వ చర్యలపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఎన్నికలు నిర్వహించకుండా, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం పాత కమిటీలను తొలగించి కొత్తవారిని నియమించడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టంచేసింది. హైకోర్టు ఆదేశించినా ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నందుకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మత్స్యశాఖ కార్యదర్శిపై 'కోర్టు ధిక్కరణ'కేసులు కూడా నమోదయ్యాయి. 21 జిల్లాల్లో ఓటర్ల జాబితాను ఖరారు చేయకుండా, కుంటిసాకులు చెప్తూ ప్రభుత్వం కోర్టును కూడా తప్పుదోవ పట్టిస్తున్నదని విచారణలో తేలింది. రాష్ట్రస్థాయిలో మత్స్యకారుల కోసం ఉన్న అత్యున్నత సంస్థ 'తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య' (TSFCOF) పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. జిల్లా సంఘాల నుంచి ఎన్నికైన ప్రతినిధులు ఈ సమాఖ్య చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉండగా, ప్రభుత్వం నేరుగా తమ పార్టీ నేతలను ఆ పదవిలో నామినేట్ చేస్తున్నది. ఈ సమాఖ్య పదవీకాలం మూడు నెలల్లో ముగియనున్నది. ఈ లోగా జిల్లాల్లో తమకు అ నుకూలమైన పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించుకుంటే, రాష్ట్రస్థాయిలోనూ తమకే అధికారం దక్కుతుందనేది పాలకపక్షం ఎత్తుగడ. రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మత్స్యకారుల ఓటు బ్యాం కును ఆకర్షించేందుకు ఈ ఎత్తుగడలు వేస్తున్నట్లు స్పష్టమవుతున్నది. సహకార సంఘాల్లో తమ మనుషులు ఉంటే ఓటర్లను ప్రభావితం చేయవచ్చని కాంగ్రెస్ నేతలు కుట్ర. రాజకీయ క్రీడలో పేద మత్స్యకారులు బలిపశువులు అవుతున్నారు. ఎన్నికైన ప్రతినిధులు లేకపోవడంతో సంఘాల ద్వారా అందాల్సిన రాయితీలు, పథకాలు సక్రమంగా అందడం లేదు. ప్రభుత్వం నియమించిన పర్సన్ ఇన్‌చార్జ్‌లకు క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన లేకపోవడంతో మత్స్యరంగం కుదేలవుతున్నది. సహకార రంగం అంటేనే అందరి కోసం అందరూ అనే స్ఫూర్తితో సాగాలి. కానీ నేడు తెలంగాణలో పార్టీ కోసం సంఘం అనే రీతిలో పాలన సాగుతున్నది. ఇప్పటికైనా హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం గౌరవించి, సెక్షన్ 32 ముసుగులో చేస్తున్న రాజకీయ నామినేషన్లను పక్కనపెట్టి తక్షణమే పారదర్శకమైన ఎన్నికలు నిర్వహించాలి. లేనిపక్షంలో, సహకార రంగం ఉనికి కోల్పోయి ప్రభుత్వశాఖగా మారిపోయే ప్రమాదం ఉన్నది.

# ఓటు పండుగకు వేళాయె కొత్తజిల్లాల ఆశలపై నీళ్లు

### రాజకీయ నాయకుల ఆదేశాలతో ప్రజల పైన ప్రేమ పోటీ దారులకు అధికారులకు గుర్తొచ్చే ఎలక్షన్ ముగిసాయో నాయకులు కనుమరుగు



మహబూబాబాద్, ప్రతినిధి (ఫిబ్రవరి 10) న్యూస్ :మహబూబాబాద్ జిల్లా మున్సిపల్ ఎలక్షన్ నేపథ్యంలో స్థానిక వార్డులలో బరిలో దిగిన అధికార గుర్తింపు పొందిన పార్టీల ప్రతిని ధులు, టికెట్ ఆశించి రాకపోయినా లేదా ప్రజల పైన మమకారంతో పోటీకి దిగిన వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థులు పట్టణంలో వారు చేసేటటు వంటి ప్రచారం తొ పోటీ చేస్తున్న అభ్యర్థులదే విజయం అనేటటువంటి భ్రమను తలపించేలా ప్రచారంలో భాగంగా ఆత్మీయ పలకరింపులు, నేను గెలిస్తే నువ్వు గెలిచినట్టే అనే బ్రమను తలపించేలా తీయటి మాటలు , ఎలక్షన్స్ రోజు వరకు కనిపిస్తూనే ఉంటాయి. స్థానిక అధికారులు ప్రజా ప్రతినిధుల ఆదేశాలపై ఓటర్ దేవుళ్లకు ఓటు హక్కును రాజ్యాంగ బద్ధంగా కలిపిస్తున్నాం అనే విధముగా ఓటు హక్కు వినియోగించు కోవడానికి వచ్చినటువంటి వ్యక్తులకు ఎండను కూడా తగలకుండా టెంట్లు, తాగడానికి నీరు, నడుచుకుంటూ వస్తున్న వ్యక్తులకు కాళ్లకు మట్టి అంటకుండా, రాళ్లు రప్పలు తగలకుండా రెడ్ కార్పెట్ ఏర్పాటు చేసి వృద్ధులను, దివ్యాంగులను, ప్రజలకు ఆహ్వానం పలుకుతూ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా సంబంధిత ప్రతి అధికారిక యంత్రాంగం సహకారం తెలియపరు స్తారు. తీరా ఓటు వేసే రోజున లేవక ముందే (అభ్యర్థుల) ఫోన్ కాల్స్ తో మొదలు తినిపించడం, తాగిపించడం, ఓటు కేంద్రానికి చేర్చే విధంగా వాహనాల ఏర్పాటు , ముఖ్యంగా ప్రలోబలకు, డబ్బును ఎరచూపడం వంటి కార్యక్రమాలతో ఓటు వేసే ప్రజలను లోబర్చు కొనే అద్భుతమైన ప్రయత్నం. ఓటు వేసే సమయం దాటిందా మర్యాదలు మాయం, పోటీదారులు చూద్దామన్న కనుమరుగు, ఫలితాలు వచ్చాక గెలిచిన అభ్యర్థి ఆనందోత్సాహాలతో ర్యాలీలు, ఓడిపోయిన వ్యక్తుల బాధల మధ్యన బూతు పురాణాలు, ఓటర్ మహాశయులు అందించినటువంటి అద్భుతమైన తీర్పుతో మరల ఐదు సంవత్సరాల వరకు వారి వైపు చూసేటటువంటి ప్రయత్నం కూడా కనబడదు. ఓటర్ మహాశయులైన ప్రజలందరూ వారి యొక్క ఓటు హక్కును నిజాయితీ కలిగినటువంటి పౌరుడికి మాత్రమే ఓటును వేసి అభివృద్ధిలో కేవలం మీరు వేసే ఓటుతో మాత్రమే అభివృద్ధి జరుగుతుందని గుర్తు పెట్టుకుని రాజ్యాంగం కలిపించినటువంటి ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకొని పనిచేసే నిజాయితీ పరులను గెలిపించుకున్నట్లయితే మన ప్రాంతం మాత్రమే కాదు దేశం మొత్తం అభివృద్ధి జరుగుతుంది కనుక మీరు తీసుకునే ఒక్క నిర్ణయం దేశ భవిష్యత్తు పైన ప్రభావం చూపుతుందని గుర్తు చేస్తున్నాం.

వరంగల్, ఫిబ్రవరి 10,: తెలంగాణలో జిల్లాల పునర్విభజన, ప్రస్తుత జిల్లాల భవిష్యత్తుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కీలక వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోబోతోందనే ఉత్కంఠకు సీఎం తెరదించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఏ ఒక్క జిల్లాను కూడా రద్దు చేసే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా భూపాలపల్లి జిల్లా రద్దు అవుతుందనే ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యక్తిగత ఇష్టాయిష్టాలు, సెంటిమెంట్లు, ఆయన లక్కీ నంబర్ ఆధారంగానే జిల్లాల విభజన చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ విమర్శిస్తూ వస్తోంది. పరిపాలనా సౌలభ్యం కంటే రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా జిల్లాల ఏర్పాటు జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అయినప్పటికీ, ప్రజలకు ఇబ్బంది కలిగిం చేలాఉన్న జిల్లాలనుతొలగించడం కంటే,ఉన్నవాటిని పటిష్టం చేయడ మే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూర్ అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న సీఎం, అక్కడి బహిరంగ సభలో జిల్లా ఉనికిపై భరోసా ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎంతో గొప్ప చరిత్ర ఉందని, భూపాలపల్లి ఒక చిన్న కుగ్రామంగా ఉన్న దశ నుంచి నేడు మున్సిపాలిటీగా, జిల్లా కేంద్రంగా ఎదగడం వెనుక ఎందరో కృషి ఉందని రేవంత్ రెడ్డి కొనియాడారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారా వు భూపాలపల్లిని మండల కేంద్రంగా మార్చడం ద్వారానే ఈ ప్రాంత అభివృద్ధికి బీజం పడిందని ఆయన గుర్తు చేశారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి పునాది ఇక్కడే పడిందని, ఈ ప్రాంత అభివృద్ధిలో సింగరేణి కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని ఆయన ప్రశంసించారు.జిల్లాల పునర్విభజన లేదా మార్పులపై భవిష్యత్తులో ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సి వస్తే, అది ఏకపక్షంగా ఉండదని సీఎం తేల్చిచెప్పారు. ప్రజల అభిప్రాయాలను సేకరించిన తర్వాత, అసెంబ్లీలో సమగ్రంగా చర్చించి, ప్రతిపక్షాల సూచనలు తీసుకున్న తర్వాతే ముందుకెళ్తామని ప్రకటించారు. రహస్య నిర్ణయాలు లేదా రాజకీయ కుట్రలకు తమ ప్రభుత్వంలో తావులేదని ఆయన కుండబద్ద లు కొట్టారు.ప్రభుత్వంపై బురదజల్లేందుకు కొంతమంది కావాలనే జిల్లాల రద్దుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం ఇలాంటి విషం చిమ్మే ప్రయత్నాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మెడికల్ బోర్డు విషయంలో కొందరు చేస్తున్న చిల్లర రాజకీయాలను తిప్పికొడతామని, కార్మికుల వల్లే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని ఆయన కృతజ్ఞత చాటుకున్నారు. అసత్య ప్రచారాలు చేసే వారిని మోకాళ్లపై కూర్చోబెడతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే శక్తులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనతో జిల్లాల భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధత వీడిపోయింది. పాలనలో పారదర్శకత, ప్రజాస్వామ్యబద్ధమైన చర్చల ద్వారానే ఏ నిర్ణయమైనా ఉంటుందని చెప్పడం ద్వారా ఆయన ప్రజల్లో విశ్వాసాన్ని నింపారు. భూపాలపల్లి జిల్లా ఉనికిపై ఆయన ఇచ్చిన హామీ ఆ ప్రాంత ప్రజలకు పెద్ద ఊరటనిచ్చింది.

# మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు

## నేడు ఖమ్మంలో సాంస్కృతిక ప్రదర్శనలు.



ఖమ్మం, ఫిబ్రవరి 10 విజన్ ఆంధ్ర) ఖమ్మం గుట్టల బజార్ లోని కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణ రామ మందిరంలో ఈ నెల 11న బుధవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీరామం జయలక్ష్మి సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ శ్రీరాముల జగదీశ్వర్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ప్రముఖ స్త్రీ స్వర గాయకులు డాక్టర్ దీక్షిత్ సుబ్రహ్మణ్యంచే అన్నమయ్య కీర్తనలు, శ్రీరాముల జగదీశ్వర రావుచే భక్త రామదాసు కీర్తనలు, చిరంజీవి శ్రీరాముల ధీయాన్ని నృత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బి.రాజ గోపాల్, కన్యకా పరమేశ్వరి దేవాలయం కమిటీ ఛైర్మన్ మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు, ఆరాధ్య ఎమర్జెన్సీ హాస్పిటల్ ఎమ్ డి డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, ప్రముఖ వ్యాపారవేత్త దేవత రాజారావు హాజరు కానున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుండి బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ బస్సులతో పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లిన పోలింగ్ సిబ్బంది**

**మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకోవాలి**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**





వనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఫిబ్రవరి 11న వనపర్తి జిల్లాలోని 5 మున్సిపాలిటీల్లో నిర్వహించనున్న పోలింగ్ లో ఓటర్లు తమ ఓటు ను ఖచ్చితంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కోరారు. మంగళవారం వనపర్తి మున్సిపాలిటీకి సంబంధించి నర్సింగాయపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని, పెబ్బేరు మున్సిపాలిటీ కి సంబంధించి ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాల, కొత్తకోట మున్సిపాలిటీ కి సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, అక్కడే ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ తో పాటు ఎన్నికల రోజు సాయంత్రం రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు సైతం పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఓటరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రతి మున్సిపాలిటీ, పోలింగ్ కేంద్రంలో గట్టి పోలీస్ భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బుధవారం ఉదయాన్నే 7.00 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5.00 గంటలకు ముగుస్తుందని, సాయంత్రం 5.00 గంటల లోపు పోలింగ్ కేంద్రంలో ఉన్న ప్రతి ఓటరుకు ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఓటు వేయడానికి ఓటరు స్లిప్ తో పాటు ఎన్నికల కమిషన్ గుర్తించిన 17 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒక గుర్తింపు కార్డు తప్పకుండా వెంట తీసుకురావాల్సి ఉంటుందని, గుర్తింపు కార్డు తీసుకురాని ఓటర్లకు ఓటు వేసేందుకు అవకాశం కల్పించబడదనే విషయాన్ని ప్రతి ఓటరు గుర్తించాలని సూచించారు. వనపర్తి జిల్లాలోని 5 మున్సిపాలిటీల్లోని 80 వార్డులలో 1,17, 441 మంది ఓటర్లు ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి పోలింగ్ కేంద్రంలో సి.సి కెమెరాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో (మైక్రో అబ్జర్వర్లు) సూక్ష్మ పరిశీలకులను నియమించినట్లు తెలిపారు. వనపర్తిలోని 33 వార్డుల్లో 64,190 మంది ఓటర్లు, పెబ్బేరులోని 12 వార్డుల్లో 14,333, కొత్తకోట లోని 15 వార్డుల్లో 18,192 ఓటర్లు, ఆత్మకూరు 10 వార్డుల్లో 11,579 ఓటర్లు, అమర్చింత మున్సిపాలిటీలోని 10 వార్డుల్లో 9,147 మంది ఓటర్లకు 191పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పోలింగ్ సిబ్బంది 20 శాతం రిజర్వు సిబ్బందితో కలుపుకొని 230 మంది ప్రిసైడింగ్ అధికారులు, 230 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 687మంది ఒ.పి.ఓ లను నియమించినట్లు తెలిపారు. వీరితో పాటు పోలీస్ సిబ్బంది, రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది సైతం విధులు నిర్వహించనున్నారు.ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. లక్ష్మీ బాయి, వ్యయ పరిశీలకులు శ్రీనివాసులు, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత తహశీల్దార్లు, ఎంపీడీఓ లు డిస్ట్రిబ్యూషన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# మున్సిపల్ ఎన్నికలకు పటిష్టమైన భద్రత

**జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**

**1000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భారీ బందోబస్తు**

**పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తి రక్షణ 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలు**

**అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కఠిన పర్యవేక్షణ**

**ప్రశాంత ఎన్నికల కోసం రాత్రింబవళ్లు విధుల్లో పోలీసులు**

**నేర ప్రవృత్తులకు అవకాశం ఇవ్వం - 432 మందిపై సత్ప్రవర్తన బైండోవర**



వనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి : వనపర్తి జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్నాయని, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అత్యంత పటిష్టమైన భద్రత ప్రణాళికను అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. అదనపు ఎస్పీ, డిస్పీలు ప్రత్యేక పోలీసు బృందాలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయని. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛయుత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజలు ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని, ఆయా మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రవర్తన నియమావళి కఠినంగా అమలు చేయడం జరుగుతుంది ఆమె అన్నారు. 5-మున్సిపాలిటీలలో 80-వార్డులకు గానూ 191-కేంద్రాలు, జరుగనున్నాయని అన్నారు. ఇందులో 67-సమస్యాత్మక పోలింగ్ స్టేషన్స్ గుర్తించి ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల భద్రత అనేది సమష్టి బాధ్యతని విధుల్లో ఉన్న సిబ్బంది ప్రతి నిమిషం జిల్లావ్యాప్తంగా పోలీసుల కఠిన పర్యవేక్షణ కొనసాగుతుందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జిల్లా వ్యాప్తంగా 1000 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పూర్తి రక్షణతో పాటు 163 బిఎన్ ఎస్ ఎస్ (144 సెక్షన్) ను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ రోజు ఎన్నికల సరళి కై జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎలక్షన్ సెల్ ద్వారా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. సమస్యాత్మక, సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా బృందాలు, మొబైల్ పెట్రోలింగ్, చెక్‌పోస్టులు నిరంతరం పనిచేస్తున్నాయి, శాంతియుత ఎన్నికలు భద్రమైన ప్రజాస్వామ్యం లక్ష్యంగా పోలీసు సిబ్బంది రాత్రింబవళ్లు అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఓటర్ల మనసు గెలిచి ఎన్నికల బరిలో గెలవాలి అన్నారు అంతేకానీ ఉచితాలు, బహుమతులు, డబ్బు మద్యం లాంటి వాటితో ఓటర్లను ప్రలోభాలకు గురిచెయొద్దని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడినా, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి, 123 కేసులు నమోదు చేసి, 432-మందిని సత్ప్రవర్తన కోరుతూ ముందస్తుగా బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎన్నికలను ప్రభావితం చేసే మద్యం అక్రమ రావాణాపై జిల్లాలో విలువైన 425 లీటర్ల మద్యం సీజ్ చేశాం అన్నారు.

# యవ్వన దశలో ఆకర్షణ సహజమే సరైన అవగాహన అవసరం

**సీనియర్ సివిల్ జడ్జ్ వి. రజని**




వనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం, కంచిరావుపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి విద్యార్థులకి ఫోక్సో చట్టం మీద అవగాహన కల్పిస్తూ, యవ్వన దశలోకి వచ్చే విద్యార్థులు సరైన అవగాహనతో ముందుకు సాగాలని అనాలోచితంగా ఫోక్సో కేసెస్ బారిన పడకూడదని మరియు 18 సంవత్సరాలలోపున బాల బాలికలపై లైంగిక నేరం, లైంగికంగా వేధించడం చేస్తే పోక్సో చట్టం కింద కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. అదేవిధంగా బాల్యవివాహాల నిషేధ చట్టం మరియు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. ఉచిత న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రఘు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా పాఠశాల పనులు వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తి కావాలి

**అంతర్జాతీయ స్థాయి విద్య లక్ష్యంగా యంగ్ ఇండియా గురుకులం,**

**గురుకుల నిర్మాణ పనుల్లో నాణ్యత, వేగం పాటించాలి**

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



కొల్లాపూర్ ఫిబ్రవరి 10 : (విజన్ ఆంధ్ర) జటప్రోలు గ్రామంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల పనుల నాణ్యత ప్రమాణాలను పాటిస్తూనే, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. కొల్లాపూర్ నియోజక వర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను పెంట్లవెల్లి మండలంలో జటప్రోలు గ్రామంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు., కొల్లాపూర్ నియోజకవర్గానికి రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల ద్వారా విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్య అందించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి నిర్మాణ పనులు పూర్తి కావాలని సూచించారు. గురుకుల పాఠశాల నిర్మాణ పనులు అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, పనుల్లో వేగం పెంచేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సుమారు 25 ఎకరాల ప్రభుత్వ భూమిలో విశాలమైన తరగతి గదులు, పాఠశాల భవనాలు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పాఠశాల నిర్మాణ పనులు ప్రభుత్వం నిర్దేశించిన మ్యాప్, ప్లాన్ ప్రకారమే జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పనులు పక్కాగా ప్లాన్ ప్రకారమే సాగేటట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణం ద్వారా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి శిక్షణ లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. భవన నిర్మాణ పనులను వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, ఎప్పటికప్పుడు పనులను పరిశీలిస్తూ రోజువారీ నివేదికలు అందజేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, ఇంజనీరింగ్ అధికారులు, పెంట్లవెల్లి తాహసిల్దార్, తదితరులు ఉన్నారు.

# కొల్లాపూర్‌లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఎన్నికల సామగ్రి పంపిణీపై జిల్లా కలెక్టర్ దృష్టి,**

**కొల్లాపూర్‌లో మున్సిపల్ ఎన్నికల సన్నాహకాలను పరిశీలించిన, పోలింగ్ సిబ్బందికి మౌలిక సదుపాయాలు కల్పించాలి,**

**జిల్లా ఎన్నికల అధికారి,ఌ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



కొల్లాపూర్ ఫిబ్రవరి 10 : (విజన్ ఆంధ్ర) మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కొల్లాపూర్ పట్టణంలోని పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని మంగళవారం నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి అందజేస్తున్న పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు సూచనలు చేశారు.రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు -- 2026 సందర్భంగా కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 19 వార్డుల పోలింగ్ ఏర్పాట్లలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. లైటింగ్, టాయిలెట్లు, త్రాగునీరు, భోజన ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు సరైన స్థితిలో ఉన్నాయో లేదో సరిచూసుకున్న తర్వాతే పోలింగ్ సిబ్బందికి అందజేయాలని, పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలింపు సమయంలో పోలీస్ ఎస్కార్ట్ వాహనం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. పోలింగ్ అధికారులకు అందజేస్తున్న మెటీరియల్‌ను స్వయంగా పరిశీలించి, పంపిణీ ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. పోలింగ్ సిబ్బంది, భద్రతా విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. సిబ్బంది సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా మైక్రో అబ్జర్వర్‌లు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి అవసరమైన సామగ్రిని కేంద్రాల వారీగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలని, బ్యాలెట్ పత్రాలను ప్రత్యేక జాగ్రత్తతో చెక్ చేసి ప్యాక్ చేయాలని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న తర్వాత అన్ని ఏర్పాట్లను మరోసారి నిర్ధారించుకోవాలని తెలిపారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం సక్రమంగా అందేలా చూడాలని చెప్పారు. పోలింగ్ సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సామగ్రి పంపిణీ సమయంలో ప్రతి పోలింగ్ బృందానికి అవసరమైన మెటీరియల్ సమయానికి అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక డెస్కులను కలెక్టర్ పర్యవేక్షించారు. పీఓ, ఓపీఓలతో కూడిన బృందాల హాజరును సమీక్షించారు. ఆలస్యం లేదా అయోమయం తలెత్తకుండా సూచిక బోర్డులు, సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం మరియు పోలింగ్ కేంద్రాల్లో భద్రత, సీసీ కెమెరా పర్యవేక్షణ, త్రాగునీరు, విశ్రాంతి గదులు, వైద్య అత్యవసర సదుపాయాల లభ్యతపై కూడా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏవైనా లోపాలు కనిపిస్తే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, మున్సిపల్ కమిషనర్ ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# పాపన్నపేట మండలంలోని సెల్ ఫోన్ సిగ్నల్స్ రాక ప్రజల తీవ్ర ఇబ్బందులు



మెదక్, పాపన్నపేట ప్రతినిధి, జి నర్సింలు,విజన్ ఆంధ్ర,ఫిబ్రవరి10: ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ సంచార నిగమ్ లిమిటెడ్(బిఎస్ఎన్ఎల్)తో పాటు ప్రైవేట్ సంస్థలైన ఎయిర్ టెల్,జియో,ఐడియా,తదితర సెల్ పోన్ టవర్ల సిగ్నల్ రాక పోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల కేంద్రంలో సెల్ పోన్ టవర్లు ఏర్పాటు చేసిన మొదట్లో అంగు ఆర్భాటంతో బాగానే పనిచేసిన సెల్ ఫోన్ల సిగ్నల్స్ ప్రస్తుతం అంతంత మాత్రంగా పనిచేస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. సెల్ ఫోన్ టవర్లు దాదాపు రెండు మూడు కిలోమీటర్ల మేరకు సైతం సిగ్నల్స్ అందక వినియోగ దారులు నానా అవస్థలు పడుతున్నట్లు ప్రజలు అంటున్నారు. దీని మూలంగా ఇంటర్ నెట్ సెంటర్ లలో సిగ్నల్స్ రాక డిగ్రీ,ఇంటర్,టెన్త్ చదివే విద్యార్థులు,ఉద్యోగులు,వ్యాపార వర్గాల వారు మండల కార్యాలయాల్లో పనుల నిమిత్తం వచ్చే ప్రజలుతీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార లావాదేవీల కోసం పోన్ పే,గూగుల్ పే ద్వారా డబ్బులు వేయాలంటే పోన్ కాసేపు చక్కర్లు కొడుతూ గిరగిరా తిరుగుతుందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా సంబంధిత టెలికాం సంస్థలు తమ తమ వినియోగ దారులకు నాణ్యమైన సేవలందించాలని కోరుతున్నారు.

# డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 విజన్ ఆంధ్ర మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద గల గురుకుల బాలికల పాఠశాల /కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను మంగళ వారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే ఆర్వో, స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తేవాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్ళను సైతం పరిశీలించిన కలెక్టర్, సీ.సీ టీవీలు ఏర్పాటు చేయాలని, ఒక్క సెకను కూడా విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, సకాలంలో ఓట్ల లెక్కింపు పూర్తి చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో దివ్యాంగులకు ర్యాంపులు, వీల్ చైర్లు అందుబాటులో ఉండాలన్నారు. సదుపాయాల కల్పన విషయమై అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు అందుబాటులో ఉండాలని, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని అన్నారు. అనవసర తప్పిదాలకు తావిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎంతో అప్రమత్తతో ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రామచందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, మాస్టర్ ట్రైనర్, ఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్ కర్ణన్ ను కలిసి ప్రతిపాదనలు అందజేసిన కార్పొరేటర్లు




అల్వాల్, ఫిబ్రవరి 10, (విజన్ ఆంధ్ర): అల్వాల్, వెంకటాపురం డివిజన్ లలో వివిధ పనులకు సంబంధించిన బడ్జెట్ శాంక్షన్ చేయాలని కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిశోర్ కోరారు. వారు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ను కలిసి ప్రతిపాదనలు అందజేశారు.

# సైబర్ నేరాలపై అవగాహన



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర ): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ( ఆర్.బి.ఐ) ఆదేశాల మేరకు, ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా కె వై సి-- సురక్షిత బ్యాంకింగ్‌కు మీ మొదటి అడుగు" అనే అంశంతో బీబీనగర్‌లో వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు కేవైసీ యొక్క ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో ఆర్బిఐ ఏజీఎం శ్రీమతి లక్ష్మీ శ్రావ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీ కే. శివ రామ కృష్ణ, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీ జాకీరోద్దీన్, డి ఆర్ డి ఓ ,ఎస్ ఇ ఆర్ పి డీపీఎం శ్రీ వెంకటేశం, బీబీనగర్ ఏపీఎం శ్రీమతి మీనా, వివిధ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు, జకీరా సి ఎల్ ఎఫ్ ఫ్యాసిలిటేర్లు మరియు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

**నిర్లక్ష్యంపై కఠిన చర్యలు**

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**బైంసాలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాల తనిఖీ**




నిర్మల్, ఫిబ్రవరి 10,(విజన్ ఆంధ్రా); మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. మంగళవారం బైంసాలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ (డిస్ట్రిబ్యూషన్) రిసెప్షన్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఏర్పాట్లను స్వయంగా తనిఖీ చేసి అధికారులకు దిశానిర్దేశం చేశారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి అధికారి తన బాధ్యతను కచ్చితంగా నిర్వర్తించాలని అన్నారు. పోలింగ్ సామగ్రి స్వీకరణ సమయంలో బ్యాలెట్ బాక్సులు, పేపర్ సీల్స్, స్టేషనరీ కిట్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఏవైనా లోపాలు గమనించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన వాహనాల్లోనే నిర్ణీత సమయానికి కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి దశలో చెక్‌లిస్టులను అనుసరిస్తూ క్రమబద్ధంగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారుజనరల్ అబ్జర్వర్ వీరా రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజు నిర్వహణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఓటర్లు శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సిబ్బంది సహకరించాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ మాట్లాడుతూ, పోలింగ్ ముగిసిన తర్వాత డైరీలు, రిజిస్టర్లు, సీల్ చేసిన బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం రిసెప్షన్ కౌంటర్లలో అప్పగించాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉన్నాయని చెప్పారు. సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు అనంతరం రూట్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు వాహనాలలో వెళ్తున్న అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమం లో ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పన కు పెద్ద పీట

**ఎమ్మెల్యే పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ**



శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 10: (విజన్ ఆంధ్ర)రూ.4 కోట్ల 83 లక్షల 50 వేల రూపాయలతో మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రగతి ఎనక్లేవ్,బీజ× కాలనీ,స్టాలిన్ నగర్,రాజు నగర్,జయప్రకాష్ నారాయణ్ నగర్,కృష్ణ సాయి ఎనక్లేవ్,నమీ స్వర్ణపూరి కాలనీ, మక్తా మహబూబ్ పెట్ విలేజ్,దీఖ ఎనక్లేవ్ కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణం, వరద నీటి కాల్వ నిర్మాణము పనులకు,ఓపెన్ జిమ్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేసిన పీఏసీ చైర్మన్ మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రగతి ఎనక్లేవ్,బీజ× కాలనీ,స్టాలిన్ నగర్,రాజు నగర్,జయప్రకాష్ నారాయణ్ నగర్,కృష్ణ సాయి ఎనక్లేవ్,నమీ స్వర్ణపూరి కాలనీ, మక్తా మహబూబ్ పెట్ విలేజ్,దీఖ ఎనక్లేవ్ కాలనీలలో రూ. 4 కోట్ల 83 లక్షల 50 వేల రూపాయలతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం,వరద నీటి కాల్వ నిర్మాణము పనులకు,,ఓపెన్ జిమ్ ఏర్పాటు పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పిఏసి చైర్మన్ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గం మరియు కాలనీ ల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం మియాపూర్ డివిజన్ పరిదిలోని పలు కాలనీల లో రూ. 4 కోట్ల 83 లక్షల 50 వేల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం, వరద నీటి కాల్వ నిర్మాణం, ఓపెన్ జిమ్ ఏర్పాటు వంటి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీల వాసులకు ఉపశమనం లభించింది అని, మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని , శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అగ్రభాగాన నిలబెడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కృష్ణానదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన

**నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,**



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): ఫిబ్రవరి 10,తెలంగాణ -- ఏపీ, రాష్ట్రాలను కలుపుతూ నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిల వద్ద కృష్ణానదిపై నిర్మించనున్న ఐకానిక్ కేబుల్ వంతెన నిర్మాణ స్థలాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు. ఈ సందర్భంగా రెవిన్యూ, అటవీ, జాతీయ రహదారి శాఖల అధికారులతో కలిసి వంతెన నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భూసంబంధిత అడ్డంకులు, పరిపాలనా అనుమతుల మంజూరు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆరా తీశారు.తెలంగాణ భూభాగం నుండి ఆంధ్రప్రదేశ్ భూభాగం వరకు 1077 మీటర్ల పొడవున ఈ హైబ్రిడ్ కేబుల్ వంతెనను ఈపీసీ విధానంలో నిర్మించనున్నారు. వంతెన అందుబాటులోకి వస్తే నంద్యాల, తిరుపతి వెళ్లే ప్రయాణికులకు కర్నూలు మీదుగా వెళ్లాల్సిన అవసరం లేకుండా సుమారు 90 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఇది ఇరు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడమే కాకుండా పర్యాటకాభివృద్ధికి కూడా తోడ్పడుతుందని కలెక్టర్ తెలిపారు. కల్వకుర్తి నుంచి ప్రారంభమయ్యే 167వ జాతీయ రహదారి ప్రాజెక్టులో భాగంగా ఈ వంతెన నిర్మాణం జరుగుతోంది. ఈ ప్రాజెక్టు వల్ల కృష్ణానది పరిసర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి కూడా గణనీయమైన ప్రోత్సాహం లభించనుంది కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై క్షుణ్ణ పరిశీలన

**శ్రీశైలం దేవస్థానంలో భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి**

**జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాలు**



శ్రీశైలం(విజన్ ఆంధ్రా)నంద్యాల, ఫిబ్రవరి 10 :-మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానానికి విచ్చేయు లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ అధికారులను ఆదేశించారు.హొమంగళవారం శ్రీశైలం దేవస్థానంలో భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు.దేవస్థానం ప్రారంభ ద్వారం నుండి భక్తుల క్యూ లైన్లు, క్యూ లైన్లలో ఏర్పాటు చేసిన త్రాగునీరు, అల్పాహార పంపిణీ కేంద్రాలు, శానిటేషన్ ఏర్పాట్లు తదితర అంశాలను చివరి వరకు పరిశీలించి, మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. శివ స్వాములు విశ్రాంతి తీసుకునే చంద్రావతి కళ్యాణ మండపాన్ని సందర్శించి అక్కడ కల్పించిన సదుపాయాలపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గుడి వెలుపల ఉన్న క్యూ లైన్ల నుండి అమ్మవారి దర్శనం అనంతరం నిష్క్రమణ వరకు ఏర్పాటైన మార్గాలను తనిఖీ చేసి, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అల్పాహారం, త్రాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. భద్రత పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రతి భక్తుడిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ప్రధాన ద్వారం నుండి దర్శనం అనంతరం నిష్క్రమణ మార్గాల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు (ఐఖీవీఐలు) ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి తెలిపారు.మహాశివరాత్రి పర్వదినాన భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో అదనంగా చేపట్టిన ఏర్పాట్లను కూడా కలెక్టర్, ఎస్పీ పరిశీలించి అవసరమైన మార్గనిర్దేశం చేశారు. భక్తులు పోలీసు అధికారుల సూచనలను పాటిస్తూ తమ వాహనాలను ఇతరులకు ఆటంకం కలగకుండా నిర్ణీత పార్కింగ్ ప్రాంతాల్లో పార్కింగ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు, దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.డీఐపిఆర్ఓ, నంద్యాల వారి ద్వారా జారీ

# ఇది ఓరుగల్లు ఉత్సవం

**ఓరుగల్లు శివతత్వాన్ని, ఆధ్యాత్మికతను, కళలను, సంస్కృతిని చాటి చెప్పడానికే ఈ ఉత్సవం**

ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మహా శివరాత్రి-2026 హన్మకొండ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర)ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం పోస్టర్ ను వరంగల్ లోని గాయత్రి గ్రాండ్ హోటల్ లో ఇండస్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, ప్రముఖ యోగ సాధకులు జిల్లా ప్రభు చైతన్య , హిందువాహిని ఉమ్మడి జిల్లా నేతలు శ్రీ రామ్ ఉదయ్, హిందువాహిని రాష్ట్ర సంపర్క ప్రముఖ్ సూర్య ప్రకాష్ రెడ్డి ఆవిష్కరించడం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూప్రతీ సంవత్సరం లాగే ఈసారి కూడా ఓరుగల్లు ఆధ్యాత్మికత, శివతత్వం, కళలు, సంస్కృతి ఉట్టిపడేలా శివరాత్రి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, ఇస్కాన్ స్వామీజీ రాధామనోహర్ దాస్ ప్రవచనం, పద్మశ్రీ కిన్నెర మిగిలయ్య గారి కిన్నెర కళారూప ప్రదర్శన, ఆర్పీ పట్నాయక్, నల్గొండ గద్దర్, కాసర్ల శ్యామ్, స్వరాభిషేకం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.వివిధ రంగాల్లో విశేషమైన సేవలందిస్తున్న ప్రముఖులకు కాకతీయ పురస్కారాలు కూడా ప్రధానం చేయడం జరుగుతుంది.యోగా సాధకులు, జిల్లా ప్రభు చైతన్య మాట్లాడుతూ..ప్రస్తుత కాలంలో జెన్ జీ యువత వ్యసనాల వైపు మల్లుతున్న తరుణంలో ఆధ్యాత్మికత వైపు, సంస్కృతికి, కళల వైపు ఇండస్ ఫౌండేషన్, ఏనుగుల రాకేష్ రెడ్డి మల్లిస్తున్న తీరు ఎంతో గొప్పదని అన్నారు.వీహెచ్పీ నేత శ్రీ రామ్ ఉదయ్ మాట్లాడుతూగత ఆరేళ్లుగా దిగ్విజయంగా నడుస్తున్న ఈ మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం కేవలం ఒక ఇండస్ ఫౌండేషన్ కార్యక్రమం లాగా కాకుండా ఒక కాకతీయుల ఉత్సవంగా, ఓరుగల్లు ప్రజల పండగగా, మినీ కుంభమేళా గా జరుగుతుంది.మన ప్రాంత విశిష్టతను ఈ మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం జాతీయ స్థాయిలో ఇనుమడింపచేస్తుందని అన్నారు. ఈ నెల 15 హన్మకొండ, హయగ్రీవాచారి గ్రౌండ్స్ లో ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు నాగుర్ల కృష్ణమూర్తి, గడ్డం రఘు వంశీ, ఇండస్ ఫౌండేషన్ కార్యదర్శి పురుషోత్తం, కార్యక్రమ కన్వీనర్ కత్తుల అభిషేక్, కోఆర్డినేటర్ లు, సుకాంత్, దీపక్, అభిషేక్, అఖిల్ రెడ్డి, అమ్రీష్, బోడ విజయ్, చిర్ర సుమన్, గువ్వ రాజేష్, లక్ష్మణ్, పిన్నింటి విజయ్, గణేష్, రాజపోషాలు, రేవంత్, శివ, మనోజ్, దోమల నవీన్, ప్రవీణ్, అభిషేక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జాతరకు భారీ ఏర్పాటు చేయాలి

**భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు సంతోష్ చారి**



మెదక్, పాపన్నపేట,విజన్ ఆంధ్ర ప్రతినిధి, జి.నర్సింలు, ఫిబ్రవరి 10,తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయలలో జాతర ఏర్పాట్లను భారతీయ జనతా పార్టీ పాపన్నపేట మండల శాఖ నాయకులు పరిశీలించడం జరిగింది. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారూ. అధ్యక్షులు సంతోష్ చారి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం భారతీయ జనతా పార్టీ నాయకులు ఏడుపాయలల్లో కలియ తిరుగుతూ అక్కడ ఉన్నటువంటి లోటుపాట్లను అధికారంలో ఉన్న పాలన యంత్రాంగానికి తగు సలహాలు సూచనలు చేయడం పరిపాటి అని వాటిని పరిగణలోకి తీసుకొని భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలకు గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత పరిపాలన యంత్రాంగానికి ఉందని గుర్తు చేశారు. అదేవిధంగా పది సంవత్సరాల లోఒక్కసారి కూడా అమ్మవారిని దర్శించుకోకుండా 100 కోట్లు ఏడుపాయల అభివృద్ధికి ఇస్తున్నట్టుగా ప్రకటించి అప్పటి ముఖ్య మంత్రి కాలగర్భంలో కలిసిపోయారని ఇప్పుడు ఉన్న ముఖ్యమంత్రి అమ్మవారి వద్దకు విచ్చేసి అమ్మవారి సాక్షిగా 35 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేస్తున్నానని అబద్ధాలు చెప్పి సాక్షాత్తు అమ్మవారికి షటగోపం పెట్టిన పరిస్థితిని బిజెపి నాయకులు ఎండ కట్టారు. ఇన్ని సంవత్సరాల నుండి బిజెపి పోరాటాలు చేస్తున్న గాని కనీసం భక్తులకు నిలువ నీడ కూడా కరువైందని ఒక డార్మెటరీ నిర్మాణం చేయాలని ఎంతో కాలం నుండి మొరపెట్టుకున్న ప్రభుత్వాలు వినలేని పరిస్థితి ఉందని, పారిశుద్ధ్య లోపం కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుందని, ఆడవారికి బట్టలు మార్చుకునే గదులు కూడా సరిపోయే పరిస్థితి లేదని, మరుగుదొడ్ల నిర్మాణం కూడా అంతంత మాత్రమే ఉందని, తక్షణమే ఎమ్మెల్యే, పాలన యంత్రాంగం స్పందించి దూర ప్రాంతాల నుండి లక్షలాదిగా విచ్చేసే భక్తులకు ఏ రకమైన అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత వారి మీద ఉందని శాశ్వత ప్రాతిపదికన డార్మెటరీ నిర్మాణం చేయకపోతే రానున్న రోజుల్లో భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. భక్తులు సమర్పించే ఆదాయం కావాలి కానీ వాళ్ల సౌకర్యాలు పట్టవా అని అడిగారు, అదేవిధంగా పార్కింగ్ కూడా చాలా పెద్ద సమస్యగా మారిందని పార్కింగ్ సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఒక్క భక్తుడు కూడా నీళ్లలో మునిగి చనిపోకుండా చూడాల్సిన బాధ్యత పాలకవర్గానిదే అని ఒకవేళ ఈసారి కూడా ఒక్క భక్తుడు మరణించిన పూర్తి బాధ్యత ప్రస్తుత ప్రభుత్వానికి పాలన యాత్రంగానిదేనని బిజెపి నాయకులు దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు దుర్గయ్య శంకరయ్య చంద్రయ్య బాలయ్య మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు నాగభూషణం మైనార్టీ మోర్చా అధ్యక్షులు గౌస్ కార్యదర్శులు వడ్ల చంద్రశేఖర్ రాజు సంతోష్ గౌడ్ బీజేవైఎం మండల నాయకులు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# హన్మకొండ ట్రాఫిక్ ఆధ్వర్యంలో బస్ డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు




హన్మకొండ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర )నిన్న పర్వతగిరి ప్రాంతంలో జరిగిన పాఠశాల బస్సు ప్రమాదం నేపథ్యంలో సీపీ ఆదేశాల మేరకు హన్మకొండ ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ ఆధ్వర్యంలో మంగళవారం స్కూల్ బస్ డ్రైవర్ల కు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. స్కూల్ బస్సు డ్రైవర్లు మద్యం సేవించి వాహనము నడిపితే కఠినం వ్యవహరిస్తామని ఇన్స్ స్పెక్టర్ పేర్కొన్నారు.

# సమన్వయంతో మహా శివరాత్రి మహోత్సవములు విజయవంతం చేయాలి

**ఈ నెల 15 నుంచి 17 వరకు జాతర నిర్వహణ**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**





ములుగు ఫిబ్రవరి 10విజన్ ఆంధ్ర ప్రతినిధిమంగళవారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్. మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్, రామప్ప శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ఈవో లతో కలిసి ఆయా శాఖల అధికారులతో జాతర సమన్వయ సమావేశం నిర్వహించారు.మహా శివరాత్రి జాతర సందర్భంగా పారిశుద్ధ్యం, పార్కింగ్, రోడ్డు నిర్వహణ, దేవాలయం వద్ద వసతి సౌకర్యం, త్రాగునీటి సరఫరా, హెల్త్ క్యాంప్ ల ఏర్పాటు, ఫైర్ ఇంజన్ సౌకర్యం, హెల్ప్ సెంటర్ ఏర్పాటు సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాల పై సంబంధిత శాఖ అధికారులు సిద్ధం చేసుకున్న ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు మహా శివరాత్రి మహోత్సవ వేడుకలను వైభవోపేతంగా నిర్వహించాలని ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా జాతర నిర్వహించాల్సి ఉంటుందని, నిర్దేశించుకున్న పనులను జాతర సమయానికి సన్నద్ధమయ్యే విధంగా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జాతర కు వచ్చే భక్తుల సంఖ్య దృష్ట్యా పటిష్ట భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, రోడ్డుకు ఇరు వైపులా పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. భక్తుల కోసం అవసరమైన మేర పందిర్లు ఏర్పాటు చేయాలని అన్నారు.జాతర సందర్భంగా వచ్చే భక్తులకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా ఎక్కడికక్కడ చలి వేంద్రాలను, చలువ పందిరిలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆలయ పరిసరాలలో అపరిశుభ్రత కాకుండా పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన భద్రత ఏర్పాటు

## ఎన్నికల విధులలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

**ఎన్నికల ప్రవర్తన నియమావళిని అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తాం**

**అధికారులు, సిబ్బందికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిన డిఎస్పీ వెంకటేశ్వరరావు**




వనపర్తి ఫిబ్రవరి 10( విజన్ ఆంధ్ర ప్రతినిధి) వనపర్తి జిల్లా పరిధిలో జరుగుతున్న వనపర్తి మున్సిపాలిటీ ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరావు తెలిపారు.మంగళవారం రోజు జిల్లా కేంద్రంలోని ఆర్ జి ఫంక్షన్ హాలులో మున్సిపల్ ఎన్నికల బందోబస్తు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ... ఎన్నికల సందర్భంగా పోలింగ్ స్టేషన్ల వద్ద శాంతిభద్రతలు పటిష్టంగా ఉండేలా క్రమశిక్షణతో పనిచేయాలని డిఎస్పీ ఆదేశించారు. ఉదయం ప్రారంభం నుంచే ప్రతి పోలీసు సిబ్బంది తమ డ్యూటీ పోస్టులకు చేరుకుని, ఓటర్లు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.పోలింగ్ కేంద్రాల చుట్టుపక్కల 100 మీటర్ల పరిధిలో గుంపులు గుమికూడడం పూర్తిగా నిషేధించబడిందని, అనుమానాస్పద వ్యక్తులు లేదా చర్యలు గమనిస్తే వెంటనే స్పందించాలని తెలిపారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో అదనపు పికెటింగ్, స్ట్రైకింగ్ ఫోర్సులు, వీడియో రికార్డింగ్ వంటి ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. పోలింగ్ స్టేషన్ ప్రాంతంలో ప్రచార సామగ్రి, పార్టీ చిహ్నాలు, మొబైల్ ఫోన్లు తీసుకురావడం అనుమతించబడదని స్పష్టం చేశారు మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేయాలనిఎన్నికల సమయంలో ఉద్రిక్తత సృష్టించడం, గుంపులు గుమికూడడం, ఓటర్లపై ఒత్తిడి చేయడం వంటి చర్యలు జరుగుతే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం, డబ్బుల పంపిణీ చేసినా, ఎన్నికల ప్రశాంతతకు భంగం కలిగించిన ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిఎస్పీ హెచ్చరించారు.సోషల్ మీడియాలో, ఇతర ప్రసార మాధ్యమాలలో వ్యక్తులను గాని, రాజకీయ పార్టీలను గాని కించపరిచేలా తప్పుడు ప్రచారాలు చేసినా అట్టి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి సీఐ,రత్నం, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్,వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, వనపర్తి రూరల్ ఎస్సై, హృషికేష్ ఎన్నికల విధులకు వెళుతున్న అధికారులు ఎస్సైలు ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, మహిళ కానిస్టేబుళ్ళు, హోంగార్డు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# బైక్‌పై ప్రమాదకర విన్యాసాలు

హైదరాబాద్,ఫిబ్రవరి10 : బైక్‌పై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్న యువతకు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. నగరంలో యువకులు బైక్‌పై చేస్తున్న ప్రమాదకర విన్యాసాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో సీపీ సజ్జన్నార్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. వాహనాలను బాధ్యతాయుతంగా నడపాలని సూచించారు. బైక్ మీద చేసే ఈ చిత్రవిచిత్రమైన విన్యాసాలు చూడటానికి థ్రిల్లింగ్‌గా అనిపించవచ్చుని.. కానీ అవి క్షణాల్లో ప్రాణాలకు ముప్పు తెచ్చిపెడతాయని ఆయన హెచ్చరించారు. బైక్ మీద చేసే విన్యాసం.. నూరేళ్ల ఆయుష్షుకు వినాశనం అంటూ ఆయన పేర్కొన్నారు. చిన్న ప్రమాదం జరిగినా జీవితాంతం మంచానపడాల్సి వస్తుందని సీపీ అన్నారు.

# సజావుగా ఎన్నికల నిర్వహణ చెక్ లిస్ట్ చూసుకోవాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్




వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 ( విజన్ ఆంధ్ర ) :'నేడు జరిగే మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ జిల్లా మేరీ నాట్ పాఠశాల నందు ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ల ను పరిశీలించారు. 2026 ఫిబ్రవరి 11 బుధవారం జరగనున్న మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను ,జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎలక్షన్ మెటీరియల్ పంపిణిని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి... పోలింగ్ అధికారులకు ఇచ్చిన మెటీరియల్ ని చెక్ చేశారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పా ట్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వెళ్లి...ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారి గా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. బ్యాలెట్ పత్రాలు, బాక్స్ లు జాగ్రత్త గా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రి బ్యూ షన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏ ర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజ నం కల్పించాలని. విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు, లైటింగ్, పా ర్కింగ్ ప్రదేశాలు, వచ్చిపోయేదారులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రూట్ల వారీగా బస్సులు బయలుదేరే విధంగా అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి నారాయణ లు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 7 కేజీల గంజాయి పట్టివేత..

ఖమ్మం బ్యూరో ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర) మొండికుంట నుండి అశ్వాపురం మార్గం లో ద్విచక్ర వాహనం పై తరలిస్తున్న 7 కేజీ ల గంజాయి తరలిస్తూ ఉండగా ఎన్ఫోర్స్మెంట్ టీం పట్టుకున్నారు. ఖమ్మం ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సబ్ ఇన్స్పెక్టర్ సిహెచ్ .శ్రీహరిరావు, సిబ్బంది కలిసి మొండికుంట నుంచి అశ్వాపురం వెళ్ళే దారిలో కె.వి.ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వస్తున్న ఒక ద్విచక్ర వాహనం ను ఆపి తనిఖీ చేయగా దానిలో 7 ప్యాకెట్ల ఎండు గంజాయి లభ్యమైంది. గంజాయి ని తరలిస్తున్న కేసులో బడేటి వెంకటేష్ (సూర్యాపేట జిల్లా),మోరుబోయిన గోపయ్య s/o నాగరాజు (కృష్ణా జిల్లా). లు ఒడిశా రాష్టం లోని మల్కాన్ గిరి నుండి హైదరాబాద్ కు తరలిస్తూ పట్టుబడినారు. తదుపరి విచారణ నిమిత్తం ఇట్టి గంజాయిని, ద్విచక్ర వాహనం , సెల్ ఫోన్ మరియు ఇద్దరు ముద్దాయిలను ( వీటి మొత్తం విలువ రూ. 4, లక్షల 60 వేలు. మణుగూరు ఎక్సైజ్ స్టేషన్ లో అప్పగించడమైనది.. ఈ తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ యంఏ కరీం కానిస్టేబుల్స్ సుధీర్, వెంకట్, వీరబాబు లు పాల్గొన్నారు. గంజాయిని పట్టుకున్న టీం ను ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ .జనార్ధన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ .గణేష్ ,. తిరుపతి అభినందించారు.

# నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎంజి యూనివర్సిటీలో "సేఫర్ ఇంటర్నెట్ డే"



నల్లగొండ ఆర్ సి, ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర): కేంద్ర ఎలక్ట్రానిక్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ , జిల్లా కలెక్టర్ అనుమతితో నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం "సేఫర్ ఇంటర్నెట్ డే" ని నల్లగొండ జిల్లాలో కేంద్రంలోని మహాత్మ గాంధి యూనివర్సిటీ లో నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కాలేజీ ఎంజీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల్ రవి ,ప్రిన్సిపాల్ వసంత , జిల్లా ఇన్ఫర్మేటిక్స్ అధికారి వంశీధర్ రెడ్డి, ఐ రాడ్ మేనేజర్ గోపినాథ్, ప్రేమ్ కుమార్, ప్రొఫెసర్స్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఐ సి డీ ఐఓ వంశి ఇంటర్నెట్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలి , దానిని సరిగా వాడకపోతే ఎటువంటి దుష్పరిమాణాలు ఎదుర్కోవాల్సి వస్తుంది దానిలో తీసుకునే జాగ్రత్తలను తెలిపినారు. అదేవిధంగా సైబర్ మోసాలు ఎలా జరుగుతున్నాయి దాని నుండి మనల్ని ఎలా కాపాడుకోవాలి అనే విషయాలను వివరించారు. మనం చేసే చిన్న చిన్న తప్పుల వల్లనే మనం సైబర్ నేరాలలో బాధితులం అవుతున్నామని చిన్నచిన్న జాగ్రత్తలు పాటించడం వల్ల మనల్ని మనం కాపాడుకోవచ్చని వక్తలు వివరించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి

జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి10 (విజన్ ఆంధ్ర)రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ధర్మపురి కేంద్రంలో పోలింగ్ సామాగ్రి పంపిణీ ప్రక్రియను ఎన్నికల వ్యయ పరిశీలకులు శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ వారితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు పంపిణీ చేస్తున్న ఎన్నికల సామాగ్రిని అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పోలింగ్ సామాగ్రి సకాలంలో, సురక్షితంగా సంబంధిత పోలింగ్ కేంద్రాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల వ్యయ నియంత్రణ, నియమ నిబంధనల కచ్చితమైన అమలుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ఈ పరిశీలనలో స్పెషల్ ఆఫీసర్ మధు సూదన్, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి ఫిబ్రవరి 10,(విజన్ ఆంధ్ర)2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన పోలింగ్ నిర్వహణకు జిల్లాలోని 1 మున్సిపల్ కార్పొరేషన్, 4 మున్సిపాలిటీలలో అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లో 60 డివిజన్లకు గాను 265 పోలింగ్ కేంద్రాలు, బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులకు గాను 68 పోలింగ్ కేంద్రాలు, చెన్నూర్ మున్సిపాలిటీలో 18 వార్డులకు గాను 36 పోలింగ్ కేంద్రాలు, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 వార్డులకు 45 పోలింగ్ కేంద్రాలు, లక్షెట్టిపేట మున్సిపాలిటీలో 15 వార్డులకు గాను 30 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఒక బృందానికి 1 పి.ఓ., 1 ఎ.పి.ఓ., 3 ఓ.పి.ఓ. ల చొప్పున రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా అధికారుల బృందాలను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన సర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేలా పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని చెన్నూర్ పట్టణంలో గల అటవీశాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత



పాఠశాలలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్.కె.సి.ఓ.ఎ. క్లబ్ లో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు జోనల్, నోడల్ అధికారులు, పి.ఓ.లు, ఎ.పి.ఓ.లు, ఓ.పి.ఓ.లు, వీడియో, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, మీడియా సెల్, ఇతర ఎన్నికల సంబంధిత సిబ్బందిని నియమించి, అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థుల తరపున నియమించబడిన పూర్తి స్థాయి ఏజెంట్ల సమన్వయంతో తప్పుడు ఓట్ల పోలింగ్ ను నివారించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 మంది ఓటర్లకు మించకుండా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్ రోజున వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, నీడ ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ సమన్వయంతో భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని, పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల వ్యాసార్థం నిబంధన అమలులో ఉంటుందని తెలిపారు. రాజకీయ పార్టీలు, పోటీలో ఉండే అభ్యర్థులు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, నిబంధనలు లభించినట్లయితే ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# హక్కుల కాలరాసేందుకే నూతన కార్మిక చట్టాలు

## బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్





హన్మకొండ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర)భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయం బాలసముద్రం నందు అన్ని కార్మిక సంఘాలతో కలిసి ఉద్యోగ కార్మిక హక్కుల సాధనలో భాగంగా జాతీయ సార్వత్రిక సమ్మె సన్నాహక సమావేశాన్ని మంగళవారం రోజున నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ...కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 11న వేయి స్తంభాల దేవాలయం నుంచి కాజీపేట రైల్వే స్టేషన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 12 గురువారం రోజున జరిగే జాతీయ సార్వత్రిక కార్మికుల సమ్మెలో అన్ని సంఘాలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారునూతన కార్మిక చట్టాల కారణంగా కార్మికులు వారి కనీస హక్కులను కోల్పోతున్నారని అన్నారు. పనికి తగ్గ వేతనం, సెలవులు, నిరసన తెలిపే హక్కులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని వివరించారుమేనేజ్మెంట్ వారి పరిశ్రమలో పని చేసే ఉద్యోగిని హైర్ అండ్ ఫైర్ విధానంలో తీసుకొనే అవకాశం ఉందని తెలిపారు. కార్మికులు సంఘాలు ఏర్పాటు చేసుకోవడం హక్కుల సాధనకు ఉద్యమిస్తే వారిని తొలగించే ప్రమాదంలో ఉద్యోగులు ఉంటారని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి కనీస సౌకర్యాలు పొందలేని పరిస్థితి భవిష్యత్‌లో రాబోతోందని ఈ నూతన కార్మిక చట్టాల ద్వారా వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారుయూనియన్లను ఏర్పాటు చేసుకునే హక్కును సైతం కోల్పోతారని అన్నారు. కార్మికుల హక్కుల కోసం అన్ని సంఘాలు ఏకమై కేంద్రంపై పోరాడుదామని పిలుపునిచ్చారు. రైతు ఉద్యమమే స్ఫూర్తిగా కార్మికులందరం ఉద్యమిద్దామని సూచించారుకేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలిజాతీయ సార్వత్రిక సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని తెలిపారు. 4 నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని 29 పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి డిమాండ్ చేశారుసమావేశంలో పాల్గొన్న బీఆర్టీయూ హనుమకొండ జిల్లా కన్వీనర్ నాయిని రవి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సారంగపాణి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు , ఎంఏటీపీడీయూ అధ్యక్షులు ఇసంపల్లి సంజీవ, శ్రీధర్ రెడ్డి, అధ్యక్షులు ఎండి ఇస్మాయిల్, టీబీఎన్ఆర్‌కే పి శివకుమార్, భిక్షపతి, రాజు, జీడబ్ల్యూఎంసీ నాయకులు భిక్షపతి, ధర్మరాజు, ప్రతాపరుద్ర ఆటో యూనియన్ నర్సింగ్, హోటల్ యూనియన్ అధ్యక్షులు రఘుబాబు, కార్మిక నాయకులు నారయణ గిరి రాజు, పలు సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకై పకడ్బందీ ఎర్పాట్లు

## -వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

హన్మకొండ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర)మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. రేపు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జనగామ, ఘన్పూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట మున్సిపల్ ఎన్నికల బందోబస్తు నిర్వహణ కోసం 1100 పైగా పోలీసులను వినియోగించడం జరుగుతోందని ఇందులో ముగ్గురు డిసిపిలతో పాటు ఐదుగురు అదనపు డిసిపిలు4మంది, ఏసిపిలు 11మంది, ఇన్స్పెక్టర్లు125 మంది, ఎస్.ఐలు 113 మంది, ఏ.ఎస్.ఐ/హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు 515, హోంగార్డ్స్ 226 మంది వీరితో పాటు డిస్ట్రిక్ట్ గార్డ్స్, బాంబ్ డిస్పోజబుల్ విభాగాలకు చెందిన సుమారు 168 సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని. ఎన్నిక వేళ అదనపు డిసిపి స్థాయి పర్యవేక్షణలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ నియమించడం జరిగిందని, ఎన్నికలు జరిగే ప్రతి మున్సిపల్ పరిధిలో ఒక ఏసిపి స్థాయి అధికారిని ఇంచార్జ్‌గా వుంటారని. రూటు మొబైల్స్ టీంలు, షాడో పార్టీలు,ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ఎస్.ఐ/ ఏ.ఎస్.ఐతో పాటు హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు, హోంగార్డులు విధులు నిర్వహిస్తారని, మొబైల్ పార్టీలు నిరంతరం పెట్రోలింగ్ పోలీస్ బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తారని పోలీస్ కమిషనర్ వెల్లడించారు.ఎన్నిక వేళ ఎవరైన ఎన్నికలకు విఘాతం కలిగించే విధంగా ఎలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని. ఇలాంటి చర్యలకు ఎవరైన పాల్పడుతున్నట్లుగా సమాచారం అందితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.

# మునిసిపల్ పోలింగ్ కు పటిష్ట ఏర్పాట్లు..

## ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

**సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్,**
**సీసీ కెమెరాలతో పర్యవేక్షణ**
**అవాంఛనీయ సంఘటనలు జరగకుండా**
**కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు**
**సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో**
**ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, స్ట్రాంగ్**
**రూం, కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేసి,**
**ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్‌లి అనుదీప్**





ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -10 (విజన్ ఆంధ్ర)జిల్లాలో ఐదు మున్సిపాలిటీ లలో పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేశామని, ప్రజలు ఎటువంటి ఒత్తిళ్లు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఫిబ్రవరి 11 బుధవారం న నిర్వహించే మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా సత్తుపల్లి మున్సిపాలిటీకి జ్యోతి నిలయం నందు, కల్లూరు మున్సిపాలిటీకి కల్లూరు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నందు ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలతో పాటు రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం తనిఖీ చేశారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలలో బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ లో వినియోగించే ఎన్నికల సామాగ్రిని పరిశీలించి, పోలింగ్ సిబ్బందితో కలెక్టర్ మాట్లాడారు. ఓటర్ లకు బ్యాలెట్ పేపర్స్ ఇవ్వడం, పివో డైరీ నింపడం, అన్ని ఫార్మ్ ఎలా నింపాలి, ఏజెంట్స్ సిగ్నేచర్ ఎక్కడ తీసుకోవాలి, పోలింగ్ పూర్తి అయిన తర్వాత బ్యాలెట్ బాక్స్ సీలింగ్, స్ట్రాంగ్ రూం కు తరలింపు తదితర అంశాల మీద పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల విధులు నిర్వహించే వారికి ఏర్పాటు చేసిన చోటనే బస చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి గ్రామ పంచాయతీ ఎన్నికలను విజవంతంగా పూర్తి చేసిన స్ఫూర్తితో జిల్లాలో పురపాలక ఎన్నికలను పకడ్బందీ చర్యలతో ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఫిబ్రవరి 11 బుధవారం జిల్లా పరిధిలో ఏదులాపురం, వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి మున్సిపాలిటీ లలో వార్డు మెంబర్ స్థానాలకు పోలింగ్ జరుగుతుందని అన్నారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఫిబ్రవరి 13న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత కు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు కల్పించామని వివరించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్ లొకేషన్స్ గుర్తించి ఆయా కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశామని, సీసీ కెమెరా ద్వారా నిరంతర పర్యవేక్షిస్తామని, సెన్సిటివ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లు నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఎటువంటి ఒత్తిడులు, భయాందోళనలు లేకుండా తమ ప్రజాస్వామ్యమైన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించాలని అన్నారు. ఓటు హక్కు అందరి భాధ్యత అని, ప్రతి ఓటు విలువైనదని, ఓటర్లు అందరూ నిర్ణిత సమయానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చి, ఎవరి ప్రభావానికి లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని కలెక్టర్ కోరారు. జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో 117 వార్డులలో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. ఎన్నికల సజావు నిర్వహణకు పూర్తిస్థాయిలో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేసి, మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు వివరించారు. ఎన్నికల సామాగ్రి పోలింగ్ కేంద్రాలకు, తిరిగి పోలింగ్ కేంద్రాల నుండి స్ట్రాంగ్ రూమ్ కు తరలింపుకు సరిపడా బస్సులను సిద్ధం చేసినట్లు, పోలీస్ ఎస్కార్టుతో బందోబస్తుకు కార్యాచరణ చేసినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛ, న్యాయబద్దంగా జరిగేలా అన్ని వర్గాల వారు సహకరించాలని కలెక్టర్ కోరారు. పోలింగ్ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు, పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, ప్రత్యేక అవసరాలున్న ఓటర్లకు సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, తహసీల్దారు లక్ష్మి, ఎంపీడీవో చంద్రశేఖర్, మున్సిపల్ కమీషనర్లు నరసింహ, రామదుర్గారెడ్డి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 7వ డివిజన్‌లో కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు

## ఎమ్మెల్యే నాయిని సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి ఆహ్వానం

హన్మకొండ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 ( విజన్ ఆంధ్ర )వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 7వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. బీజేపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్ ఆధ్వర్యంలో సుమారు 30 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



మాట్లాడుతూ, ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. రానున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో 7వ డివిజన్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఎల్పుల మల్లికార్జున్ (మల్లి), గోపగోని సాయి గౌడ్, వై శ్రీనివాస్, పుల్యాల వంశీ, కుందూరు ప్రశాంత్, ఉదయ్ గౌడ్, సర్వర్, తరుణ్, రాకేష్, భాను తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూ బాధితులకు పరిహారం చెక్కు అందజేత

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి ఫిబ్రవరి 10,(విజన్ ఆంధ్ర)జిల్లాలోని క్యాతనపల్లి మీదుగా చేపట్టిన జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య తో చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్యాతనపల్లి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన 19 మందికి చెందిన 1 కోటి 32 లక్షలు 70 వేల 382 రూపాయల చెక్కును వెంకటస్వామి, రజిత లకు అందించడం జరిగిందని తెలిపారు.

## విజయవంతంగా ముగిసిన ఎన్ ఎస్ ఎస్ శీతాకాల ప్రత్యేక శిబిరం




ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్రా)గత ఏడు రోజులుగా చిన్న గోపతి గ్రామంలో కవిత డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఎన్ ఎస్ ఎస్ శీతాకాల ప్రత్యేక శిబిరం లో భాగంగా మంగళవారం విజయోత్సవ, ముగింపు సభను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు గత వారం రోజుల నుంచి వివిధ సేవా కార్యక్రమాలు, పారిశుధ్య పనులు చేసిన వాలంటీర్లను అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రాధాకృష్ణమూర్తి గారు మాట్లాడుతూ విద్యార్థులు చాలా క్రమశిక్షణతో వారం రోజులు పాటు అనేక సామాజిక విషయాలను అవగాహన చేసుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి గెస్ట్ గా విచ్చేసిన గ్రామ సర్పంచ్ ఎస్ నాగేశ్వరరావు గారు మాట్లాడుతూ ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు చిన్నగోపతి గ్రామానికి చేసిన సేవాకార్యక్రమాలు కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని ఆద్యంతం ముందుండి నడిపించిన కళాశాల ఎన్ ఎస్ ఎస్ పి ఓస్ ఎస్ కే జానీ మియా మరియు సిహెచ్ రాజేష్ ని ప్రత్యేకంగా సత్కరించి, అభినందించారు. అలాగే కవిత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మరియు సిబ్బందికి తన యొక్క ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లును అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నగరంలో 'జైడస్ పింకథాన్' ఆధ్వర్యంలో శారీ రన్



హైదరాబాద్, ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర) : నగరంలోని మల్కం చెరువు పార్క్ వద్ద ఒక అపురూప దృశ్యానికి వేదికైంది. జైడస్ పింకథాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'శారీ రన్'లో మహిళలు తమ సాంప్రదాయ దుస్తుల్లో ఉత్సాహంగా అడుగులు వేశారు. 5 కిలోమీటర్ల మేర సాగిన ఈ పరుగులో విభిన్న వయసులోని వందలాది మంది మహిళలు చీరకట్టులో ఉత్సాహంగా పాల్గొని ఫిట్‌నెస్‌కు దుస్తులతో పనిలేదని నిరూపించారు. వయస్సు, కట్టుబాట్లు శారీరక శ్రమకు అడ్డంకి కావనే పింకథాన్ నమ్మకాన్ని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది. 2025-26 'జైడస్ పింకథాన్ హైదరాబాద్' ఈవెంట్ కు సన్నాహకంగా నిర్వహించిన ఈ పరుగు సంప్రదాయం, సామాజిక అంచనాలు మహిళల ఆరోగ్యాన్ని ఎప్పుడూ పరిమితం చేయకూడదనే బలమైన సందేశం సమాజానికి అందింది. మహిళలు తమ దైనందిన జీవితంలో ఆరోగ్యాన్ని ఒక భాగంగా చేసుకోవాలనే లక్ష్యంతో ఈ వినూత్న ఫార్మాట్‌ను రూపొందించారు. ఫిబ్రవరి 15న ఉదయం 5:30 గంటలకు పీపుల్స్ ప్లాజాలో జైడస్ పింకథాన్ హైదరాబాద్ ప్రధాన ఈవెంట్ జరగనుంది. ప్రముఖ ట్రయాథ్లెట్, ఇన్విన్సిబుల్ ఉమెన్ వ్యవస్థాపకురాలు అంకితా కోన్వర్ స్వయంగా మహిళలతో కలిసి పరిగెత్తి అందరిలో స్ఫూర్తి నింపారు

## వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తిచే యాలి

### జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి ఎస్ అనిత



జన్నారం, ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర) : వ్యాక్సినేష న్ కార్యక్ర మాన్ని వంద శాతం పూర్తి చేయాలని జి ల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఎస్ అనిత సూ చించారు. మంగళవారంరోజున జన్నారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆక స్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో అందిస్తున్న వైద్య సేవలు, వ్యాక్సినేషన్ కార్యక్రమం, వ్యాక్సిన్ నిలువలను ఆమె పరిశీలించి వైద్యఆరోగ్య కార్యక్రమాలపై, సిబ్బందితో సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బువారం, శనివారం రోజులలో వ్యాక్సినేషన్ కార్యక్రమాలను మందశాతం పూర్తి చేయాలని సరై న సమయంలో టీకాలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి ఉపకేంద్రం పరిధిలో వైద్య సి బ్బంది సమయపాలన పాటించాలని సిబ్బందికి కే టాయించిన గ్రామాలలో సందర్శనలు చేస్తూ ఇం టింటికి తిరిగినప్పుడు తల్లులు గర్భవతులు వృద్ధు లు, చిన్న పిల్లలతో మాట్లాడి వారికి వైద్య ఆరోగ్య కార్యక్రమాల గురించి తెలియజేయాలని తెలిపా రు. వాతావరణ మార్పులతో వ్యాధులు వచ్చే అవ కాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని కీటక జనిత వ్యాధులైన దోమలు కుట్టడం ద్వారా వచ్చే మలేరియా డెంగ్యూ చికెన్ గునియా లాంటి వి ప్రబలకుండా చర్యలు చేపట్టాలని గ్రామపంచా యతీ సర్పంచుల సహకారంతో గ్రామాలలో ముం దస్తు చర్యల్లో భాగంగా పరిసరాల పరిశు భ్రత ఫ్రైడే పాటించాలని అదేవిధంగా అసంక్రమణ వ్యాధుల్లో భాగంగా జీవనశైలిలో మార్పుల ద్వారా వచ్చే వ్యా ధులు 30 సంవత్సరముల పైబడిన వారందరికీ డ యాబెటిస్, రక్తపోటు, బిపి, క్యాన్సర్ లాంటి వ్యా ధులకు పరిక్షలు చేసి తొందరగా వ్యాధి గుర్తించి చి కిత్సలు అందించి వ్యాధి పట్ల అవగాహన కల్పిం చాలని సిబ్బందికి సూచించారు. క్షయ నియంత్రణ లో భాగంగా మారుమూల ప్రాంతాలలో మొబైల్ ఎక్స్రే ద్వారా పరీక్షలు చేయడంతో పాటు గ్రామాలలో ఆరోగ్య అవగాహన శిబిరాలను పెట్టాలని జిల్లా మాస్ మీడియా అధికారికి బుక్క వెంకటేశ్వర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమశ్రీ, వైద్య సిబ్బంది సి హెచ్ ఓ వెంకటేశ్వర్లు డిపిఓ ప్ర శాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి

## :జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్

నల్లగొండ ఆర్ సి , ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర) : మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ తెలిపారు.మంగళవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావి వద్ద ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములో ఏర్పాటుచేసిన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముందుగా సిబ్బందితో మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలని, ఎలాంటి తేడా లేకుండా నిర్వహించాలని, అన్ని విషయాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, పోలింగ్ మెటీరియల్ ను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు .బ్యాలెట్ పేపర్ సీరియల్ నెంబర్, బ్యాలెట్ పేపర్ అకౌంట్, పిఓ డైరీ జాగ్రత్తగా రాయాలని ఆదేశించారు. పోలింగ్ రోజున ఉదయం 6:45 గంటలకు ఏజెంట్ల ఎదురుగా బ్యాలెట్ బాక్స్ ను తెరవడం చేయాలన్నారు.అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ నెల 11 న నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు, జిల్లాలోని 6 మున్సిపాలిటీలకు మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకుగాను అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, 161 వార్డులకు సంబంధించి473 పోలింగ్ కేంద్రాలలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనుందని హాలియా మున్సిపాలిటీ లోని 10 వ వార్డు ఎన్నిక ఏకగ్రీవం అయినందున అక్కడ ఎన్నికలు నిర్వహించడం లేదని తెలిపారు. 3 లక్షల 9 వేల 97 మంది ఓటర్లు మున్సిపల్ ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకొనున్నారని, ఇందుకుగాను ఓటర్లు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించామని, ఓటరు చీటీలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సవ్యంగా నిర్వహించేందుకు సిబ్బందిని నియమించడంతోపాటు, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించడం జరిగిందని, డిఆర్సి కేంద్రాల ద్వారా పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.



మున్సిపల్ ఎన్నికలకు 2855 మంది సిబ్బంది సేవలను వినియోగించుకోవడం జరుగుతున్నదని, వీరందరికీ శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. డిఆర్సి కేంద్రాల నుండి పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సిబ్బందికి బస్సులు ఏర్పాటు చేసి పంపిస్తున్నట్లు చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించామని, గత మున్సిపల్ ఎన్నికల్లో 79.5% ఓట్లు పోల్ కాగా, ఇటీవలి గ్రామపంచాయతీ ఎన్నికల్లో 89% ఓట్ల పోలయ్యాయని, పోలింగ్ ను పెంచేందుకు గాను అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని, ముఖ్యంగా ఓటర్లకు అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఆడియో క్లిప్ ద్వారా ఓటు వేసే విధంగా అవగాహన కల్పిస్తున్నామని, ఓటర్లు 18 రకాల గుర్తింపు కార్డులను చూపించి ఓటు వేసేలా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించి ఆర్జాల భావి వద్ద ఉన్న ఎస్ డబ్ల్యుసి గోదాంలో నల్గొండ మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల ఓట్ల లెక్కింపు , దేవరకొండ, చండూరు చిట్యాల మున్సిపాలిటీలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఎస్ఎల్బీసీ సమీపంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, హాలియా మున్సిపాలిటీలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని మిర్యాలగూడ అవంతిపురం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ చేర్పరు. సోమవారం సాయంత్రం 5 గంటల నుండి ఎన్నికల ప్రచారం ముగిసినందున ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి, వి ఎస్ టి బృందాలు చురుకుగా పనిచేస్తున్నాయని, ఎక్కడైనా డబ్బు, మద్యం పంపిణీ జరుగుతున్నట్లయితే తక్షణమే స్పందించి సీజ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులను జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ కు తెలియజేయాలన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీ ఓటర్లు అందరూ వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు స్ట్రైకింగ్ ఫోర్స్ తో పాటు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సును, ఇతర పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశామని, 10 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా 60 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకు పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందని,ఎన్నికలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే స్పందించే విధంగా బందోబస్తు ప్రణాళిక రూపొందించమన్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ను దృష్టిలో ఉంచుకొని 400 మందిని బైండోవర్ చేయడం జరిగిందని ,ప్రస్తుతం పరిస్థితి తమ కంట్రోల్ లో ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా జిల్లాలో సోమవారం నాలుగన్నర కేజీల సిల్వర్ ను, 120 లీటర్ల ఆల్కహాల్ ను సీజ్ చేయడం జరిగిందని ఆయన వెల్లడించారు .ఓటర్లను ప్రభావితం చేయకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని, సమస్యాత్మక వార్డుల వద్ద అదనపు సిబ్బందిని నియమించామని, దీంతోపాటు, సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ద్వారా కూడా పర్యవేక్షణ చేస్తున్నట్లు వెల్లడించారు. నల్గొండ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని, ఏవైనా సమస్యలు ఉంటే 100 నంబర్ కు డయల్ చేయాలని ఆయన కోరారు.స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ ,ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి ,ఇతర అధికారులు ఉన్నారు

# ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోంది బాధ్యులపై ఉక్కుపాదం తప్పదు

### -ఎక్కడెక్కడ పరికరాలు పెట్టారో ఆరా తీస్తున్నాం: మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు

### ?పుర పోరులో కాంగ్రెస్ ప్రభంజనం.. 80 శాతం పైగా స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయం

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర)రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలోనే కాకుండా ప్రస్తుతం కూడా రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కొనసాగుతోందని, దీనిపై ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా ఉందని వెల్లడించారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ట్యాపింగ్ కోసం ఎక్కడెక్కడ ఎక్విప్‌మెంట్ (పరికరాలు) అమర్చారో ప్రభుత్వం ఇప్పటికే ఆరా తీస్తోందని, విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.**ప్రజాస్వామ్య స్వేచ్ఛకు భంగం కలిగిస్తే వదిలిపెట్టం**"ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, జరుగుతోందని అనేక మంది గగ్గోలు పెడుతున్నారు.. ఇది అక్షరాలా నిజం. ఇప్పుడు కూడా కొందరు ఈ అక్రమాలకు పాల్పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం ఎంక్వయిరీ చేస్తోంది. ఎవరు సూత్రధారులు? ఎక్కడెక్కడ పరికరాలు పెట్టారు? అనేది బయటకు తీస్తాం. చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగులను ఓట్లు అడగడంలో తప్పేముందని, తన పార్టీ తరపున తాను అడిగానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.**మున్సిపల్ ఎన్నికల్లో 80 శాతం పైగా సీట్లు కాంగ్రెస్ వే** 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించబోతోందని మంత్రి



ధీమా వ్యక్తం చేశారు. "గడిచిన రెండేళ్లలో మేం చెప్పిన ప్రతి మాటను నిలబెట్టుకుని ప్రజలకు చేరువయ్యాం. అందుకే ఈ పుర ఎన్నికల్లో 80 శాతానికి పైగా స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోబోతోంది. ఇది జీర్ణించుకోలేకే ప్రతిపక్ష నాయకులు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ విసిరిన సవాళ్లను ప్రజలు తిప్పికొట్టారు.. అదే ఫలితం రేపు పునరావృతం కాబోతుంది" అని అన్నారు. **అభివృద్ధికి పెద్ద పీట**గత ప్రభుత్వ తీరుపై పొంగులేటి తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి ధనిక తెలంగాణను రూ. 8.19 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు. నెలకు రూ. 6,300 కోట్లు కేవలం అప్పులకే కడుతూ కూడా సంక్షేమాన్ని ఆపలేదు. గత దొరల పాలనలో పేదలను విస్మరించారు. 62 వేల డబుల్ బెడ్ రూంలను మొండిగోడలుగా మిగిల్చారు. కానీ మేం 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. 'వరి వేస్తే ఉరి' అన్న కాలం పోయి, ఇప్పుడు వడ్లకు బోనస్ ఇస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం" అని వివరించారు. మాజీ మంత్రుల అసభ్య పదజాలానికి ప్రజలు ఓటు ద్వారానే తగిన గుణపాఠం చెబుతారని ఆయన పేర్కొన్నారు.

# మహాశివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

### వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

### మున్సిపల్ కమిషనర్‌తో కలిసి ఏర్పాట్ల క్షేత్రస్థాయి పరిశీలన

### రుద్రేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే..

హన్మకొండ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 ( విజన్ ఆంధ్ర ) : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని హనుమకొండలోని వేయి స్తంభాల ఆలయంలో నిర్వహించనున్న వేడుకలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 14 నుంచి 18 వరకు జరిగే ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.మంగళవారం నాడు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, పోలీస్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆలయ పరిసరాలను సందర్శించి, భక్తులకు అందించే సౌకర్యాలు, పారిశుధ్యం, ట్రాఫిక్ నిర్వహణ, తాగునీటి వసతి, విద్యుత్ సరఫరా తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్యూ లైన్ల ఏర్పాటు, పార్కింగ్ ప్రాంతాలు, భక్తుల రాకపోకల మార్గాలు వంటి విషయాలపై సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ రుద్రేశ్వర స్వామి వారిని దర్శించుకుని వేదమంత్రాల సాక్షిగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు సమర్పించారు.తదనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, వేయి స్తంభాల దేవాలయంలో



మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సదుపాయం, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసి అత్యవసర సేవలను అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు.దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించామని, రవాణా, పోలీస్ శాఖల సమన్వయంతో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భక్తుల భద్రత కోసం పోలీస్ యంత్రాంగం నిరంతరం నిఘా ఉంచుతుందని పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయడంలో భక్తులందరూ అధికారులకు సహకరించి, ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకోవాలని ఎమ్మెల్యే గారు కోరారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, డివిజన్ అధ్యక్షులు కుమార్ యాదవ్, సతీష్, ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, ఆలయ ఈఓ అనిల్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరించిన రైస్ మిల్లర్లు ఎఫ్ సి ఐ కి బియ్యం దిగుమతి చేయాలి


### -- అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్

మహబూబ్ నగర్, ఉమ్మడి జిల్లా బ్యూరో ఫిబ్రవరి 10 విజన్ ఆంధ్ర ఖరీఫ్ 2025-26 కు సంబంధించి వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు కేటాయించిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైసింగ్ రూపంలో సివిల్ సప్లయ్ ఎఫ్ సి ఐ కి బియ్యం దిగుమతి చేయాలి . ఇప్పటి వరకు వొక్క ఎ సి కే పెట్టని రైస్ మిల్లులకు షో కాస్ నోటీసు జారి చేసేలా జిల్లా మేనేజర్ సివిల్ సప్లయ్ ను ఆదేశించడం జరిగింది.ఈరోజు శ్రీ ఇండస్ట్రీస్ , విజయలక్ష్మి రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేయటం జరిగింది , బ్యాంకు గ్యారంటీలు మరియు జిల్లాలో ఇప్పటి వరకు ఖరీఫ్ 2025-26 కు వొక్క సి ఎం ఆర్ పెట్టని మిల్లులకు షో కాస్ నోటీసులు ఇచ్చేలా జిల్లా మేనేజర్ సివిల్ సప్లయ్ ను ఆదేశించడం జరిగింది. 16.02.2026 లోపు ఎవరైతే సి ఎం ఆర్ పెట్టని మిల్లుల దగ్గర ధాన్యాన్ని తరలించి సక్రమంగా సి ఎం ఆర్ పెడుతున్న మిల్లులకు కేటాయించడం జరుగుతుంది . ప్రతి రోజు సివిల్ సప్లయ్ డిప్యూటీ తఃసిల్దార్లు పర్యవేక్షణ చేస్తూ ప్రతి రోజు సక్రమంగా సి ఎం ఆర్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి అని ఆదేశించడం జరిగిందిఅలాగే రబీ 2024-25కు సంబంధించి ఇప్పటి వరకు మన జిల్లాలో 86% సి ఎం ఆర్ పూర్తి చేయటం జరిగింది మిగిలిన 14 పూర్తి చేసేలా ప్రతి రోజు రైస్ మిల్లులు సందర్శించి వారి ద్వారా సి ఎం ఆర్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి అని సివిల్ సప్లయ్ డిప్యూటీ తఃసిల్దార్లను ఆదేశించడం జరిగింది అక్కడి డిప్యూటీ తహసిల్దార్ ఆదిత్య పాల్గొన్నారు.

## ఆరోగ్య కార్యక్రమాల నిర్దేశిత లక్ష్యాలను సాధించడానికి సమన్వయంతో పనిచేయాలి,

### ఆరోగ్య మహిళ రెఫెరల్ కేసులకు తగిన ఫాలో సేవలందించాలి

### -డాక్టర్ ఎ అప్పయ్య జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి హనుమకొండ



హన్మకొండ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర)హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్ ఏ అప్పయ్య ఈరోజు శాయంపేట పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈరోజు ఆరోగ్య మహిళ కార్యక్రమం జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. 8 అంశములలో మహిళలకు పరీక్షలు , అలాగే మహిళలకు సంబంధించిన అంశములపై వారికి అవగాహన కలిగించాలని , రెఫర్ చేసినటువంటి మహిళలను ఫాలోఅప్ చేస్తూ వారికి తగిన సేవలు అందించాలన్నారు. అందుతున్న వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను, వివిధ కార్యక్రమాలకు సంబంధించిన ప్రగతిని ఆయన సమీక్షించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేపట్టిన మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన అవసరమైన వైద్య సేవలు అందించాలని, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, సమయపాలన పాటించాలని, తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలి అని ఆయన అన్నారు. గర్భిణీ స్త్రీల నమోదు ,వారి కి 4 చెకప్ లు , ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవానికి ప్రోత్సహించడం ప్రసవానంతరం వారికి తగిన ఫాలో సేవలు అందించాలని ఆయన సూచించారు. వైద్యాధికారి డాక్టర్ మౌనిక కార్యక్రమాలకు సంబంధించిన ప్రగతిని వివరించారు

## 21వ వార్డులో దూసుకుపోతున్న బిజెపి ప్రచారం

### కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించండి

### కేంద్ర సంక్షేమ పథకాలు అర్హులకు చేరుస్తాం

### వార్డు అభివృద్ధికి అహర్నిశలు కృషి

### 21వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి చింతలబొగుడ కవిత



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర) : వార్డు అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని 21వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి చింతలబొగుడ కవిత అన్నారు. వార్డును అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని ఆమె స్పష్టం చేశారు. మంగళవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోగల 21వ వార్డుకు చెందిన రామయ్యగూడ ఎంఐజిలో గడపగడపకు తిరుగుతూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులకు చేరుస్తానని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. వార్డు ప్రజలు నన్ను ఆదరించి ఆశీర్వదించి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె ఓటర్లను విజ్ఞప్తి చేశారు. వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిసి రోడ్లు నిర్మాణం పూర్తి చేస్తానని ఆమె స్పష్టం చేశారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సహకారంతో 21వ వార్డును సంపూర్ణంగా అభివృద్ధి చేస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. అనునిత్యం ప్రజలతో సత్సంబంధం కొనసాగిస్తూ సమస్యల పరిష్కారానికి నా సహాయ శక్తుల కృషి చేస్తానని ఆమె తెలిపారు. నేను ఆశతో ఎన్నికల్లో పోటీ చేయడం లేదని ఆశయంతో పోటీ చేస్తున్నానని ఆమె చెప్పారు. అధికారం కోసం రావడంలేదని అభివృద్ధి కొరకు వస్తున్నానని ఆమె అన్నారు.

# ఆధ్యాత్మిక చరిత్ర వక్రీకరణకు తావులేదు

**శ్రీ చిన్నజీయర్ స్వామి వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని**
**సీనియర్ జర్నలిస్ట్ గోగులపాటి కృష్ణమోహన్ డిమాండ్**



కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర); ఇటీవల ముచింతల్‌లో నిర్వహించిన ఒక ఆధ్యాత్మిక కార్యక్రమంలో శ్రీ చిన్నజీయర్ స్వామి చేసిన కొన్ని వ్యాఖ్యలు భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలకు, శాస్త్రసమ్మత చరిత్రకు విరుద్ధంగా ఉన్నాయని సీనియర్ జర్నలిస్ట్ గోగులపాటి కృష్ణమోహన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు శైవ--వైష్ణవ సంప్రదాయాల మధ్య అనవసరమైన అపోహలు, విభేదాలకు దారి తీసే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. జగద్గురు ఆదిశంకరాచార్యులను "వైష్ణవుడు"గా పేర్కొనడం, అలాగే చతురామ్నాయ పీఠాలు ఆదిశంకరాచార్యులు స్థాపించలేదని వ్యాఖ్యానించడం చారిత్రక సత్యాల వక్రీకరణగా ఉందని కృష్ణమోహన్ స్పష్టం చేశారు. ఆదిశంకరాచార్యులు స్మార్త సంప్రదాయానికి ఆధారస్తంభమని, అద్వైత సిద్ధాంతం ద్వారా శైవ, వైష్ణవ, శాక్త, సౌర, గాణపత్య మార్గాలను సమన్వయపరిచి భారతీయ ఆధ్యాత్మిక ఏకత్వానికి పునాది వేసిన మహానుభావుడని ఆయన గుర్తు చేశారు. చతురామ్నాయ పీఠాలు జగద్గురు ఆదిశంకరాచార్యులే స్థాపించారనే విషయం శాస్త్రాలు, పరంపరలు, చారిత్రక ఆధారాలతో స్పష్టంగా రుజువైందని ఆయన తెలిపారు. ఈ వాస్తవాలను విస్మరించే వ్యాఖ్యలు సమాజంలో అపోహలను పెంచి, ఆధ్యాత్మిక సమన్వయాన్ని దెబ్బతీస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా జగద్గురు పరంపరపై అపహాస్యంగా మాట్లాడిన సందర్భాలు, అలాగే "శివుడు ఉన్నచోటే శ్మశానం" వంటి వ్యాఖ్యలు ఆధ్యాత్మిక వేదికల గౌరవాన్ని తగ్గించినవిగా విమర్శలకు గురయ్యాయని కృష్ణమోహన్ గుర్తు చేశారు. ఆధ్యాత్మిక ఆచార్యులు సమాజానికి దారి చూపించాల్సిన బాధ్యత కలవారని, విభేదాలు రెచ్చగొట్టడం కాదు, శాస్త్రం--సంప్రదాయం--సమన్వయాన్ని బోధించాల్సిన బాధ్యత వారిదేనని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలకు దూరంగా ఉంటేనే శ్రీ చిన్నజీయర్ స్వామి కి సమాజంలో గౌరవం మరింత పెరుగుతుందని, లేకపోతే శాస్త్రపరమైన అవగాహనలేని మాటలు ఆధ్యాత్మిక చర్చలను గంభీరత నుంచి అపహాస్య స్థాయికి తీసుకెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎంతటి స్థాయి, ఎంతటి ప్రభావం ఉన్నా శైవులు--వైష్ణవులు మధ్య చిచ్చు పెట్టేలా లేదా ఒక సంప్రదాయాన్ని మరొకదానికి ఎదురు నిలబెట్టేలా ఎవరూ మాట్లాడకూడదని ఆయన హితవు పలికారు. భారతీయ ధర్మ బలం విభజనలో కాదు, సమన్వయంలోనే ఉందని, ఆ సత్యాన్ని గౌరవించడమే ఆధ్యాత్మిక నాయకత్వానికి నిజమైన అర్హత అని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో శ్రీ చిన్నజీయర్ స్వామి తాము చేసిన వ్యాఖ్యలపై బహిరంగంగా వివరణ ఇవ్వాలని, అవసరమైతే క్షమాపణ కూడా ప్రకటించాలని గోగులపాటి కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. శాస్త్రసమ్మత ఆధారాలు లేకుండా భారతీయ ఆధ్యాత్మిక పరంపరలను తప్పుగా ప్రతిబింబించే వ్యాఖ్యలు ఎంతటి ఆచార్యుడి నుంచైనా రావడం సమాజానికి మేలు చేయదని ఆయన తేల్చి చెప్పారు. భవిష్యత్తులో అయినా శైవ--వైష్ణవ సంప్రదాయాల మధ్య అనవసరమైన విభేదాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని, సమన్వయం, సౌహార్దం, శాస్త్రగౌరవం నిలబడేలా బాధ్యతాయుతమైన మాటలే మాట్లాడాలని ఆయన కోరారు. ఇలాంటి సందర్భాల్లో మౌనం కాదు, స్పష్టతే ఆధ్యాత్మిక నాయకత్వానికి గౌరవం తీసుకువస్తుందని, లేకపోతే ప్రజల ముందు ఆచార్యుల ప్రతిష్టే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి ఏర్పడుతుందని కృష్ణమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు.

# పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి(విజన్ ఆంధ్ర):2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11వ తేదీన జరగనున్న పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో 20 వార్డులకు గాను 28 పోలింగ్ కేంద్రాలు, కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలోని 30 వార్డులకు గాను 85 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి నీడ, కుర్చీలు, త్రాగునీరు, భోజన వసతి కల్పించాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తు, సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ హాలులో కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వాన్‌పిక్ ప్రాజెక్ట్‌కు సుప్రీంలో ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి10 : వాన్‌పిక్ ప్రాజెక్ట్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేయాలన్న పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థ నమోదు చేసిన అభియోగాలను సీబీఐ ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకుందని.. దానికి గల కారణాలు చెప్పలేదంటూ వాన్‌పిక్ యాజమాన్యం తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేయడంతో వాన్‌పిక్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై జస్టిస్ సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ.. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. దీనిపై విచారణకు నిరాకరిస్తూ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు భద్రతా ఏర్పాట్లు పూర్తి

**జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్**
**ఎన్నికలు నిర్వహణకు 900 మంది పోలీస్ లతో పటిష్ట బందోబస్తు.**
**ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలలో 163 బి.ఎన్.ఎస్.ఎస్,144 సెక్షన్ అమలు...**




జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి10 (విజన్ ఆంధ్ర)జగిత్యాల జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ తెలిపారు.ఎన్నికల విధుల్లో భాగంగా పోలీస్ అధికారులు,సిబ్బందితో జిల్లా కేంద్రం లోని బిఎల్ఎన్ ఫంక్షన్ హాల్లో బ్రీఫింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఎన్నికల విధులకు సంబందించి పోలీసు అధికారులు, సిబ్బందికి ఎన్నికల ప్రాముఖ్యతను వివరిస్తూ,ఎన్నికల విధులు ఏవిధంగా పకడ్బందీగా నిర్వహించాలి అని, సిబ్బంది చేయవలసిన, చేయకూడాని విధుల గురించి జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా వివరించారు.ఈ సందర్భం గా ఎస్పి మాట్లాడుతూ. జగిత్యాల, రాయికల్, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల పరిధిలోని మొత్తం 136 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు, ఇందుకోసం 379 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల విధుల కోసం 900 మంది పోలీస్ సిబ్బంది నియమించబడినట్లు పేర్కొన్నారు.పోలింగ్ సామగ్రిని పటిష్ట ఎస్కార్ట్‌తో పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు 45 రూట్లలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.భద్రతా చర్యలలో భాగంగా నలుగురు డీఎస్పీలతో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, పదకొండు మంది సీఐలతో స్ట్రైకింగ్ ఫోర్స్ టీమ్స్, అలాగే ఎస్ఐల ఆధ్వర్యంలో పెట్రోలింగ్ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.ఎన్నికల సందర్భంగా పోలీసుల విధి విధానాలపై పోలీస్ అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. పౌరుల స్వేచ్ఛకు భంగం కలగకుండా, ఎలాంటి ప్రలోభాలకు తావు లేకుండా ప్రతి ఓటరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, మందుగుండు సామగ్రి, ఇంక్ బాటిళ్లు, వాటర్ బాటిళ్లు తీసుకువెళ్లడం నిషేధమని, పోలింగ్ బూత్‌లో సెల్ఫీలు దిగడంపై పూర్తిగా నిషేధం ఉంటుందని తెలిపారు. ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీలు రఘు చందర్, సి.ఐ లు కరుణాకర్,సుధాకర్, రవి, రామ్ నరసింహారెడ్డి,ఆర్.ఐ లు వేణు,ఎస్.ఐలు, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



జగిత్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి10 (విజన్ ఆంధ్ర)జగిత్యాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్,రిసెప్షన్ సెంటర్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్.మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు.మంగళవారం రోజున మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల పట్టణాలలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జగిత్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో చేపట్టిన ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.పోలింగ్ సిబ్బందికి కేటాయించిన బాధ్యతల పంపిణీ తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఎన్నికల నిర్వహణకు అవసరమైన లాజిస్టిక్స్, బ్యాలట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని, ఎన్నికల సిబ్బంది కి ఏర్పాటు చేసిన భోజనాలను స్వయంగా పరిశీలించారు. వంట, భోజనాల ప్రదేశంలో పరిశుభ్రత పాటించాలని, రుచికరమైన వంటలు ఎన్నికల సిబ్బందికి అందించాలని ఆదేశించారు.భోజనాల అనంతరం ఎన్నికల సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్ లకు ఎన్నికల సామాగ్రి తో ఏర్పాటు చేసిన బస్సుల్లో సమయానికి చేరుకోవాలని, అధికారులు ఏర్పాటు చేసిన చోటనే బస చేయాలని ఆదేశించారు.ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ రోజున ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది ఖచ్చితంగా సమయపాలన పాటించాలని తెలిపారు.ఎన్నికల నిర్వహణలో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.జిల్లాలో 5 మున్సిపాలిటీలైన జగిత్యాల, ధర్మపురి, రాయికల్, కోరుట్ల, మెట్ పెల్లి లలో మొత్తం 136 వార్డులుండగా, 2,31,627 మంది ఓటర్లు కలరు. ఇందుకోసం మొత్తం 379 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో 455 మంది పోలింగ్ అధికారులు, 455 మంది సహాయ అధికారులు, 1637 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చి విధులు కేటాయించామని తెలిపారు.అన్ని కేంద్రాల్లో వెబ్కాస్టింగ్ ఉంటుందని పోలింగ్ సరళిని కలెక్టరేట్ నుంచి నేరుగా పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.కలెక్టరేట్లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. 24 గంటలపాటుటోల్ ఫ్రీ 96662 34383 ఏర్పాటుచేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి, కోరుట్ల, జగిత్యాల మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్లు శ్రీనివాస్, జీవాకర్ రెడ్డి,మదన్ మోహన్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్ లు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి బుర్రి చైతన్య

**నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీకే సాధ్యం**
**మున్సిపాలిటీ నుండి కార్పోరేషన్ స్థాయికి తెచ్చిన చేసిన ఘనత మంత్రి కోమటిరెడ్డి.**
**కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి**



ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10,విజన్ ఆంధ్రనలగొండ మున్సిపల్ కార్పొరేషన్ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యపడుతుందని కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు.నల్లగొండలో మున్సిపాలిటీ నుండి కార్పొరేషన్ స్థాయికి తెచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కృషి ఎంతో ఉంది. మీరు పార్టీ అభ్యర్థులను గెలిపించండి, అభివృద్ధిని నాకు వదిలేయండి అంటూ మంత్రి చేస్తున్న ప్రచారంతో కాంగ్రెస్ పార్టీ విజయంపై మరింత నమ్మకాన్ని పెంచిందని కాంగ్రెస్ పార్టీ చెప్పారు.మంగళవారం ఆమె విజన్ ఆంధ్ర ప్రతినిధితో మాట్లాడారు. కార్పొరేషన్ తొలి మేయర్ పదవి కాంగ్రెస్ పార్టీ తరఫున తనకు రావడం గర్వంగా,అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు.టిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆమె పేర్కొన్నారు. నల్లగొండ కార్పొరేషన్ లోని 48 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిచి సీఎం రేవంత్ రెడ్డికి,మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి బహుమతిగా అందిస్తామని ఆమె ఎంతో నమ్మకంతో చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నలగొండ కార్పొరేషన్ ఒక మోడల్ గా నిలుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు.కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థిగా అవకాశం వస్తుందని నేను ఊహించలేదని నా భర్త బుర్రి శ్రీనివాసరెడ్డి, మా గాడ్ ఫాదర్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. నల్లగొండలో ప్రధాన సమస్యలను గుర్తించి, ప్రజలకు సేవ చేయడమే తమ ప్రధాన కర్తవ్యం అన్నారు.నల్లగొండ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ఇంటర్వ్యూలిరాజకీయ జీవితం:లి గృహిణిగా ఉండి, కాంగ్రెస్ పార్టీలో సభ్యురాలిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించాను.నా భర్త మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి,మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో మేయర్ అభ్యర్థిగా అభ్యర్థిగా ఎంపిక చేశారు.అభివృద్ధి ప్రణాళికలు:నలగొండ కార్పొరేషన్ ను సూపర్ స్మార్ట్ సిటీగా,తెలంగాణలోనే మోడల్ నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.ఎన్నికల వ్యూహాలు:నలగొండ కార్పొరేషన్ లో 48 డివిజన్లో గెలిచి చరిత్ర సృష్టించబోతున్నామని తెలిపారులక్ష్యం:నల్లగొండ కార్పొరేషన్ ను అభివృద్ధి చేయడం,ప్రజలకు సేవ చేయడంమేయర్ పీఠంపై అభిప్రాయం:కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థిగా అవకాశం వస్తుందని నేను ఊహించలేదు,నా భర్త సహకారంతో,మంత్రి చేపట్టిన అభివృద్ధి,సంక్షేమంతో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటామన్నారు.కార్పొరేషన్ ఫలితాలపై అంచనా:కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 48 డివిజన్లో గెలిచి చరిత్ర సృష్టించబోతున్నామని పేర్కొన్నారు.నల్లగొండ కార్పొరేషన్ లో ఉన్న ప్రధాన సమస్యలు:ప్రధానంగా ఇండ్ల సమస్య,సీసీ రోడ్లు, పారిశుద్ధ్యం,డ్రైనేజీ,అన్ని రకాల పెన్షన్లు అందించాలని ప్రజలు కోరారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం.మేయర్ గా గెలిస్తే 100 రోజుల్లో ఏం చేస్తారు:నల్గొండ కార్పొరేషన్ ను మంత్రి సహకారంతో అభివృద్ధి,సంక్షేమ పథకాలు అమలు చేస్తాం. ప్రజలకు మెరుగైన పాలన అందించి సేవ చేస్తాం.ప్రచారంలో ప్రజాస్పందన:ప్రచారంలో ప్రజల స్పందన చాలా బాగుంది.ప్రజలు తమ బిడ్డగా, సోదరిగా ఆదరించారు. వారి ఆత్మీయతకు నేను రుణపడి ఉంటాను.

# చెడు ప్రభావం అంశాలపై న్యాయ విజ్ఞానం సదస్సు




యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర): జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి, జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ, యాదాద్రి బార్ సోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మాదక ద్రవ్య నిషేధ చట్టాలు, చెడు ప్రభావం అంశాలపై న్యాయవిజ్ఞాన సదస్సును యాదగిరిగుట్టలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి మాధవి లత మాట్లాడుతూ మత్తుపదార్థాలకు బానిసలు అయితే తమ జీవితాలను శూన్యం చేసుకోవాల్సి వస్తుంది అని ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకూడదని వారి జీవితాన్ని అంధకారం చేసుకోరాదని మత్తుపదార్థాల నిషేధ చట్టం పగడ్బందీగా అమలు అవుతుందని, చట్టంలోని ప్రతి నేరం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుందని, సంఘంలో ఉండే ప్రతి ఒక్కరు మత్తు పానియాల నిషేధంలో బాధ్యతగా వ్యవహరించాలని తెలియజేశారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరిండెంట్ విష్ణుమూర్తి మాట్లాడుతూ తమ శాఖ జిల్లాలో మత్తుపదార్థాల నిషేధానికి తీవ్రమైన కృషి చేస్తుందని, అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నట్లు, మత్తు పదార్థాల వాడకం సంఘంలో చాప క్రింద నీరులాగ ఎక్కువ అవుతుందని, వాటి బారిన పడడానికి వ్యాపారులు అనేక రకాలుగా మభ్యపెడుతున్నారని, ఈ చట్టంలో ఎవరైనా నేరం చేసినట్లయితే వారికి బెయిల్ కూడా దొరకడం కష్టమని, తీవ్రమైన శిక్షలే కాకుండా, ఫైన్ కూడా అధిక మొత్తంలో ఉంటుందని, ఈ నేరానికి సంబంధించి వివిధ ఉదాహరణలతో విద్యార్థులకు విషధికరించారు. యాదాద్రి బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు శ్రీహరి మరియు పెంట రమేష్ మరియు మీడియేషన్ న్యాయవాది యం. రాజిరెడ్డి మాదక ద్రవ్య నిషేధం సంఘంలో అందరి బాధ్యతని విద్యార్థిని విద్యార్థులు అప్రమత్తంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని, చెడు అలవాట్లకు లోనైతే వారి భవిష్యత్తు అంధకారం చేసుకోవడమే కాకుండా వారి తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నెరవేర్చలేరని తెలిపారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బొమ్మ వెంకటేష్ మాట్లాడుతూ తమ వ్యవస్థ ద్వారా అర్హులైన వారందరికీ న్యాయ సహాయం అందజేస్తున్నట్లు ఎవరైనా బాధితులు ఉంటే వారు న్యాయ సేవా సంస్థను ఆశ్రయించవచ్చని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 15100 ద్వారా సంప్రదించి సరైన న్యాయ సహాయం పొందవచ్చు అని తెలియజేశారు. న్యాయ సహాయ న్యాయవాది సాయి శ్రీనివాస్ పి పి టి ద్వారా మాదకద్రవ్య నిషేధ చట్టం, శిక్షలు, వాటి అమలు అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థుల చదువు, క్రమశిక్షణపై విశేషంగా కృషి చేస్తున్నట్లు, విద్యార్థిని విద్యార్థులకు వారి సంస్కరణకు అనేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాదక ద్రవ్య నిషేధంపై ప్లెడ్జ్ ను అందరితో న్యాయమూర్తి చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు రాధాకృష్ణ, దీపిక, వేణుకుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ ఇన్చార్జి ఉపేందర్, లెక్చరర్లు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా సేవారత్న అవార్డుల ప్రధానం



హైదరాబాద్ ఫిబ్రవరి 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ. విశ్వనాథ్) : ప్రముఖ మానవ హక్కులు ప్రజారక్షణ సేవా సంస్థ హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ ( హెచ్ ఆర్ పి ఎస్ ) ప్రెసిడెంట్ కొంపల్లి సత్యనారాయణ గుప్తా బృందం ఆధ్వర్యంలో వివిధ రంగాలలో విశిష్ట ప్రతిభను కనబరుస్తూ సేవలు అందిస్తున్న సేవా మూర్తులను గుర్తించి వారికి సేవారత్న అవార్డుల ప్రదానం కార్యక్రమం రవీంద్రభారతిలో ఆదివారంనాడు కన్నుల పండుగగా జరిగింది. విశేష సేవలు అందిస్తున్న వారికి ప్రతిభారత్న, సేవారత్న అవార్డుల ప్రధానం కార్యక్రమం అతిథుల చేతులమీదుగా విశేష సేవారత్న పురస్కారాలను మాడంటి. వెంకటేశ్వరరావు, పి. లక్ష్మి అన్నపూర్ణ, అర్చన బక్వాడ్, పప్పుల జయ అందుకున్నారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ, ఈ అవార్డులు సమాజం పట్ల తమ సేవా భావాన్ని, బాధ్యతను మరింత పెంచాయని, ఈ సేవా రత్న అవార్డులు అందుకునందుకు తమకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

# ఒక్క క్షణం అజాగ్రత్త జీవితాంతం విషాదం

**- నిర్లక్ష్యాన్ని వీడండి నిబంధనలు పాటించండి: సైబరాబాద్ పోలీస్**

శేరిలింగంపల్లి. ఫిబ్రవరి 10 : (విజన్ ఆంధ్ర)ప్రతీ రోజు మీరు ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు... ఎవరో ఒకరు "జాగ్రత్తగా వెళ్లండి" అంటారు. ఆ మాటలో వారికి మీరు సురక్షితంగా ఇంటికి తిరిగి రావాలనే ఆతృత ఉంది. కానీ రోడ్డుపై ఒక చిన్న అజాగ్రత్త... ఆ ఎదురుచూపును శాశ్వత విషాదంగా మార్చేస్తుంది. రోడ్డు ప్రమాదం అనేది కేవలం దినపత్రికలోని ఒక హెడింగ్ కాదు. అది ఒక తల్లి కన్నీరు, ఒక తండ్రి మౌనం, ఒక చిన్నారి ఎదురు చూపురోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతీ వాహనదారుడు కచ్చితంగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని ట్రాఫిక్ డీసీపీ -× రంజన్ రతన్ కుమార్ తెలిపారు. అధిక వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ లేకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి కారణాల వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన హెచ్చరించారు. చిన్నపాటి అజాగ్రత్త కూడా ప్రాణనష్టానికి దారితీసే ప్రమాదం ఉందన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాంతకమన్నారు. తాగిన మత్తులో డ్రైవింగ్ చేయడం కారణంగా వాహనం నడిపే వారే కాకుండా ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో నెట్టిన వారమవుతామన్నారు. రాంగ్‌రూట్‌లో వెళ్లడం, ఓవర్‌టేక్ చేయడం, సిగ్నల్ దాటేయడం అనే చిన్న, ఒక్క తప్పు అజాగ్రత్త మీ సమయాన్ని ఆదా చేయవు... జీవితాన్ని కోల్పోయే ప్రమాదాన్ని పెంచుతాయి. గుర్తుంచుకోండి ప్రమాదం జరిగిన తర్వాత పశ్చాత్తాపం మాత్రమే మిగులుతుంది. "కొద్దిదూరమే కదా.. ఏమవుతుందిలే" అనే నిర్లక్ష్యం ఒక్కోసారి ప్రాణాంతకమవుతుందని, రోడ్డుపై నడిచేటప్పుడైనా, వాహనం నడిపేటప్పుడైనా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వెనుక కూర్చునే పిలియన్ రైడర్ కూడా తప్పనిసరిగా హెల్మెట్ ఉపయోగించాలన్నారు. హెవీ వెహికిల్స్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలి. కేవలం పోలీసులు ఫైన్లు వేస్తారని భయంతో పాటించాల్సినవి కావని ప్రాణాలను కాపాడే భద్రతా నియమాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పాదచారులు రోడ్డు దాటేటప్పుడు ఏమరుపాటుగా ఉండవద్దు. వేగ పరిమితిని మించకూడదని, మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, వాహన పత్రాలు లేకుండా ప్రయాణించడం కూడా నేరమని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్, రిజిస్ట్రేషన్, బీమా మరియు కాలుష్య నియంత్రణ పత్రాలు ఉంచుకోవాలన్నారు. లేన్ క్రమశిక్షణ పాటించడం ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గడమే కాకుండా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ప్రతి వాహనదారుడు క్రమశిక్షణతో ప్రయాణించడం ద్వారా తమతో పాటు ఇతరుల ప్రాణాలు కాపాడిన వారవుతారన్నారు. "రోడ్డుపై కొన్ని క్షణాల మీ అజాగ్రత్త.. మీ కుటుంబంతో పాటు మరొక కుటుంబాన్ని కూడా విషాదంలోకి నెడుతుంది," అన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై తనిఖీలు, చట్టపరమైన చర్యలు నిరంతరం కొనసాగుతాయని, ప్రతి వాహనదారుడు చిత్తశుద్ధితో నియమాలు పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు."ఒక్క క్షణం అజాగ్రత్త... మీ జీవితాన్ని ఛిన్నాభిన్నం చేస్తుంది,మీ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపగలదు. లిఆలోచించండి... జాగ్రత్తగా వాహనాలు నడపండి... ట్రాఫిక్ నిబంధనలు పాటించండి --- ఎందుకంటే ప్రాణం విలువైనది

# పోలింగ్‌కు సర్వం సిద్ధం

## 11న జరిగే మున్సిపల్ పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాలి



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర): మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో.. ఈ నెల 11 న జరిగే పోలింగ్ ప్రక్రియ ని సజావుగా, ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు అన్నారుమంగళవారం చౌటుప్పల్, పోచంపల్లి ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బంది కి ఎన్నికల సామాగ్రి పంపిణి నిమిత్తం మెటీరియల్ పంపిణి ప్రక్రియను , భోజనం,ఏర్పాట్ల ను పరిశీలించి తగుసూచనలు చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో సిబ్బందికి మౌలిక సదుపాయాలు కల్పించాలని, లైటింగ్, త్రాగునీరు, లంచ్, డిన్నర్ ఏర్పాట్లుబాగుండాలని, సిబ్బందిని, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు పోలింగ్ కేంద్రాలకు చేర్చుట గాను ఎస్కార్ట్ వాహనంతో వెళ్లాలని, బ్యాలెట్ బాక్స్ లు సరిగ్గా ఉ న్నాయా లేవో సరిచూసుకోని సిబ్బందికి ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు.పకడ్బందీగా పోలింగ్ జరగాలి, దానికి అనుగుణంగా జిల్లాలోని 6 మున్సిపాలిటీలో అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని అన్నారు.పోలింగ్ సిబ్బంది కూడా పోలింగ్ కేంద్రానికి సంబంధించి అన్ని సామగ్రిని ఇక్కడే పరిశీలించి జాగ్రతగా పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లాలి అన్నారు.రేపు ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియని ప్రారంభించాలి .ఈ రోజు రాత్రి పోలింగ్ సెంటర్ లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు.ఓటర్ లు కూడా ఉదయమే పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి, ఈ మున్సిపల్ ఎన్నికల్లో కూడా మన జిల్లాలో 100 శాతం ఓటింగ్ నమోదు చేయాలి అని అన్నారు.ప్రతీ పోలింగ్ స్టేషన్ లో జరుగుతున్న పోలింగ్ తీరు ను నిశితంగా పరిశీలించాలని.... ఏమైనా సమస్య లు గమనిస్తే.. వెంటనే తమ దృష్టి కి తీసుకు రావాలన్నారు..

ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ 2025--26 జిల్లా స్థాయి క్రీడలు ఇండోర్ స్టేడియంలో నిర్వహించబడను

### జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి ఎం.కృష్ణయ్య

గద్వాల ఫిబ్రవరి 10(విజన్ ఆంధ్ర)జిల్లాలో సీఎం కప్ 2025--26 జిల్లా స్థాయి క్రీడలు గద్వాలలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించబడనున్నట్లు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఎం.కృష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్,ఆదేశాల మేరకు,జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) నర్సింగ్ రావు పర్యవేక్షణలో గద్వాల ఇండోర్ స్టేడియంలో వివిధ క్రీడా పోటీలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. 2025--26 జిల్లా స్థాయి క్రీడలు జోగులాంబ గద్వాల జిల్లాలో ఫిబ్రవరి 12--13 మరియు 16--17 తేదీలలో నిర్వహించబడనున్నట్లు తెలిపారు. మండలాల నుండి జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులు తప్పనిసరిగా పాల్గొనేలా ఎంపీడీఓ , తహసీల్దార్లు ,ఎం.ఈ.ఓ లు,సీజీఎఫ్ సెక్రటరీలు,మండల క్రీడా కన్వీనర్లు,పీడీలు, పీ.ఈ.టీలు,కేజీబీవి /గురుకుల్ పి.ఈ.టీ లు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 9885479896, 9959344234, 9381890539 సంప్రదించాలన్నారు. క్రీడాకారులు, అధికారులు, సంబంధిత విభాగాలు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఉమామహేశ్వరంలో 22 ఏళ్లుగా అన్నదానం



వనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి :వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శ్రీశైలం ఉత్తర ద్వారంగా ప్రసిద్ధిగాంచిన ఉమామహేశ్వర స్వామి క్షేత్రంలో గత 22 ఏళ్లుగా ప్రస్తుత వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి శివరాత్రి పర్వదినాన్ని ప్రత్యేక నాలుగు రోజులుగా పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సతీమణి శారద రెడ్డి, నవనీత్ రెడ్డిలు ఉమామహేశ్వరం లోని శివుడికి పలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఈనెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం పాల్గొని మన్సూర్, లక్ష్మారెడ్డి, విజయసింహారెడ్డి వారి బృందం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా తూడి శారదా రెడ్డి మాట్లాడుతూ ఉమామహేశ్వర స్వామి ఎంతో మహిమగల స్వామి అని కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా స్వామిని కొలుస్తారని గత 22 ఏళ్లుగా ప్రతి శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు తో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేస్తున్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### ఫిబ్రవరి 11న జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో పోలింగ్

సంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 10 విజన్ ఆంధ్ర ప్రతినిది): జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో ఈ నెల 11న (బుధవారం) నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని స్థాయిల్లో ఏర్పాట్లు చేపట్టారు. ఈ ఎన్నికలు సంగారెడ్డి, సదాశివపేట, కోహిర్, జహీరాబాద్, నారాయణఖేడ్, జిన్నారం, ఆందోల్--జోగిపేట్, ఇస్నాపూర్, ఇంద్రేశం, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీలలో జరగనున్నాయి. జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో మొత్తం 256 వార్డులు ఉండగా, వాటికి గాను 541 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. మొత్తం 3,41,808 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొననున్నారు. వారిలోపురుషులు -- 1,71,151మహిళలు -- 1,70,638ఇతరులు -- 19 మున్సిపాలిటీ వారీగా ఓటర్ల వివరాలు ఆందోల్--జోగిపేట్ 20 వార్డులు, 32 పోలింగ్ కేంద్రాలు 16,450 మంది ఓటర్లు, గడ్డపోతారం : 18 వార్డులు 18 పోలింగ్ కేంద్రాలు 11,983 ఓటర్లు, గుమ్మడిదల : 22 వార్డులు 44 పోలింగ్ కేంద్రాలు 23,926 ఓటర్లు ఇంద్రేశం 18 వార్డులు 19 పోలింగ్ కేంద్రాలు 13,086 ఓటర్లు ఇస్నాపూర్ : 26 వార్డులు 60 పోలింగ్ కేంద్రాలు 35,912 ఓటర్లు, జిన్నారం 20 వార్డులు 22 పోలింగ్ కేంద్రాలు 12,473 ఓటర్లు, కోహిర్ : 16 వార్డులు 16 పోలింగ్ కేంద్రాలు 10,832 ఓటర్లు, నారాయణఖేడ్ 15 వార్డులు, 30 పోలింగ్ కేంద్రాలు 17,675 ఓటర్లుసదాశివపేట : 26 వార్డులు, 58 పోలింగ్ కేంద్రాలు 36,982 ఓటర్లుసంగారెడ్డి 38 వార్డులు, 121 పోలింగ్ కేంద్రాలు 83,668 ఓటర్లు, జహీరాబాద్ 37 వార్డులు 121 పోలింగ్ కేంద్రాలు 78,819 ఓటర్లు పోలింగ్ నిర్వహణ కోసం జిల్లాలో 103 మంది రిటర్నింగ్ అధికారులు,103 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 649 మంది ప్రిసైడింగ్ అధికారులు, 649 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు,1,948 మంది ఇతర పోలింగ్ అధికారులు, 73 మంది మైక్రో అబ్జర్వర్లు , 49 మంది జోనల్ ఆఫీసర్లను నియమించారు.ప్రశాంతంగా, సురక్షితంగా పోలింగ్ జరిగేలాశాంతిభద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక వసతులు కల్పించి, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

## డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య

సంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 10, ( విజన్ ఆంధ్ర ప్రతినిధి): జిల్లాలో ఈనెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను, స్ట్రాంగ్ రూమ్ లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్యసందర్శించారు. మంగళవారం కలెక్టర్ కోహిర్, సదాశివపేట లలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరును క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో పోలింగ్ సిబ్బందికి తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు,ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేసారు. పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీయడంతో పాటు హాజరు నివేదికను పరిశీలించారు. ఎన్నికల పోలింగ్ సామాగ్రిని, బ్యాలెట్ బాక్స్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పోలింగ్ అధికారులు పరిశీలించు కోవాలని పోలింగ్ బృందాలకు కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులకు ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆర్ఓలకు సూచించారు. అనంతరం ఆయా మున్సిపాలిటీలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను పరిశీలించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట రెవిన్యూ డివిజనల్ అధికారి దేవుజా, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, తదితరులు ఉన్నారు.

## పోలింగ్ ను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి

### జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్

గద్వాల ఫిబ్రవరి 10(విజన్ ఆంధ్ర)మున్సిపల్ ఎన్నికలను విజయవంతం చేసేందుకు అధికారులు, ఇతర సిబ్బంది పోలింగ్ ను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ తెలిపారు. గోనుపాడు గ్రామం వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో గద్వాల మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లోనీ 77 వార్డుల్లో 189 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ అధికారులకు సహకరించేందుకు రిటర్నింగ్, జోనల్ అధికారులు, మున్సిపల్, పోలీస్ యంత్రాంగం ఇతర సిబ్బంది కలిపి సుమారు 2000 మంది విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. పోలీస్ స్టేషన్ల లో, వెలుపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ నుంచి కూడా పోలింగ్ ప్రక్రియను మానిటరింగ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే పోలింగ్ అధికారులకు అవసరమైన శిక్షణ ఇవ్వడం జరిగిందని, ఏమైనా సమస్యలు వస్తే వెంటనే జిల్లా ఎన్నికల యంత్రాంగం దృష్టికి తీసుకురావాలన్నారు. సున్నితమైన, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ తరపున అవసరమైన బందోబస్తును నియమించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు చేస్తూ ఆయా విధులు నిర్వహిస్తున్న అధికారులు అప్రమత్తంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూట్లవారీగా గద్వాల మున్సిపాలిటీలోని 37 వార్డులకు సంబంధించి ఏర్పాటుచేసిన కౌంటర్లను కలెక్టర్ పరిశీలించారు. ప్రిసైడింగ్ అధికారులు తమకు ఇచ్చే పోలింగ్ సామాగ్రిని చెక్ లిస్ట్ లో సరిచూసుకోవాలని, ఏమైనా సామాగ్రి లేకుంటే వెంటనే రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకొస్తే ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయా పోలింగ్ స్టేషన్లకు వెళ్లాక ఇబ్బంది పడకుండా పోలింగ్ నిర్వహణకు అవసరమైన ప్రతి ఒక్క వస్తువును ప్రీసైడింగ్ అధికారులు తమ వద్ద ఉ




ంచుకోవాలన్నారు. స్పెషల్ కౌంటర్లో బ్యాలెట్ పేపర్స్ తో పాటు పోలింగ్ కు అవసరమైన వివిధ ఫారాలను, కవర్లను, ఇతర సామాగ్రిని పరిశీలించి తగు సూచనలు చేశారు. పోలింగ్ విధులు నిర్వర్తించే అధికారులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో రిపోర్టింగ్ చేశాక రూట్ వారీగా సంబంధిత పోలింగ్ స్టేషనులకు మెటీరియల్ తో వెళ్లేందుకు జోనల్ అధికారులు సహకరిస్తారన్నారు. ప్రీసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది సాయంత్రంలోగా తమకు కేటాయించిన ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని బుధవారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ అనంతరం రిసెప్షన్ కేంద్రానికి వచ్చే ప్రిసైడింగ్ అధికారులు బ్యాలెట్ బాక్స్ లను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచే వరకు రిటర్నింగ్ అధికారులకు సహకరించాలన్నారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలలోనే ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమును జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అలాగే కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాటుచేసిన నాలుగు హాల్స్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిఎస్పి మొగిలయ్య, మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, తహసిల్దార్ మల్లికార్జున్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గద్వాల ఎమ్మెల్యే పై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కి ఫిర్యాదు చేసిన

### బిఅర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధుల బృందం

గద్వాల ఫిబ్రవరి 10(విజన్ ఆంధ్ర)గద్వాల నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (ఎంసిసి), ఉల్లంఘించిన ఘటనపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కి ఫిర్యాదు బిఅర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ కురువ విజయ్ కుమార్, పార్టీ ప్రతినిధి బృందం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసిసి), 48 గంటల నిశ్శబ్ద కాలం నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడం, ప్రజాస్వామ్య సూత్రాలను దెబ్బతీయడంపై, తప్పనిసరి 48 గంటల నిశ్శబ్ద కాలం నిబంధనలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘిస్తున్న విషయాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కి ఫిర్యాదు చేశామని అన్నారు.ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం, ఓటర్లు ఎటువంటి ఒత్తిడి లేదా ప్రభావం లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి వీలుగా పోలింగ్‌కు 48 గంటల ముందే అన్ని రకాల ప్రచారాలు నిలిపివేయాలని అన్నారు.



అయితే, ఎమ్మెల్యే మంగళవారం (10.02.2026) ఉదయం నుండి ఈ క్రింది ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు.గద్వాల పట్టణంలోని వార్డు నెం. 17తో సహా పలు వార్డుల్లో పర్యటించడం.గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని భీమ్ నగర్, బాలాజీ అపార్ట్‌మెంట్స్ వంటి నివాస ప్రాంతాలను సందర్శించడం.ఉదయం 11:30 గంటల సమయంలో ఓటర్లతో సమావేశాలు నిర్వహించడం.నిశ్శబ్ద కాలంలో ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా రాజకీయ ప్రచారం నిర్వహించడం.ఎన్నికల ఓటమి భయంతో, అధికార పార్టీ నాయకులు రాజకీయ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నం చేస్తున్నారని కోవాలని తెలిపారు.ఎమ్మెల్యే చేసిన నిబంధనల ఉల్లంఘనలను తక్షణమే పరిగణనలోకి తీసుకోవాలి.వీడియో ఫుటేజ్, సాక్ష్యాల ఆధారంగా తక్షణమే విచారణ జరిపించాలని కోరామని అన్నారు.ఎమ్మెల్యే, వారి ఏజెంట్లు చేస్తున్న చట్టవిరుద్ధ కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని, సంబంధిత ఎమ్మెల్యేపై కఠినమైన శిక్షాత్మక చర్యలు తీసుకోవాలని,నిబంధనల ఉల్లంఘన దృష్ట్యా ఎమ్మెల్యేను ఎన్నికల కార్యకలాపాల నుండి అనర్హులుగా ప్రకటించే అంశాన్ని పరిశీలించాలని విన్నవించామని తెలిపారు.ఎన్నికల అధికారులు నిశ్శబ్ద కాలాన్ని ఖచ్చితంగా అమలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడటం కోసం ఈ ఫిర్యాదును సమర్పిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఅర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులుడాక్టర్ కురువ విజయ్ కుమార్,బొమ్మెర రామ్మూర్తి,సురివి యాదయ్య గౌడ్, పార్టీ లీగల్ సెల్ నాయకులుసదానంద్, తదితరులు కలిసి పిర్యాదు చేశారు.

## భారీగా పెరిగిన విమాన టిక్కెట్ ధరలు

కొలంబో, ఫిబ్రవరి 10: కొలంబోలో భారత్, పాకిస్థాన్ టీ20 ప్రపంచ కప్ మ్యాచ్ నేపథ్యంలో ముంబై నుంచి కొలంబోకి రౌండ్ ట్రిప్ విమాన టిక్కెట్ ధరలు భారీగా పెరిగాయి. నిమిషాల వ్యవధిలో టిక్కెట్ ధరలు సుమారు రూ.10,000 మేర పెరిగాయి. టీ20 ప్రపంచ కప్‌లో కొలంబో వేదికగా భారత్‌తో జరగనున్న మ్యాచ్‌కు తొలుత పాకిస్థాన్ ససేమిరా అన్నది.తాజాగా యూటర్న్ తీసుకుంది. దీనితో ముంబై–కొలంబో–ముంబై రౌండ్ టిక్కెట్ ధరలు అమాంతం పెరిగి రూ.60,000 వరకు చేరుకున్నాయి. భారత్‌లోని ఇతర నగరాల నుంచి కూడా కొలంబోకు టిక్కెట్ ధరలు పెరిగాయి.భారత్‌తో తాము మ్యాచ్ ఆడబోమని తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు పాకిస్థాన్ సోమవారం ప్రకటించింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ), బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ), శ్రీలంక క్రికెట్ బోర్డు, అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మధ్య గత కొన్నిరోజులుగా చర్చలు జరుగుతున్నాయి. భారత్‌తో మ్యాచ్ బహిష్కరణపై పునరాలోచన చేయాలని శ్రీలంక, ఎమిరేట్స్ బోర్డులు పీసీబీని కోరాయి. చర్చలు, మిత్రదేశాల విజ్ఞప్తుల నేపథ్యంలో భారత్‌తో మ్యాచ్ ఆడాలని నిర్ణయం తీసుకున్నట్లు పాకిస్థాన్ తెలిపింది.భారత్‌తో మ్యాచ్ ఆడతామని పాకిస్థాన్ ప్రకటించడంతో కొలంబోకు ప్రయాణ, వసతి బుకింగ్‌ల హడావుడి పెరిగింది. దాయాదుల మధ్య మ్యాచ్‌ను తిలకించేందుకు అభిమానులు టిక్కెట్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ రెండు దేశాల మధ్య మ్యాచ్ నేపథ్యంలో వేలాదిమంది శ్రీలంకకు వస్తారని భావిస్తున్నారు.

## ప్రశాంత ఎన్నికల నిర్వాహనే లక్ష్యంగా 11 వందల మంది సిబ్బందితో ప్రత్యేక బందోబస్త్ ఏర్పాట్లు

### ఎన్నికల ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

### కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి జిల్లా, పిబ్రవరి 10 ( విజన్ ఆంధ్ర ప్రతినిధి): ఈ నెల 11వ తేదీన సంగారెడ్డి జిల్లాలోని 8- మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్నాయని, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట భద్రత చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛయుత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అదనపు.ఎస్పీ, డిస్పీల ఆధ్వర్యంలో ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు అప్రమత్తంగా పని చేస్తుయన్నారు. జిల్లా ప్రజలు ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని, ఆయా మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రవర్తన నియమావళి కఠినంగా అమలు చేయడం జరుగుతుంది అన్నారు. 8 మున్సిపాలిటీలలో 199–వార్డులకు గానూ 153–కేంద్రాలు, 453–పోలింగ్ స్టేషన్స్ లలో ఎన్నికలు జరగనున్నాయని అన్నారు. ఇందులో 59–సమస్యాత్మక పోలింగ్ స్టేషన్స్ గుర్తించడం జరిగిందన్నారు. పోలింగ్ రోజు ఎన్నికల సరళి కై జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎలక్షన్ సెల్ ద్వారా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. బందోబస్తు నిర్వహణ మొదలుకుని ఎన్నికల సామాగ్రికి, ఎన్నికల సిబ్బందికి భద్రత కల్పించే వరకు ప్రతి అంశాన్ని ప్రణాళికబద్ధంగా పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. అలాగే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించడం జరిగిందని ఈ సీసీ కెమెరాలను జిల్లా పోలీస్ కార్యాలయం నుండి నిత్యం పర్యవేక్షణ చేయడం జరుగుతుంది. ఎన్నికల ప్రక్రియ పూర్తి సిసి కెమెరాల నిఘాలో ఉన్నదన్నారు. 9వ తేది సోమవారం సా.5 గంటలకు ఎన్నికల ప్రచార సమయం ముగిస్తుంది ఎన్నికల ప్రచార సమయం ముగిశాక అభ్యర్థులు ఎవరు కూడా ప్రచారం నిర్వహించకూడదని, నిబంధనలు ఉల్లంఘించి ప్రచారం నిర్వహిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కేసులు నమోదైతే అభ్యర్థిత్వం కోల్పోతారని తెలిపారు. సోమవారం సా.5 గంటల నుండి ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు సైలెన్స్ డే గా పరిగణించడం జరుగుతుందని ఈ సమయంలో ఓటర్లు కాని వారు అనగా స్థానికేతరులు కాలనీలు వార్డులో సంచరించరాదని హెచ్చరించారు. ఓటర్ల మనసు గెలిచి ఎన్నికల బరిలో గెలవాలన్నారు. అంతేకానీ ఉచితాలు, బహుమతులు, డబ్బు మద్యం లాంటి వాటితో ఓటర్లను ప్రలోభాలకు గురిచెయొద్దని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడినా, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి, 123 కేసులు నమోదు చేసి, 208- మందిని సత్ప్రవర్తన కోరుతూ ముందస్తుగా బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎన్నికలను ప్రభావితం చేసే మద్యం అక్రమ రావాణాపై 30 కేసుల్లో రూ.1.57 లక్షల విలువైన 249 లీటర్ల మద్యం సీజ్ చేశాం అన్నారు.

## రేడిగణాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



చేవెళ్ల,ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర):చేవెళ్ల మండల పరిధి రేడిగణాపూర్ గ్రామంలోని వడ్డెర బస్తీలో హెచ్ఎండీఏ నిధులు రూ.10 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు, పంచాయత నిధులతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ తిప్పని మాధవిరాంరెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తిప్పని మాధవిరాంరెడ్డి మాట్లాడుతూ... దశలవారీగా గ్రామాన్ని అభివృద్ధి చూస్తూ ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేశ్వరిరాములు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎన్నికల సామాగ్రి అన్ని పోలింగ్ కేంద్రాలకు అందజేశాం జిల్లా కలెక్టర్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి10 ఫిబ్రవరి (విజన్ ఆంధ్ర)2 వ సాధారణ మున్సిపల్ ఎన్నికలు – 2026 ప్రక్రియలో భాగంగా మంగళవారం దుబ్బాక మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి లచ్చపేట లోని తెలంగాణ మెడల్ స్కూల్ మరియు జూనియర్ కళాశాల లో పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి మరియు జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అయేషా మాస్రత్ ఖానం తో కలిసి క్షేత్రస్థాయిలోపరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ...పోలింగ్ సిబ్బంది మీకు అందజేసిన పోలింగ్ సామాగ్రిని అన్ని చెక్ చేసుకోవాలని బ్యాలెట్ పేపర్ కౌంట్ చేసుకోవాలని తెలిపారు. అలాగే బ్యాలెట్ బాక్స్ ఉపయోగించే విధానం తో పాటు లాక్ వేయడం, అన్ లాక్ ప్రక్రియ గూర్చి ఎలాంటి సమస్యలు ఉన్నపరిష్కరించుకోవాలని సూచించారు.మీ రూట్ లో పోలింగ్ స్టేషన్ కి వెళ్ళక ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం పోలింగ్ ప్రక్రియకు ఫర్నిచర్,లైటింగ్, బూత్ ఏర్పాటు పోలింగ్ సరళి సహవుగ జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ ఈ రోజు రాత్రి భోజనం, రేపు ఉ దయంటిఫిన్,మ ధ్యాహ్నంభోజనంసాయంత్రం టీ,స్నాక్స్లోలిం గ్సిబ్బందికిఅందించాల నిఅధికారులనుఆదేశించారు.రేపు ఉదయం మాక్ పోల్ పూర్తి చేసుకుని 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ మొదలు పెట్టాలని తెలిపారు. మిగిలిన ఓటర్ స్లిప్ లు బిఎల్ఓ లు పోలింగ్ స్టేషన్ కి 100 మీటర్ల బయట పంపిణీ చెయ్యాలని లోపలికి బిఎల్ఓల నుఅనుమతించకూడదని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్ లో ఎలాంటి సమస్య ఎదురైనామీకుఅ ందజేయబడినకరదీ పికనుచూసిపరిష్కరించుకోవాలని తెలిపారు అనంతరం మెడల్ స్కూల్ లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్ మరియు స్ట్రాంగ్ రూమ్ ను పరిశీలించారు. ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా ఏర్పాట్లు చెయ్యాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ ను ఆదేశించారు, జిల్లా కలెక్టర్ వెంట ఎంపిడిఓ భాస్కర శర్మ, తహసిల్దార్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు

# పరకాలలో పోలింగ్ కు సర్వం సిద్ధం

## హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్

## పరకాలలో పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించిన కలెక్టర్

హనుమకొండ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 ( విజన్ ఆంధ్ర ): పురపాలక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలోని పరకాల పురపాలక సంఘంలోని 22 వార్డులకు బుధవారం పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. మంగళవారం పరకాల లోని గణపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ మెటీరియల్ పంపిణీ కోసం డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ మెటీరియల్ తీసుకొని సరి చూసుకుంటున్న ఎన్నికల సిబ్బందితో కలెక్టర్ మాట్లాడారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి ఎంతమంది పిఓలు, ఏపీవోలు ఓపివోలు, మైక్రో అబ్జర్వర్లు హాజరు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్ రూమును పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపునకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ సంబంధించిన ఏర్పాట్లను గురించి జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, పరకాల ఆర్డిఓ డాక్టర్ కన్నం నారాయణ, పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ప్రొజెక్టర్ స్క్రీన్ పెట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పరకాల మున్సిపాలిటీలోని 22 వార్డు స్థానాలకు 44 పోలింగ్ కేంద్రాలలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. పోలింగ్ సామగ్రితో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పరకాల మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది బస్సులలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా పరకాల తహసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో రవీందర్, టిపిఓ సుష్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


# డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి




మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో ఫిబ్రవరి 10 విజన్ ఆంధ్ర మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో,భూత్పూర్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,దేవరకద్ర లో వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లను మంగళ వారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర సందర్శించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే ఆర్వో, స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తేవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు అందుబాటులో ఉండాలని, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని అన్నారు. అనవసర తప్పిదాలకు తావిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎంతో అప్రమత్తతో ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,ఆర్.డి.ఓ.నవీన్,మున్సిపల్ కమిషనర్ లు పాల్గొన్నారు.

# బ్యాలెట్ బాక్సుల పంపిణీ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

## ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర) :కార్పొరేషన్,ఇల్లందు,అశ్వారావుపేట మున్సిపాలిటీలకు బుధవారం జరగనున్న పోలింగ్ నేపథ్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.ఇందులో భాగంగా పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల నందు ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్సుల పంపిణీ కేంద్రాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు.అక్కడ విధులలో ఉన్న అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ కేంద్రాల వద్ద 1200 మందితో భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.పోలింగ్ కేంద్రాల పరిసరాలలో నిరంతర నిఘా కొరకు ప్రత్యేక బృందాలను నియమించడం జరిగిందన్నారు.ఓట్ల లెక్కింపు కేంద్రమైన పాల్వంచ అనుబోస్ కళాశాల పరిసర ప్రాంతాలను డాగ్స్ స్క్వాడ్ బాంబుస్క్వాడ్ తో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని అన్నారు.ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

# కన్నుల పండుగగా సాగిన "కౌముది అకాడమీ" 27వ వార్షికోత్సవ నాట్య వైభవం



హైదరాబాద్ ఫిబ్రవరి 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ. విశ్వనాథ్) : ప్రముఖ భరతనాట్యం నాట్య శిక్షణ సంస్థ "కౌముది అకాడమీ" 27వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు, ప్రిన్సిపల్, ప్రఖ్యాత నాట్య గురువు రాజ్యలక్ష్మి నేతృత్వంలో వార్షికోత్సవ వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. సికింద్రాబాద్ లోని హరిహర కళాభవన్ లో శుక్రవారంనాడు ఆనందోత్సాహాల మధ్య వైభవంగా నిర్వహించిన ఈ 27వ వార్షికోత్సవ వేడుకలలో అకాడమీలో నృత్యాన్ని అభ్యసిస్తున్న సుమారు 80 కు పైగా విద్యార్థులు పలు నృత్యాంశాలపై ఎంతో శృతి పక్వంగా, లయబద్ధంగా చక్కటి హావభావాలతో, అభినయంతో, అద్భుతంగా, నేత్రపర్వంగా నృత్యాంశాలను ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంశలను అందుకున్నారు.కౌముది అకాడమీ కి అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందచేస్తున్న పద్మ, ఆర్. శాస్త్రి కనువిందు చేసిన ఈ నృత్య వైభవం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై పిల్లల నాట్య ప్రదర్శనలను వీక్షించి చిన్నారులను అభినందించి వారికి ప్రశంశా పత్రాలను, మొమెంటోలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, కౌముది అకాడమీ డైరెక్టర్ ఎం. వి. రమణ మూర్తి ప్రోత్సాహంతో తాను నగరంలోని కమలనగర్ లో కేవలం 10 మంది విద్యార్థులతో 1996 లో కౌముది అకాడమీలో భరతనాట్యం శిక్షణను ప్రారంభించిన్నట్లు తెలిపారు. ఇప్పటికి 2000 మందికి పైగా విద్యార్థునులు శిక్షణ తన వద్ద పొందారని తెలియచేయడాని సంతోషిస్తున్నానన్నారు. ఇప్పటివరకు సుమారుగా 1500 కి పైగా ప్రోగ్రాంలు చేశామని, సంగీత నాటక అకాడమీ గుర్తింపు తమ అకాడమీకి లభించిందని తెలియజేశారు. ప్రాచీనమైన ఈ కళని భావి తరాలకు అందచేయడం కౌముది అకాడమీ ముఖ్యోద్దేశం అని, ఈ కళ తేజస్సుని, ఆరోగ్యాన్ని ఆత్మస్థైర్యాన్ని, మానసిక విశ్రాంతిని, ఆనందాన్ని ఇవ్వగలదనే ఆకాంక్షతో కౌముది అకాడమీ ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ సంవత్సరం తిరుమల బ్రహ్మోత్సవాలలో స్వామి వారి రథం ముందు మన అకాడమీ విద్యార్థునులకు నర్తించే మహదవకాశం కలిగిందని తెలిపారు. అలాగే, గణేష్ చతుర్థి, దసరనవరాత్రి సందర్భంగా ప్రదర్శనలిచ్చారని తెలుపుతూ, భోగీ పండుగ రోజు శ్రీ రంగనాధ స్వామి ఆలయం లో స్వామిసన్నిధి లో గోదా కళ్యాణం నృత్యం ప్రదర్శించారు అకాడమీ విద్యార్థునులు అన్నారు. అలాగే తమ విద్యార్థునులు ఎంతోమంది తమ స్కూల్లో ఇంకా ఎన్నో ప్రదేశాలలో ప్రదర్శనలిచ్చి అందరి ప్రశంశలను, అభినందనలను పొందుతున్నారని రాజ్యలక్ష్మి తెలియజేశారు.

# మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో వివేక్ వెంకటస్వామికి ఓటమి భయం పట్టుకుంది

## ఎన్నికల్లో పోలీసుల అత్యుత్సాహం పనికిరాదు

## బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్



మంచిర్యాల ప్రతినిధి ఫిబ్రవరి 10,(విజన్ ఆంధ్ర) జిల్లాలో ని బెల్లంపల్లి జాతనపల్లి చెన్నూర్ లక్ష్మీపేట మున్సిపాలిటీ తో పాటు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో ఎన్నికల అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారులను భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ తెలిపారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలోని టిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో చెన్నూర్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటమి భయంతోనే అల్లర్లు, అరాచకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కేవలం టిఆర్ఎస్ అభ్యర్థుల ఇళ్లలో పోలీసులు సోదాలు నిర్వహించడం భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏది లేదని అన్నారు.క్యాతనపల్లి మున్సిపాలిటీలో టిఆర్ఎస్ అభ్యర్థులు, కార్యకర్తలు గాని ఎక్కడ ఇద్దరు కంటే ఎక్కువ ఉంటే పోలీసులు తీసుకెళ్లి ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని మండిపడ్డారు. జిల్లాలో పోలీసులు ఎన్నికల అధికారులు పక్షపాత ధోరణి అవలంబించడం సరైనది కాదని పేర్కొన్నారు. తాము పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో అధికార దుర్వినియోగానికి పాల్పడలేదని తెలిపారు. ఎన్నికల ప్రచారం ముగిసినప్పటికీ మంత్రి వివేక్ తన సొంత కారులో అభ్యర్థులకు తలో పదిహేను లక్షల రూపాయలు తీసుకొచ్చి అందజేయడం ఎన్నికల నియమాలని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. మంత్రి వివేక్ కేతనపల్లి, చెన్నూర్ మున్సిపాలిటీలలో ఓటమి భయంతోనే తిరుగుతున్నారని అన్నారు. టిఆర్ఎస్ పాలనలో చేసినటువంటి అభివృద్ధిపై కరపత్రాలు విడుదల తీశామని, మంత్రి వివేక్ ఈ రెండున్నర ఏళ్లలో ఏ మేరకు అభివృద్ధి చేశారో ఎందుకు కరపత్రాలు తీయడం లేదని ప్రశ్నించారు. నేడు జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అల్లర్లు, అవంతరాలు గాని అభ్యర్థులను ఇబ్బందులకు గురి చేయడం గానీ చేసినట్లయితే దానికి పూర్తి బాధ్యత పోలీసులు, ఎన్నికల అధికారులదేనని సూచించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు మాట్లాడుతూ 53వ డివిజన్లో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఇంట్లో పోలీసును అత్యుత్సాహం చూయిస్తూ సోదరులు నిర్వహించడం దేనికి సంకేతం అని అన్నారు. అభ్యర్థి ఓటర్ స్లిప్పులు మాత్రమే పంచడానికి సిద్ధం చేస్తున్న తరుణంలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తులు తప్పుడు సమాచారం ఇవ్వడంతో పోలీసులు భయభ్రాంతులకు గురి చేసే విధంగా వ్యవహరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇక్కడ స్థానిక ఎమ్మెల్యే చెప్పిందే విధంగా పోలీసులు, అధికారులు వివరించడం సబబు కాదన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు డిపాజిట్లు గల్లంతయితాయని పేర్కొన్నారు. గతంలో దివాకర్ రావు పాలన ప్రస్తుతం ప్రేమ్సాగర్ రావు పాలన చూసి ఓటర్లు మంచి చేసే వారికి ఓటేయాలని కోరారు. సమావేశంలో టిఆర్ఎస్ నాయకులు గోగుల రవీందర్ రెడ్డి, పల్లె భూమేష్, శరత్, తదితరులు పాల్గొన్నారు.

# దయాకర్ రెడ్డిపై ఆరోపణలు అవాస్తవం

## బాధితురాలు మమత చైతన్య నగర్ గ్రామ సర్పంచ్ వెల్లడి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 ( విజన్ ఆంధ్ర ) : బీఆర్ఎస్ నాయకుడు దయాకర్ రెడ్డిపై వచ్చిన ఆరోపణల్లో ఎటువంటి నిజం లేదని, తమను ఎవరూ నిర్బంధించలేదని ప్రమాదంలో గాయపడిన మమత ఆమె కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. బాధితులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి.మంగళవారం వారు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. తాము ఎప్పటిలాగే ముబారక్ పూర్ గ్రామంలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు.నిర్బంధం అనేది అబద్ధంతమను (ఎల్లప్ప మమత గోపి) రహస్య ప్రదేశంలో బంధించారనే వార్తలను మమత తీవ్రంగా ఖండించారు. మమ్మల్ని ఎవరూ బంధించలేదు. చైతన్య నగర్ వెళ్తే అక్కడి వారు తమపై దాడి చేస్తారనే భయంతోనే మేము వెళ్లలేదు తప్ప, దయాకర్ రెడ్డి మమ్మల్ని బంధిచలేదు. అసలు మేము దయాకర్ రెడ్డి వద్ద పని చేయడం లేదు, వేరే వారి వద్ద కూలీ పనులకు వెళ్తున్నాం అని ఆమె వివరించారు.లిగంగమ్మ ఆరోపణలపై క్లారిటీగంగమ్మ చేసిన ఆరోపణల గురించి స్పందిస్తూ.. గంగమ్మ భర్త ఎల్లప్ప కూడా ప్రస్తుతం తమతోనే ఉన్నారని, వారంతా క్షేమంగానే ఉన్నారని తెలిపారు. గంగమ్మ తన భర్తతో గొడవపడి గ్రామానికి వెళ్లి, వ్యక్తిగత కారణాలతో ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేసి ఉండవచ్చని వారు అభిప్రాయపడ్డారుసర్పంచ్ వివరణలిచైతన్య నగర్ గ్రామ సర్పంచ్ కూడా ఈ విషయంపై స్పందించారు. నిర్బంధంలో ఉన్నారన్న సమాచారంతో తాను స్వయంగా వచ్చి పరిశీలించానని, కానీ ఇక్కడ ఎవరినీ ఎవరూ బంధించలేదని ఆయన స్పష్టం చేశారు. కార్మికులు తమ ఇష్టప్రకారమే ఉంటూ, రోజువారీ పనులు చేసుకుంటున్నారని, అనవసరంగా ఈ విషయాన్ని వివాదం చేయవద్దని కోరారు.రాజకీయ కక్షలతోనే దయాకర్ రెడ్డిపై ఇలాంటి అట్రాసిటీ కేసు నమోదు చేయాలనడం సబ్బు కాదన్నారు. ఆమె చేసిన ఆరోపణలు అవాస్తవమని తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన సాధారణ పరిశీలకురాలు కాత్యాయని దేవి



మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో ఫిబ్రవరి 10 విజన్ ఆంధ్ర జిల్లాలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సాధారణ ఎన్నికల పరిశీలకురాలు శ్రీమతి కాత్యాయని దేవి ఐ.ఏ.ఎస్. మంగళవారం పరిశీలించారు ఈ సందర్భంగా భూత్పూర్, దేవరకద్ర, మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను, అలాగే మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ను ఆమె సందర్శించారు. మొదటగా భూత్పూర్ మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించి, పోలింగ్ అధికారులకు పోలింగ్ సామాగ్రి పంపిణీ ప్రక్రియను సమీక్షించారు. పోలింగ్ సామాగ్రి చెక్ లిస్ట్ ప్రకారం పంపిణీని చేయాలని, అధికారులకు సూచించారు. పోలింగ్ నిర్వహణ సందర్భంగా ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని, విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.అనంతరం దేవరకద్ర మున్సిపాలిటీలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి, పోలింగ్ సామాగ్రి పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.తదుపరి మహబూబ్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించి, ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని క్రమబద్ధంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు పూర్తి సమన్వయంతో పని చేసి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని శ్రీమతి కాత్యాయని దేవి ఐ.ఏ.ఎస్. స్పష్టం చేశారు.

# జమ్మికుంట డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



మున్సిపల్ సాధారణ ఎన్నికలు-2026లో భాగంగా కరీంనగర్ జిల్లాలో జమ్మికుంట మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సందర్శించారు.డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడి ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. పిఓలు, ఏపీవోలు, ఆర్వోలు, మైక్రో అబ్జర్వర్లకు తగు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు అనుసరించి పకడ్బందీగా పోలింగ్ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. సందేహాలు ఉంటే ఉన్నతాధికారులతో నివృత్తి చేసుకోవాలని అన్నారు. అనంతరం కౌంటింగ్ ప్రక్రియ కోసం ఇక్కడ చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ఎన్నికల పరిశీలకులు జితేందర్ రెడ్డి, ఆడిట్ పరిశీలకులు ఎం మనోహర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్ రద్దు చేయాలి


## ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు



మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో ఫిబ్రవరి 10 విజన్ ఆంధ్ర లేబర్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసిస్తూ తలపెట్టిన సమ్మెను ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. మధ్యతరగతి ఉద్యోగుల రౌండ్ టేబుల్ సమావేశంమంగళవారం శ్రేయ అపార్ట్మెంట్లో మధ్యతరగతి ఉద్యోగుల రౌండ్ టేబుల్ సమావేశం ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి. తిరుమలరెడ్డి అధ్యక్షతన జరిగింది. దీనికి ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ వి. రాజేశ్వర్ ,తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కలమంద రామదాసు, తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎన్. కిష్టయ్య ,తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి. విజయవర్ధన్ రాజు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవికుమార్, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీకృష్ణయ్య, సిఐటియు సీనియర్ నాయకులు కిళ్ళే గోపాల్ ,మునిసిపల్ యూనియన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కమరలి ,సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, తెలంగాణ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రమాదకరమైన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలని, ఉపాధి కూలీల కు వరమైన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యపరిచే విబిజీ రాంజీ చట్టాన్ని ఉపసంహరించాలని, ఇన్సూరెన్స్ రంగశీ లో విదేశీ పెట్టుబడులను 100% ఆహ్వానించడం నిలిపివేయాలని, రైతాంగానికి వ్యతిరేకమైన మోటార్లకు మీటర్లు పెట్టే విద్యుత్తు చట్ట సవరణను వెనక్కి తీసుకోవాలని ,విదేశీ బహుళ జాతి కంపెనీలకు లాభాలు చేకూర్చే, రైతులను దివాలా తీసే రైతులను దివాలా తీసే రైతు విత్తన సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ,బ్యాంకులను కుదించే ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని ,కార్మిక , ఉద్యోగ ,రైతు,ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ శ్రీయ అపార్ట్మెంట్లో మధ్యతరగతి ఉద్యోగుల రౌండ్ టేబుల్ సమావేశం పలు తీర్మానాలు చేసింది , 12వ తేదీ ఉదయం 10 గంటలకు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి మహా ప్రదర్శన జరుగుతుందని కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు ప్రజాతంత్ర వాదులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఇందులో కర్ణాకర్ గౌడ్, శ్రీనివాసులు ,ప్రశాంత్, సత్యనారాయణ, శేఖర్ ,తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఫిబ్రవరి 20 వరకు సీసీఐ పత్తి కొనుగోళ్లు

## జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర )భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పత్తి రైతులందరూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025--26 సీజన్‌కు సంబంధించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా జిల్లాలో పత్తి కొనుగోళ్లు కొనసాగుతున్నట్లు తెలిపారు.జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ఈ నెల 20-02-2026 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల రైతులు తమ పత్తిని సమీపంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవాలని కోరారు.సీసీఐ ద్వారా ఇప్పటికే కొనుగోలు చేసిన పత్తికి సంబంధించి రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమ కావడంలో కొంత ఆలస్యం జరిగిన విషయం తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ చెల్లింపులు త్వరితగతిన రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు.తేదీ 21-02-2026 నుండి జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళు నిలిపివేయబడతాయని తెలిపారు. కావున మిగిలిన కాలవ్యవధిని రైతులు సద్వినియోగం చేసుకొని తమ పత్తిని ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు.

## విద్యాభివృద్ధికి చేయూతనిస్తాం

### క్ష్మీపల్లి ఐ ఓ బి మేనేజర్ అబ్దుల్ రహీం

### విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ




మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో ఫిబ్రవరి 10 విజన్ ఆంధ్ర ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యా పరంగా తగిన చేయూతనిస్తామని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ( ఐ ఓ బి) లక్ష్మీ పల్లి శాఖ మేనేజర్ అబ్దుల్ రహీం అన్నారు. ఐ ఓ బి బ్యాంక్ 90 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మంగళవారం దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి లోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాల ఇంచార్జ్ హెచ్ యం లయన్ అశ్విని చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఐ ఓ బి లక్ష్మీ పల్లి శాఖ మేనేజర్ అబ్దుల్ రహీం, అసిస్టెంట్ మేనేజర్ శివశంకర్, క్యాషియర్ గోవర్ధన్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐ ఓ బి మేనేజర్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, ఏకాగ్రత , పట్టుదలతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఐ ఓ బి బ్యాంక్ స్థాపించి 90 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా లక్ష్మీపల్లి లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 200 మంది విద్యార్థులకు వారి స్థాయికి అనుగుణంగా కంపాస్ బాక్స్ లు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యా సామాగ్రిని ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. ఐ ఓ బి బ్యాంక్ సేవలను విస్తరించేందుకు విద్యార్థులకు బ్యాంక్ ఖాతాలను అందజేసినట్లు తెలిపారు. ఖాతాదారులకు సేవలను అందించడంలో ఐ ఓ బి అగ్రస్థానంలో నిలుస్తుందని అన్నారు. ప్రాథమిక పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు లయన్ అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఐ ఓ బి అందిస్తున్న సహకారం గొప్పదన్నారు. ఐ ఓ బి వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు విద్యా సామాగ్రిని పంపిణీచేసిన బ్యాంక్ మేనేజర్ అబ్దుల్ రహీం, అసిస్టెంట్ మేనేజర్ శివశంకర్, క్యాషియర్ గోవర్ధన్ లను ఉపాధ్యాయులు సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఇంచార్జ్ హెచ్ యం లు దోమ శంకర్, అశ్విని చంద్రశేఖర్, నాగేశ్వర్ రెడ్డి, మదన్ మోహన్,కావాలి సుజాత గ్రామస్థులు బోయ రాజు, మహమూద్,వెంకట్రాములు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రనీ పరిశీలించిన ఎస్పీ

### ...పోలింగ్ రోజు కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలి

### -- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



నారాయణపేట మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 విజన్ ఆంధ్ర మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలోని జంగిడి గడ్డ కాలనీ, 11వ వార్డు, శివాజీ నగర్‌లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి భద్రతాపరమైన పలు కీలక సూచనలు చేశారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూపోలింగ్ సమయంలో పోలింగ్ కేంద్ర పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, గుంపులపై నిరంతరం నిఘా ఉంచాలని, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్లు సక్రమంగా నిర్వహిస్తూ ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా చూడాలని ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రం లోపల, బయట సరైన బందోబస్తు ఏర్పాటు చేయడం, సీసీ కెమెరాల నిఘా పర్యవేక్షణ, వాహనాల నియంత్రణ, అనవసర వ్యక్తుల ప్రవేశాన్ని అడ్డుకోవడం వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో భద్రత కల్పిస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఎస్పీ తో పాటు ఎస్సై వెంకటేశ్వర్లు, నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## మహాశివరాత్రి సందర్భంగా మంథని నుండి కాళేశ్వరం, వేలాలకు ప్రత్యేక బస్సులు

### -మంథని డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్

మంథని ఫిబ్రవరి 10: మహాశివరాత్రి ని పురస్కరించుకుని మంథని బస్టాండ్ నుండి ఈనెల 14వ తారీకు నుండి 16వ తారీకు వరకు కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి, వేలాల జాతరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు మంథని డిపో మేనేజర్ వి శ్రావణ్ కుమార్ తెలిపారు. మంథని నుండి కాళేశ్వరం కు పెద్దలకు ఫుల్ టిక్కెట్టు 140 రూపాయలు, పిల్లలకు హాఫ్ టికెట్ 80 రూపాయలుగా, మంథని నుండి వేలాల కు పెద్దలకు ఫుల్ టికెట్ 70 రూపాయలు పిల్లలకు హాఫ్ టికెట్ 50 రూపాయలుగా చార్జీ ఉంటుందని తెలిపారు. ఈ బస్సులలో మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని తెలియజేశారు. ఇట్టి సదా అవకాశాన్ని మంథని పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# మున్సిపల్ ఎన్నికలు బాధ్యతాయుతంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి




రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర) : మున్సిపాలిటీ ఎన్నికల విధుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్ మరియు కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను ఎన్నికల సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డితో కలిసి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటికి సంబంధించి శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ అధికారులకు ఇచ్చిన ఎలక్షన్ మెటీరియల్ పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్ మాట్లాడుతూ పోలింగ్ విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ చెక్ లిస్ట్ ప్రకారం ఎన్నికల సామగ్రిని సరిచూసుకున్న తరువాతనే డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి బయలుదేరి వెళ్లాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరిస్తూ విధులు బాధ్యతగా నిర్వహించాలని అన్నారు. 7.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. గడువు లోపు పోలింగ్ కేంద్రం లోనికి చేరుకున్న ఓటర్లకు సాయంత్రం 5.00 గంటలు దాటిన తరువాత కూడా ఓటు వేసేందుకు అవకాశం కల్పించామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా అంకితభావంతో కృషి చేయాలని ఎన్నికల సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఎక్కడ కూడా రీపోలింగ్ కు ఆస్కారం లేకుండా పక్కాగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలని, ఓటింగ్ సందర్భంగా గోప్యతను కాపాడేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. చెక్ లిస్ట్ ప్రకారం పోలింగ్ మెటీరియల్ క్షుణ్ణంగా పరిశీలించి, అన్ని సరిగా ఉన్నాయని నిర్ధారణ చేసుకొని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి బయలుదేరాలని సూచించారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, పోలింగ్ సిబ్బంది నిర్వహించే వారి విధులను క్షుణ్ణంగా వివరించారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్ లకు తరలించాలని అన్నారు. శేరిగూడలో మండల్ పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూమును పరిశీలించారు. మహేశ్వరం డిసిపి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎలాంటి సంఘటనలు జరగకుండా భద్రత కల్పించడం జరుగుతుందని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు

**-- ప్రశాంత వాతావరణంలో ఓటు వినియోగించుకోండి**

**జిల్లా ఎస్పీ డి.జానకి,**

**ఎన్నికల నిర్వహణకు 1148 మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు**

**-- జిల్లా ఎస్పీ డి ఊ**

మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో ఫిబ్రవరి 10 విజన్ ఆంధ్రమున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు పోలీస్ బందోబస్తుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ డి జానకి తెలిపారు. బుధవారం భూత్పూర్ దేవరకద్ర మునిసిపాలిటీలలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, వాతావరణంలో ప్రజలు ఓటుహక్కు వినియోగించుటకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. ఈ ఎన్నికల సందర్భంగా మొత్తం 82 వార్డులలో,143 పోలింగ్ లొకేషన్లలో,320 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ జరగనున్నట్లు తెలిపారు, అందులో87 క్రిటికల్ పోలింగ్ లొకేషన్లలో ఉన్నాయని తెలిపారు. ఎన్నికలు జరిగే మునిసిపాలిటీల పరిధిలో 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, దీనిని ప్రజలు, రాజకీయ పార్టీలు మరియు అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీస్పష్టం చేశారు. ఇప్పటి నుండి బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్ చేరేవరకు అప్రమత్తతఎలక్షన్ రోజు, ఎలక్షన్ అనంతరం బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌లకు చేరే వరకు పోలీసు అధికారులు మరియు సిబ్బంది పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి, పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలలో



పాటించాల్సిన నియమాలు, నిబంధనలను సిబ్బందికి వివరంగా తెలియజేశారు. ఎలక్షన్ సమయంలో సమస్యలు సృష్టించే వ్యక్తులు లేదా అవాంఛనీయ ఘటనలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలోకి ఎవరినీ అనవసరంగా అనుమతించరాదని,పోలింగ్ కేంద్రాలకు సెల్ ఫోన్లు, ఇంక్ బాటిల్స్ లేదా ఇతర నిషేధిత వస్తువులు తీసుకురాకుండా కఠినంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మొబైల్ రూట్ టీమ్‌లు, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిఎన్నికల రోజు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మొబైల్ రూట్‌లలో ఏదైనా సంఘటన జరిగితే, క్షణాలలో సంబంధిత మొబైల్ టీమ్‌లు సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరించే విధంగా సిద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ తెలిపారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ఏదైనా సమస్య లేదా అసాధారణ పరిస్థితి ఎదురైతే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి, సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఎన్నికల బందోబస్తు నిమిత్తం మొత్తం 1148 మంది పోలీస్ మరియు అనుబంధ సిబ్బందిని వినియోగించడం జరుగుతోందని తెలిపారు. చివరగా, సిబ్బంది ప్రతి ఒక్కరు చురుకుగా, బాధ్యతాయుతంగా, పూర్తిగా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా పనిచేయాలని జిల్లా ఎస్పీ డి.జానకి సూచించారు.

# మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు

**పోలింగ్ పూర్తి అయ్యేవరకు అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి**

**స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి**

**ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలలో 163 దీఛీూ (144 సెక్షన్ అమలు)**

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

నారాయణపేట మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 విజన్ ఆంధ్ర మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నారాయణపేట, మక్తల్, కోస్గి, మద్దూర్ మున్సిపాలిటీల పరిధిలో జరుగు ఎన్నికల నేపథ్యంలో ప్రజలు స్వేచ్ఛయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునెల, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 5,50 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ తెలిపారు. ఎన్నికల బందోబస్తు వచ్చిన పోలీసులకు మంగళవారం రోజు నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎా= గార్డెన్ లో, మద్దూర్, కోస్గి బందోబస్తు పోలీసులకు కోస్గి లోని పంచాక్షరి ఫంక్షన్ హాల్ లో ఎన్నికల విధులు నిర్వహించే పోలీస్ అధికారులకు , సిబ్బందికి ఎన్నికల విధులపై జిల్లా ఎస్పీ దిశ నిర్ధేశం చేశారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు నాలుగు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 28 రూట్లుగా డివైడ్ చేసి, రూట్ మొబైల్స్ ఇన్స్పెక్టర్ స్థాయి అధికారితో రిసర్వ్ టీమ్స్ , స్ట్రయికింగ్ ఫోర్స్ స్పెషల్, స్పెషల్ స్ట్రయికింగ్ ఫోర్స్ ఏర్పాటు చేసి మొత్తం 800 మంది పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ కేంద్రాలను వదిలి వెళ్లరాదని, 100 మీటర్ల వరకు ముగ్గుతో



మార్కింగ్ వేయించి ఎవరిని లోపలికి రానివ్వరాదు అని, వాహనాల పార్కింగ్ 200 మీటర్ల దూరంలోనే వాహనాల పార్కింగ్ చేయాలని, ప్రజలు ఎవరు గుంపులు గుంపుగా ఉండకుండా చూడాలని తెలిపారు. రూట్ మొబైల్ అధికారులు తమకు కేటాయించిన రూట్లలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద, రూట్లలో ఎన్నికల ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, మందుగుండు సామగ్రి, ఇంక్ బాటిళ్లు, వాటర్ బాటిళ్లు తీసుకువెళ్లడం నిషేధమని, పోలింగ్ బూత్‌లో సెల్ఫీలు దిగడంపై పూర్తిగా నిషేధం ఉంటుందని తెలిపారు. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలలో 163 దీఛీూ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఆంక్షలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే చట్టపరమైన తీసుకుంటాని తెలిపారు. ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరికీ బాధ్యత అన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హూల్ హాక్, సిఐలు శివ శంకర్, రవి బాబు, సైదులు, భగవత్ రెడ్డి, ఎస్ఐ లు పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బందోబస్తుకు వచ్చిన పోలీసులకు కిట్లు అందించిన: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



నారాయణపేట మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ ఎన్నికల బందోబస్తు విధుల నిమిత్తం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బంది విధులు సమర్థవంతంగా నిర్వర్తించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ తెలిపారు. నారాయణపేట టౌన్ ఎస్ఐ సొంతంగా బందోబస్తు సిబ్బంది అవసరాల నిమిత్తం టూత్ బ్రష్, టూత్ పేస్ట్, సోప్, షాంపూ, షేవింగ్ కిట్, వాటర్ బాటిల్, పెన్, దువ్వెన, ఫేస్ మాస్క్, నాప్కిన్స్ తదితర అవసరమైన వస్తువులతో ప్రత్యేకంగా కిట్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కిట్లను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ బందోబస్తు విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న సిబ్బంది సంక్షేమంపై చూపిన శ్రద్ధకు గాను నారాయణపేట సీఐ శివశంకర్, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.
ఎన్నికల సమయంలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది సంక్షేమమే ప్రధానమని, సిబ్బంది ఆరోగ్యం, సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఇటువంటి కార్యక్రమాలు సిబ్బందిలో ఉత్సాహాన్ని పెంచి విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సంబంధిత పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడు అంచెల భద్రత ఏర్పాటు

### -- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

### ...కట్టుదిట్టమైన భద్రతల మధ్య స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు.



**నారాయణపేట మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 విజన్ ఆంధ్ర** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సలను భద్రపరచేందుకు నాలుగు మున్సిపాలిటీల వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు మరియు కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడు అంచెల భద్రతాను ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. బ్యాలెట్ బాక్సల భద్రత కోసంకోస్గి పట్టణంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, మద్దూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను లిజిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి లోటుపాట్లు లేకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాల ద్వారా 24 గంటల నిఘా, స్ట్రాంగ్ రూమ్ వద్ద ఆర్మ్డ్ ఫోర్స్ ఏర్పాటు, బయట వైపు సివిల్ పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తుఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. బ్యాలెట్ బాక్సల డిస్ట్రిబ్యూషన్ నుంచి పోలింగ్ అనంతరం వాటిని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించడం, అక్కడ భద్రపరచడం వరకు ప్రతి దశలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,కౌంటింగ్ సమయంలో అనుమతించవలసిన వ్యక్తులు, మీడియా పాయింట్,వాహనాల పార్కింగ్,కౌంటింగ్ సమయంలో తీసుకోవలసిన భద్రతా చర్యలు తదితర అంశాలు, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు నిర్లక్ష్యం వహించవద్దని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని ఎస్పీ అధికారులకు స్పష్టం చేశారు.

## ఎర్ర గుట్ట చెక్‌పోస్ట్ వద్ద రూ.1,17,000 నగదు పట్టివేతసీఐ శివ శంకర్



నారాయణపేట మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 విజన్ ఆంధ్ర మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీలలో భాగంగా నారాయణపేట పట్టణంలోని ఎర్ర గుట్ట చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు సిఐ శివ శంకర్, ూ× వెంకటేశ్వర్లులు తెలిపారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ షఫీ అనే వ్యక్తి యాదగిరి నుండి మహబూబ్‌నగర్‌కు రూ. 1,17,000 నగదును తీసుకెళ్తుండగా ఎర్ర గుట్ట చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ నిర్వహించగా, ఆ నగదుకు సంబంధించి ఎటువంటి సరైన బిల్లులు లేదా ఆధారాలు చూపించలేకపోయాడని తెలిపారు. దీంతో ఎన్నికల నిబంధనల మేరకు ఆ నగదును స్వాధీనం చేసుకొని, తదుపరి చర్యల నిమిత్తం గ్రీవియన్స్ కమిటీకి అప్పగించడం జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఎవరైనా అనుమానాస్పద నగదు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు ఎన్నికల నిబంధనలను పాటించాలని ఆయన సూచించారు.

# ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు వినతిపత్రం అందజేత

కమాన్ పూర్ ఫిబ్రవరి 10: ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యం లో కమాన్ పూర్ మండల కేంద్రం లో సమాజనికి ఆదర్శప్రాయుడు, వీర యోధుడు,హిందూ ధర్మ రక్షకుడు, హిందూ సామ్రాజ్యాధినేత శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. తద్వారా భావితరాలకు వారి యొక్క గొప్పతనాన్ని మరియు స్ఫూర్తి అందించాలని ముఖ్య ఉద్దేశం తో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం పెట్టదళచాము. ఇందులో భాగంగా ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ కి, మరియు పంచాయతీ కార్యదర్శి మరియు ఎంపీడీవో కి వినతిపత్రం అందజేయడం జరిగింది. యొక్క కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ యువసేన వ్యవస్థాపకులు జంగపల్లి శ్రీనివాస్ , అధ్యక్షులు మల్యాల శేఖర్ గౌడ్, యువసేన నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



## స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాట్లును పరిశీలించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి



మల్కాజిగిరి, ఫిబ్రవరి 10, (విజన్ ఆంధ్ర): మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్ ల సాధారణ ఎన్నికల 2026లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లోని పలు మున్సిపాలిటీ లలో ఎన్నికలకు ఉపయో గించే సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. మంగళవారం ఆయన , సాధారణ ఎన్నికల పరిశీల కులు నిర్మల కాంతి వెస్లే తో కలిసి మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లతో పాటు స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సామాగ్రి, సిబ్బందిని పోలింగ్ బూత్ లకు నిర్ణీత సమయం లో చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించాలని ఎన్నికల సిబ్బందిని కోరారు . స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్లకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రతి కౌంటింగ్ టెబుల్స్ దగ్గర సిసి కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి
ఆదేశించారు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై క్షుణ్ణ పరిశీలన.!

### శ్రీశైలం దేవస్థానంలో భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి.!

### జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాలు.!

శ్రీశైలం( విజన్ ఆంధ్రా)నంద్యాల, ఫిబ్రవరి 10 :శ్రీశైలం లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానానికి విచ్చేయు లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీశైలం దేవస్థానంలో భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు.దేవస్థానం ప్రారంభ ద్వారం నుండి భక్తుల క్యూ లైన్లు, క్యూ లైన్లలో ఏర్పాటు చేసిన త్రాగునీరు, అల్పాహార పంపిణీ కేంద్రాలు, శానిటేషన్ ఏర్పాట్లు తదితర అంశాలను చివరి వరకు పరిశీలించి, మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. శివ స్వాములు విశ్రాంతి తీసుకునే చంద్రావతి కళ్యాణ మండపాన్ని సందర్శించి అక్కడ కల్పించిన సదుపాయాలపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గుడి వెలుపల ఉన్న క్యూ లైన్ల నుండి అమ్మవారి దర్శనం అనంతరం నిష్క్రమణ వరకు ఏర్పాటైన మార్గాలను తనిఖీ చేసి, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అల్పాహారం, త్రాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. భద్రత పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రతి భక్తుడిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ప్రధాన ద్వారం నుండి దర్శనం అనంతరం నిష్క్రమణ మార్గాల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు (ఐఖీవీణలు) ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే ఉ న్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో అదనంగా చేపట్టిన ఏర్పాట్లను కూడా కలెక్టర్, ఎస్పీ పరిశీలించి అవసరమైన మార్గనిర్దేశం చేశారు. భక్తులు పోలీసు అధికారుల సూచనలను పాటిస్తూ తమ వాహనాలను ఇతరులకు ఆటంకం కలగకుండా నిర్ణీత పార్కింగ్ ప్రాంతాల్లో పార్కింగ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈఓ శ్రీనివాసులు, దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహదేవప్ప ఆత్మహత్యపై విచారణ చేయాలి

### మాఫియా రాజకీయాలతోనే ఆత్మహత్య

### కుటుంబ సభ్యులకు బిజెపి నేతల పరామర్శ

మక్తల్,ఫిబ్రవరి10 : తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేళ నారాయణ పేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి, గిరిజన బిడ్డ ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య చేసుకొవ డం తీవ్ర కలకలంగా మారింది. మాఫియా రాజకీయాలు, అహంకార ధోరణి తట్టుకోలేకే మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆత్మహత్యపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు స్పందించారు. మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఇది అత్యంత బాధాకరమైన ఘటన అని, మహదే వప్ప కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపి డికె అరుణతో కలసి వారినిపరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయిం చాలన్నారు. ఆత్మహత్యకు వేధింపులే కారణమని అన్నారు. ఇదిలావుంటే మహదేవప్పది ఆత్మహత్య కాదు కాంగ్రెస్ చేసిన హత్య అని ఎంపి డికె అరుణ మండిపడ్డారు. 'ఓటమి భయంతోనే బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని రాళ్లతో కొట్టే పరిస్థితి రాబోతోంది. మా సహనాన్ని పిరికితనంగా భావిస్తారా?. ఎన్నికల తరువాత కాంగ్రెస్‌పై యుద్ధం చేయబోతున్నాం. బీఆర్ఎస్ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ కార్యకర్తలదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయి. మహదేవప్ప ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలి. నిష్పాక్షికంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.

# మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

### జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10( విజన్ ఆంధ్ర)భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 106 వార్డులు ఉండగా, 1,85,348 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఇందులో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 60 వార్డులు -- 1,34,775 మంది ఓటర్లు, అశ్వరావుపేట మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులు -- 16,850 మంది ఓటర్లు, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులు -- 33,723 మంది ఓటర్లు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు.పోలింగ్ నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 90 పోలింగ్ లొకేషన్లలో 288 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో 49 సున్నితమైన పోలింగ్ స్టేషన్లను గుర్తించి ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టామని, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్లు లేవని చెప్పారు. అయితే, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 4 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు.పోలింగ్ నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామక ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 345 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,036 మంది ఇతర పోలింగ్ అధికారులు (రిజర్వ్‌తో కలిపి) నియమించామని చెప్పారు. అదేవిధంగా 48 మంది రిటర్నింగ్ అధికారులు, 48 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నియమించామని, కౌంటింగ్ సిబ్బందిని ముందుగానే గుర్తించి అవసరమైన శిక్షణ అందించినట్లు వెల్లడించారు.కౌంటింగ్ నిర్వహణ కోసం జిల్లాలో మూడు కౌంటింగ్ కేంద్రాలను గుర్తించి నోటిఫై చేసినట్లు తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాల, ఇల్లందు మున్సిపాలిటీకి సింగరేణి కమ్యూనిటీ హాల్ (24 ఏరియా), అశ్వరావుపేట మున్సిపాలిటీకి వ్యవసాయ కళాశాల, అశ్వరావుపేటలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా ప్రాంగణాల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు



కూడా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.బ్యాలట్ బాక్సులు, బ్యాలట్ పేపర్లు సహా ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ పూర్తయ్యిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై పర్యవేక్షణ కోసం ఎంచుకున్న పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం 31 జోనల్ అధికారులు, 8 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 10 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్‌టీలు) ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని చెప్పారు. సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ నిబంధనలు అమలులో ఉన్నాయని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రేపు పోలింగ్ జరిగే మున్సిపాలిటీ ప్రాంతాల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రతి అర్హత కలిగిన ఓటరు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగస్వాములవ్వాలని ఆయన కోరారు.ఎన్నికల నిర్వహణలో ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, అధికార యంత్రాంగం సమన్వయంతో సహకరించి మున్సిపల్ ఎన్నికలను శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు తోడ్పడాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ విజ్ఞప్తి చేశారు.

## గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ఎలక్షన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమావతి



సిద్ధిపేట జిల్లా ప్రతినిధి10 ఫిబ్రవరి (విజన్ ఆంధ్ర) సిద్ధిపేట జిల్లా కేంద్రంలో గల గజ్వేల్ - ప్రజ్ఞాపూర్మున్సిపాలిటీ లోని అర్అండ్ఆర్ కాలనీ లోజిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల-ఏటిగడ్డ కిస్టాపూర్వార్డ్ నెంబర్-10 34, 35, 36 పోలింగ్ స్టేషన్ వార్డ్ నంబర్ -12 లో 42 పోలింగ్ స్టేషన్లు, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఎర్రవల్లిమరియుసింగారంవార్డ్ 7 లో 25, 26, 27 పోలింగ్ కేంద్రాలు, మండలపరిషత్ప్రాథమికోన్నత పాఠశాల - పల్లె పహాడ్ వార్డ్ నెంబర్-8 లోని 28, 29 30 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారిమాట్లాడుతూ... స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సిబ్బంది, పొలిటికల్ ఏజెంట్, పోలింగ్ బూత్, బ్యాలెట్ బాక్స్ ఉండే విధానంగూర్చిఅధికారులకు సూచనలు చేశారు. పోలింగ్ సిబ్బందికి ఈ రోజు రాత్రి భోజనం, రేపు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం సాయంత్రం టీ, స్నాక్స్ పోలింగ్ సిబ్బందికి అందించాలని, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలిగించకుండాచూసుకోవాలనిఅధికారులనుఆదేశించారు. వైద్య శిబిరం, బిఎల్ఓ స్లిప్ పంపిణీ పోలింగ్ కేంద్రం బయటనే ఉండాలని తెలిపారు. పోలింగ్ కేంద్రంలో 100 మీటర్ల వరకు వాహనాలను అనుమతి లేదని వృద్ధులను వికలాంగులను వీల్ చైర్ ద్వారా లోపలికి తీసుకురావాలని, ఫోన్ ఎవ్వరిని అనుమతి లేదని పోలింగ్ స్టేషన్ కి 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తూ గట్టి బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులను ఆదేశించారుకలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, తహసిల్దార్ శ్రావణ్, పోలీస్ అధికారులు తదితరులు ఉన్నారు.

# సిపిఐకే మొగ్గు చూపుతున్న ఓటర్లు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 (విజన్ ఆంధ్ర)కొత్తగూడెం :కార్పొరేషన్ ఎన్నికలో ఓటర్లు సిపిఐ వైపు మొగ్గు చూపుతున్నట్లు సుస్పష్టంగా కనిపిస్తోంది. అని అన్నారు స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు కృషితో నూతన కార్పొరేషన్గా ఆవిర్భవించడంతో ఇక్కడ ఎన్నికల సందడి జోరుగా ఉంది. కొత్తగూడెం, పాల్వంచ సుజాతనగర్లోని కొంతభాగం కలిపి కార్పొరేషన్గా అవతరించింది. పాతికేళ్లుగా పాల్వంచలో మున్సిపాలిటీ ఎన్నికలు జరగలేదు. ఇప్పుడు కార్పొరేషన్ కావడంతో అక్కడ ఎన్నికలు జరుగుతుండటంతో పండుగ వాతావరణం ఏర్పడింది. కార్పొరేషన్ తీసుకొచ్చేందుకు తీవ్ర కృషి చేసిన సిపిఐ కి ఓటు వేసేందుకు ఓటర్లు ఆసక్తిగా ఉన్నారు. దీంతో కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో సిపిఐ అగ్రస్థానాలను కైవసం చేసుకుని నూతన కార్పొరేషన్పై ఎర్రజెండా ఎగురవేయనుందిఈ 26 నెలల కూనంనేని పాలనలో కొత్తగూడెం నియోజకవర్గం దినదినాభివృద్ధి చెందింది. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఎర్త్ యూనివర్సిటీ పాల్వంచ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఈ యూనివర్సిటీలో చదువుకునేందుకు దేశ విదేశాల నుండి విద్యార్థులు ఇక్కడికి చేరుకోనున్నారు. భూగర్భ, గోళ శాస్త్రానికి సంబంధించి అన్ని రకాల పరిశోధనలకు కొత్తగూడెం నియోజకవర్గం కేంద్రం కానుంది. ఈ యూనివర్సిటీ ఏర్పాటుతో ప్రపంచ వ్యాప్తంగా కొత్తగూడెం పేరు మార్మోగింది. పాల్వంచ కేంద్రంగా 800 మెగావాట్ల రెండు విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు మార్గం సుగుమమైంది. దీంతో మరోసారి రాష్ట్రంతో పాటు దేశానికి విద్యుత్ సరఫరా చేసేందుకు అవకాశం లభిస్తుండగా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు మెరుగువడనున్నాయి. హైదరాబాద్, సికింద్రాబాద్ తర్వాత అతిపెద్ద కార్పొరేషన్ కొత్తగూడెం కార్పొరేషన్ మారనుంది. దీంతో పెద్ద ఎత్తున నిధురు రానున్నాయి. పారిశ్రామిక వేత్తలు సైతం భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మొగ్గు చూపుతుంటారు. తద్వారా ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా ప్రజలుఆర్థిక పరిపుష్టి సాధించనుండటంతో తలసరి ఆదాయంలో మార్పులు చోటు చేసుకోనున్నాయి. విమానాశ్రయం ఏర్పాటు దాదాపు పూర్తి కావస్తోంది. కేంద్ర విమానాయాశాఖ మంత్రిత్వ శాఖ ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటుకు కావాల్సిన భూ సర్వే పూర్తి చేసింది. త్వరలో ఆ కల కూడా సాకారం కానుంది. జాతీయ రహదారులు శాఖ ఆధ్వర్యంలో రూ.500 కోట్లతో రెండు ఆవుటర్ రింగ్లు త్వరలో ఏర్పాటు కానున్నాయి. ఈ నిధులను రాబట్టేందుకు కూనంనేని పదేపదే వినతులు చేయగా ఎట్టకేలకు మార్గం సుగుమమైంది. ఈ రింగ్‌రోడ్లు పూర్తయితే కొత్తగూడెం పాల్వంచ పట్టణాల్లో ట్రాఫిక్ నియంత్రణ జరగనుంది. ఇందు కోసం కూనంనేని ప్రత్యేక ప్రణాళికను



రచించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు త్వరలో జరగనుంది. ఈ విద్యాలయం ఏర్పాటు ద్వారా ఇక్కడి విద్యార్థినీ విద్యార్థులకు అత్యంత నాణ్యమైన విద్య అందనుంది. కూనంనేని ఎంఎల్ఏగా గెలిచిన నాటి నుండి ఇప్పటి వరకు కోట్లా రూపాయల నిధులు తీసుకొచ్చి మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నారు. మారుమూల ప్రాంతాల్లో సైతం రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేశారు. మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించారు. ఇందుకు సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. రాగద్వేషాలకు తావు లేకుండాఅర్హులైన పేదలకు ప్రభుత్వం పథకాలు చేరవేసేందుకు కూనంనేని చూపుతున్న చొరవ మరువలేనిది. ఇందిరమ్మ ఇళ్లు షాదీముబారక్ కళ్యాణ లక్ష్మీ, ఆరోగ్య శ్రీ వంటి సేవలను అతి వేగంగా అందజేస్తూ గూడెం నియోజకవర్గ ప్రజల్లో చెరగని ముద్రను వేసుకుంటున్నారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్చించి మేలు చేసే కార్యక్రమాలు చేపడుతున్నారు. కార్మికు శ్రేయస్సుకు పెద్దపీఠ వేస్తూ వారి సంమమే ధేయ్యంగా ముందుకు సాగుతున్నారు. సంగరేణి కార్మికుల సొంతింటి కల సాకారమయ్యేందుకు ఇప్పటే ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రాలు సమర్పించారు. కార్పొరేషన్ పరిధిలోని రామవరం ఏరియాలో సింగరేణి విశ్రాంత కార్మికులు ఉంటున్న క్వార్టర్లను సింగరేణి సంస్థ వారికే ఇచ్చేలా కృషి చేస్తున్నారు. వలు ప్రాంతాల్లో పేదలు ఉంటున్న ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాల సాక్షిగా తనదైన శైలిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాన్ని నొప్పించకుండాఅగ్రస్థానాల్లో: అవినీతి రహిత అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎలి కూనంనేనిఒప్పిస్తూ నిధులను తీసుకొచ్చి అభివృద్ధి పథంలో ఈ ప్రాంతాన్ని సిపిఐ ఎంఎల్ఏగా కూనంనేని కృషిని ఓటర్లు అభినందిస్తున్నారు. దోపిడీ, ధౌర్జన్యాలు లేని, అవినీతి, హింసకు తావులేని ప్రశాంత వాతావరణంలో నియోజకవర్గం పరిడమిల్లుతుండటంతో ఈ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐకి ఓటు వేస్తే మరింత మేలు జరుగుతుందనే భావనలో ఓటర్లు ఉన్నారు. దీంతో నేడు జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున సిపిఐకి ఓట్లు వడనున్నట్లు రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. నేతృత్వం, జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా సారధ్యంలో కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ అగ్రస్థానాలను కైవసం చేసుకోనుంది. 60 డివిజన్ల వ్యాప్తంగా ఒంటరి పోరుకు దిగిన కమ్యూనిస్టు పార్టీ తనదైన శైలిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రచారంలో ప్రజల నుండి అందిన ఆదరణ సిపిఐ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహాన్ని ఇచ్చింది. కార్పొరేషన్ వ్యాప్తంగా 33 నుండి 35 స్థానాలను కైవసం చేసుకునే అవకాశాలు ఉన్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. మేయర్ పీఠం దక్కాలంటే సిపిఐ 31 స్థానాల్లో సత్తా చాటాల్సి ఉంది. కానీ అంతకంటే అధిక స్థానాలు దక్కనుండటంతో మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలు సిపిఐనే వరించనున్నాయి.ప్రత్యర్థుల్లో అంతర్మదనం : సిపిఐకి అందుతున్న ప్రజాదరణను చూసి ప్రత్యర్థులు అంతర్మధనంలో వడ్డారు. ఈ ఆవేదనఅధికార కాంగ్రెస్ పార్టీలో మరింత ఎక్కువగా ఉంది. కార్పొరేషన్ ఎన్నికల పొత్తుల వ్యవహారంలో ఆఖరి నిమిషం వరకు సీట్ల సర్దుబాటు జరుగుతుందనుకున్నా సంఖ్యా పరమైన బేదాభిప్రాయాలు తలెత్తడంతో సిపిఐ నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకు కూనంనేని చిరస్మరణీయమైన నిర్ణయాన్ని తీసుకోగా, జిల్లా కార్యదర్శి సిపిఐ అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. దీంతో రసవత్తర పోరు మొదలైంది. ఇక్కడ ప్రధానంగా సిపిఐ, కాంగ్రెస్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. గత గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సైతం ఇదే కథ చోటు చేసుకోవడంతో సిపిఐ మేజర్ గ్రామ పంచాయితీలను కైవసం చేసుకుని కాంగ్రెస్ కంటే అధిక శాతం ఓట్లను రాబట్ట గలిగింది. ఇప్పుడు కూడా సేమ్ సీన్ రిపీట్ కానుంది. సిపిఐకి అందిన ప్రజాదరణకు ప్రత్యర్థులకు బైర్లు కమ్మడంతో మంత్రి పదేపడే ఇక్కడికి వచ్చి పరువు దక్కించుకునేందుకు పాకులాడుతున్నారు. ఎంపి రామ సహాయం రాఘురామిరెడ్డి సైతం ఇక్కడే మకాం వేసి గ్రామ పంచాయితీ ఎన్నికల్లో పోగొట్టుకున్న ప్రతిష్టను దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ప్రధానంగా సిపిఐ 30 నుండి 35 స్థానాలు దక్కించుకునే అవకాశం ఉండగా, కాంగ్రెస్ 18 నుండి 22, బిఆర్ఎస్ 6 నుండి 8 డివిజన్లలో నెగ్గే అవకాశం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కూనంనేని నేతృత్వం, సాబీర్ పాషా సారథ్యం ఈ ఎన్నికల్లో సత్ఫలితాలు ఇవ్వనుండగా కార్పొరేషన్ పై ఎర్రజెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తోంది

## షార్ట్ సర్క్యూట్ తో పూజా స్టోర్ దగ్ధం దురదృష్టకరం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 10, జయశంకర్ భూపాలపల్లి పట్టణంలోని కాళేశ్వరం రోడ్డులో మహేశ్వర పూజా స్టోర్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధం అవ్వడం దురదృష్టకరమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. షార్ట్ సర్క్యూట్ తో బుక్క దుకాణం పూర్తిగా కాలిపోయిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత వ్యాపారిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ ప్రమాదం దురదృష్టక రమన్న ఎమ్మెల్యే, ప్రభుత్వం తరఫున అందుబాటులో ఉన్న అన్ని విధాలా సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సంబంధిత అధికా రులను ఎమ్మెల్యే ఆదేశించారు. అగ్నిప్రమాదాల పట్ల వ్యాపారులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## అధికారులు ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

### -- అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తే ఆందోళనలు

### -- మాజీమంత్రి వి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో ఫిబ్రవరి 10 విజన్ ఆంధ్ర ఎన్నికలలో అధికారులు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తే పెద్ద ఎత్తున ఉద్యోగి ఇస్తామని మాజీమంత్రి వి శ్రీనివాన్ గౌడ్ హెచ్చరించారు.మంగళవారంమహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని మాజీమంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఎన్నికలు నిస్పక్షపాతంగా..సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు రాజ్యాంగం లో నియమావళి ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే ఎన్నికల కమిషన్ పరిధిలో అధికారులు పని చేయాలి..రాష్టంలో కానీ..మహబూబ్ నగర్ జిల్లాలో ఆ పరిస్థితి కనిపిస్తలేదు. పోలీస్ అధికారులే మొత్తం నడుపుతున్నారు.. అన్ని శాఖల పనులు విల్లు చేస్తున్నారు. తెలంగాణ పోలీస్ అంటేనే దేశంలో మంచి పేరు ఉంది..కొందరు అధికారుల తీరుతో చెడ్డపేరు వస్తుంది.పోస్టింగ్..డబ్బుల కోసం కొందరు అధికారులు పోలీస్ వ్యవస్థకు చెడ్డపేరు తీసుకువస్తున్నారు. నామినేషన్ వేయడానికి కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల వెంట పెద్ద మొత్తంలో కార్యకర్తలను అనుమతించారు. బీ ఆర్ ఎస్ పార్టీ వారి వెంట మాత్రమే నిబంధనల ప్రకారం ముగ్గురిని పంపిస్తున్నారు. నామినేషన్ ఉప్పసంహరించుకోమని ఒత్తిళ్లు తెచ్చారు.. వేధింపులు భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి జిలాల్లో ఉ ంది..ముఖ్యమంత్రి సొంత జిల్లా లో ఈ పరిస్థితి ఉంది;సామాన్యులు స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితి మహబూబ్ నగర్ లో లేదు.పోలీస్ లే అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారు ఎన్నికల అధికారులకు జరుగుతున్న విషయాలపై మాట్లాడితే అంత పోలీస్ చేస్తున్నారు..మాకు తెలియదని అంటున్నారు.ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నాము..బీఆర్ ఎస్ పార్టీ లేదని మాట్లాడుతున్న మీరు ఎందుకు ఇట్లా చేస్తున్నారు.. బీఆర్ఎస్ పార్టీని చూసి ఎందుకు భయపడుతున్నారు. కాంగ్రెస్..బీజేపీ జాతీయ స్థాయిలో కొట్లాడుతూ ఇక్కడ కలిసి పనిచేస్తున్నారు.పోలీస్ చర్యలను ఎవరు హర్షించరు..తిరగబడే రోజులు వస్తాయి.ఎన్నికల కమిషన్ కి లెటర్ రాస్తున్నాం.. రాష్టంలో శాంతి భద్రతలు కరువు అయ్యాయి.దీనిమీద విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరాం.ఒక కమిటి వేసి విచారణ నిర్వహించి అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలి,కొట్టడం బెదిరియడం ఇండ్ల మీదకు పోయి మీ నాన్న జాగ్రత్త నీ వ్యాపారం నడవదు అని బెదిరించడం ఏమిటిఎన్నికలు సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి.ఏదైనా ఘటనలు జరిగిన .. అధికారులు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగుతాయి. ఒక పార్టీ కి సంబంధించి అభ్యర్థి స్వచ్ఛందంగా వచ్చి మద్దతు ఇస్తామని ముందుకు వస్తే అతనిని పోలీస్ లు బెదిరించి మాట మార్చేవిధంగా చేసారు.ఇలాంటి అరాచక శక్తులకు ప్రజలు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందిఇలాంటి చర్యల కారణంగానే అనేక పోరాటాలు పుట్టుకొచ్చాయి..పోలిసుల తీరు మారకపోతే ఉద్యమాలు పెద్దమొత్తంలో మొదలవుతాయి. అధికార పార్టీకి అనుకూలంగా పని చేస్తున్న అధికారులపై ఆధారాలతో సహా ఎన్నికల కమిషన్ కు పంపించాం , అధికారులను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని కోరతాం. సమావేశంలో న్యాయవాదులు బెక్కం జనార్దన్, మనోహర్, కరుణాకర్ గౌడ్, స్వదేశ్, మురళి, ఉమామహేశ్వరి, రవిప్రకాష్, శ్రీహరి, రాంనాథ్ గౌడ్, రామ్ కుమార్ , మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. **RNI.NO.70731/1999** EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.